ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

ప్రజా కలం

Published From Nizamabad

PRGI No.TELTEL/2010/33275

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
5 Lines Rs.250 only
&
Public Notice Advertising
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

శనివారం | 26-09- 2026 | సంపుటి: 17, సంచిక: 175, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ఎడిటర్: కలకొండ రామకృష్ణ

గంగమ్మ ఒడికి..

మధ్యాహ్నానికే గంగ ఒడికి ఖైరతాబాద్ గణపతి



హైదరాబాద్, సెప్టెంబర్ 25 (ప్రజాకలం) :

సర్వాంగ సుందరంగా అలంకరించిన వాహనాలు.. భక్తుల భజనలు, కోలాటాలు, నృత్యాలు.. గణేశ్ మహారాజ్ కీ జై అనే నినాదాల మధ్య గౌరీ తనయుడు గంగ ఒడికి చేరాడు. ఎప్పటిలాగే హైదరాబాద్ మహానగరంలో గణేశ్ శోభాయాత్ర వేలాది మంది భక్తుల కోలాహలం, కేరింతల మధ్య శుక్రవారం అద్భుతంగా సాగింది. రాష్ట్రవ్యాప్తంగా విఘ్నేశ్వరుడి వీడ్కోలు యాత్రలు ఎలాంటి విఘ్నాలు లేకుండా ముగిశాయి. బాలాపూర్ గణేశుడు ఈసారి కూడా అందరి దృష్టినీ ఆకర్షించి తన ప్రత్యేకతను చాటుకున్నాడు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే బాలాపూర్ గణేశుడి లడ్డు వేలంపాటలో ఈసారి రికార్డు స్థాయిలో రూ. 39 లక్షలు పలికింది. శోభాయాత్రలో ఖైరతాబాద్ మహాగణపతి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. ఈ మహానిమజ్జన కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు చక్కని సమన్వయంతో ఎలాంటి అవాంతరాలు లేకుండా నిర్వహించారు. పోలీసులు భూమార్గంతోపాటు ఆకాశం నుంచి కూడా నిరంతరం నిఘా ఉంచి శోభాయాత్రను ప్రశాంతంగా పూర్తిచేశారు.

ఉరిమే ఉత్సాహం.. సడలని భక్తి పారవశ్యం

గణేశ్ శోభాయాత్ర ఆద్యంతం భక్తుల ఉత్సాహం, భక్తిపారవశ్యంతో కొనసాగింది. ఖైరతాబాద్ పంచముఖ సంకటహర గణపతి శోభాయాత్ర సమయంలో సాగర తీరం జనసంద్రంగా మారింది. హుస్సేన్‌సాగర్, సరూర్‌నగర్, సఫిల్‌గూడ, ఐడీఏ బొల్లారం తదితర ప్రధాన కేంద్రాలతోపాటు కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలోని 140 చోట్ల గణపతి విగ్రహాల నిమజ్జనాలు జరిగాయి. రాణిగంజ్ వైపు నుంచి వచ్చిన 20 అడుగుల విగ్రహం ట్యాంక్‌బండ్ ప్రవేశ ద్వారం (కమాన్) వద్ద చిక్కుకోవటంతో రెండు గంటలపాటు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

- హైదరాబాద్‌లో ఘనంగా గణేశ్ శోభాయాత్ర
- జనసంద్రమైన హుస్సేన్‌సాగర్ పరిసరాలు
- రూ.39 లక్షలు పలికిన బాలాపూర్ గణేశుడి లడ్డు
- రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రమాదాల్లో 13 మంది మృతి: డీజీపీ

తరువాయి 2వ పేజీలో...



రెండు పరివారాల మధ్యే దేశ భవిష్యత్తు పోరాటం

గాంధీ పరివార్ వర్సెస్ సంఘ్ పరివార్: సీఎం రేవంత్‌రెడ్డి

రాహుల్‌గాంధీ తదుపరి ప్రధాని అవుతారు

'ఆర్యాడన్ మహమ్మద్' పురస్కారం అందుకున్న తెలంగాణ సీఎం

కేరళ, సెప్టెంబరు 25: దేశ భవిష్యత్తు కోసం గాంధీ పరివార్, సంఘ్ పరివార్‌ల మధ్య పోరాటం జరుగుతోందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు. గాంధీ పరివార్ త్యాగాలకు ప్రతీకగా నిలిస్తే.. సంఘ్ పరివార్ మతం, కులం, ప్రాంతం, భాష పేరుతో దేశాన్ని విభజిస్తోందని ఆయన ఆరోపించారు. భవిష్యత్తులో రాహుల్‌గాంధీ దేశ ప్రధానమంత్రి కావడం తన ఏకైక లక్ష్యమని పేర్కొన్నారు. కేరళలో శుక్రవారం జరిగిన దివంగత కాంగ్రెస్ నేత ఆర్యాడన్ మహమ్మద్ స్మారక పురస్కార ప్రదాన కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేరళ తనకు ఎంతో సన్నిహితమైన రాష్ట్రమని అన్నారు. భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్‌గాంధీతో కలిసి కేరళకు వచ్చానని, అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలోనూ పాల్గొన్నానని గుర్తుచేశారు.

త్యాగాలకు ప్రతీక గాంధీ పరివార్

మహాత్మాగాంధీ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ దేశం కోసం ప్రాణత్యాగం చేశారని రేవంత్‌రెడ్డి అన్నారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ పదవులు, అధికారాన్ని త్యజించారని పేర్కొన్నారు.

తరువాయి 2వ పేజీలో...

కలం కౌంటర్





సాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

- సిఏంఆర్ఎఫ్ ,కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ

పెగడపెల్లి, సెప్టెంబర్ 25 ప్రజాకలం ప్రతినిధి

ధర్మపురి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు సాగు నీటి సమస్య పరిష్కారం దిశగా కృషి చేస్తున్నట్లు సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం పెగడపల్లి మండల కేంద్రంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులతో పాటు కల్యాణ లక్ష్మి చెక్కులను మంత్రి ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధితో పాటు సంక్షేమం పథకాలను ప్రజలకు అందిస్తున్నామని మంత్రి తెలిపారు.

తరువాయి 2వ పేజీలో...

దానంపై సుప్రీంకోర్టు తీర్పు గౌరవిస్తాం

మిగతా 8 ఎమ్మెల్యేల వ్యవహారం భిన్నం:మహేశ్‌గౌడ్

కమిషనర్లను పట్టించుకోని జ్ఞానేశ్‌ను అభిశంసించాలి



హైదరాబాద్, సెప్టెంబర్ 25 (ప్రజాకలం) :

కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఇతర ఎన్నికల కమిషనర్ల అభిప్రాయాలనూ పట్టించుకోకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్న జ్ఞానేశ్‌ను చట్టసభల్లో అభిశంసించాల్సిందేనని నిజామాబాద్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ తేల్చిచెప్పారు. అర్హులైన ఓటర్లు, ఇప్పటికే పలుమార్లు ఓటేసిన వారికీ 'సర్' నోటీసులు ఇచ్చి ఓట్లను తొలగించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అర్హులైన ఓటర్ల తొలగింపునకు విధి విధానాలను రూపొందించడం దారుణమని పేర్కొన్న మహేశ్ కుమార్.. పలువురు ఎన్నికల కమిషనర్‌లు వ్యతిరేకించిన విధానాలను అమలు చేయడం సరి కాదన్నారు. దేశంలో అత్యున్నత స్వతంత్ర సంస్థగా ఉన్న కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్.. అధికార బీజేపీకి అనుకూలంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ఆయన అభిశంసనకు ప్రతిపక్షాలతో కలిసి మద్దతు కూడగడతామని చెప్పారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించడంతోపాటు ఆయన్ను అరెస్టు చేయాలని కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ డిమాండ్ చేశారని ఆయన గుర్తు చేశారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై నిరసనలు తెలుపనున్నట్లు చెప్పారు.

తరువాయి 2వ పేజీలో...

'సర్'పై కాంగ్రెస్‌ది ద్వంద్వ వైఖరి

- కిషన్‌రెడ్డి మండిపాటు..

- ఫిరాయింపులను ప్రోత్సహించే పార్టీకి ఓట్ చోరీ అనే అర్హత లేదని వ్యాఖ్య



హైదరాబాద్, సెప్టెంబర్ 25 (ప్రజాకలం): ఓటరు జాబితా సమగ్ర సవరణ(సర్) బీజేపీ కుట్ర అయితే.. ఈ ప్రక్రియ జరిగిన కేరళంలో కాంగ్రెస్ ఎలా గెలిచిందని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీని నిలదీశారు. కాంగ్రెస్ గెలిస్తే ప్రజాస్వామ్యం గెలిచినట్లు.. మరో పార్టీ గెలిస్తే ప్రజాస్వామ్యానికి విఘాతమా? అని మండిపడ్డారు. 'సర్'పై కాంగట?ప్రది ద్వంద్వ వైఖరి అని ఆయన ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలపై అభ్యంతరకరమైన భాషను వాడకుండా సంయమనం పాటించాలని రాహుల్‌ను డిమాండ్ చేశారు.

తరువాయి 2వ పేజీలో...

విద్యాభివృద్ధికే అత్యధిక ప్రాధాన్యం

భవిష్యత్ తరాలను తీర్చిదిద్దడమే లక్ష్యం

ఎంవీఎస్ జూనియర్ కళాశాల & ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలల అభివృద్ధికి 15 కోట్ల మంజూరు

- ఏఐ యుగంలో టెక్నికల్, స్కిల్ ఎడ్యుకేషన్‌కు పెద్దపీట..
- పాఠశాలలు, ఇంటర్, డిగ్రీ కళాశాలల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ..
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



మహబూబ్‌నగర్ ప్రజాకలం ప్రతినిధి సెప్టెంబర్ 25:

మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో విద్యా రంగ అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్య, మౌలిక వసతులు, క్రీడలు, నైపుణ్యాభివృద్ధిపై సమగ్ర దృష్టి సారించి విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని వెల్లడించారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాల అభివృద్ధికి 6.86 కోట్ల రూపాయలతో భవన నిర్మాణాలకు చర్యలు తీసుకుంటున్నామని అలాగే, ఎంవీఎస్ జూనియర్ కళాశాలలో శిథిలావస్థకు చేరిన భవనాల కారణంగా ప్రస్తుతం ఒకే భవనంలో తరగతులు నిర్వహిస్తున్న పరిస్థితిని మార్చాల్సిన అవసరం ఉందన్నారు. పాత భవనాల స్థానంలో ఆధునిక వసతులతో కొత్త భవనాలను నిర్మించి కళాశాలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఎంవీఎస్ జూనియర్ కళాశాలను భవిష్యత్తులో తెలంగాణ పబ్లిక్ స్కూల్ తరహాలో కేజీ నుంచి 12వ తరగతి వరకు విద్య అందించే సమగ్ర విద్యాసంస్థగా తీర్చిదిద్దే ఆలోచన ఉందన్నారు.

తరువాయి 2వ పేజీలో...

పసిపాపపై దారుణానికి యావజ్జీవ శిక్ష

- నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష.. రూ.28 వేల జరిమానా

- బాధిత కుటుంబానికి రూ.3 లక్షల పరిహారం : పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్‌రెడ్డి



పెద్దపల్లి,సెప్టెంబర్ 25 (ప్రజాకలం జిల్లా ప్రతినిధి):

ఆరేళ్ల పసిపాపపై అత్యంత అమానుషంగా అత్యాచారానికి పాల్పడి దారుణంగా హత్య చేసిన సంచలనాత్మక కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ పెద్దపల్లి ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కె.స్వప్నరాణి చారిత్రాత్మక తీర్పు వెలువరించారు. జైలు శిక్షతో పాటు నిందితుడికి రూ.28 వేల జరిమానా విధించారని,

తరువాయి 2వ పేజీలో...

గంగమ్మ ఒడికి..

మొదటి పేజీ తరువాయి...

నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, డీజీపీ సీవీ ఆనంద్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక ఆల హెలికాప్టర్ ద్వారా శోభాయాత్ర, హుస్సేన్‌సాగర్ వద్ద నిమజ్జన పర్వాన్ని పరిశీలించారు. గతేడాదితో పోలిస్తే ఖైరతాబాద్ మహాగణపతి శోభాయాత్ర 3.30 గంటలు ఆలస్యంగా ఉదయం 9.35 గంటలకు ప్రారంభమైంది. మధ్యాహ్నం 2.43 గంటలకు ఎన్టీఆర్ మార్గ్‌లోని 4వ నెంబరు క్రేన్ వద్ద నిమజ్జనం చేశారు. మహాగణపతి శోభాయాత్రలో మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్, మహిళా కానిస్టేబుళ్లతో కలిసి ప్యారడైజ్ సినిమాలోని ఆయాషేర్ పాటకు స్టెప్పులేశారు.

15 వేలమంది పారిశుద్ధ్య కార్మికుల సేవలు

హుస్సేన్‌సాగర్‌కు వచ్చే భక్తుల కోసం నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ 600 బస్సులు, రైల్వే శాఖ అదనపు ఎంఎంటీఎస్ రైలు సర్వీసులు నడిపాయి. మెట్రో రైళ్లు రాత్రి 2 గంటల వరకు నడిచాయి. 303 కి.మీల శోభాయాత్ర మార్గంలో ఎప్పటికప్పుడు వ్యర్థాలు తొలగించేందుకు సుమారు 15 వేల మంది పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహించారు. ప్రధాన నిమజ్జన కేంద్రాల వద్ద ఎన్‌డీఆర్‌ఎఫ్, హైడ్రా డీఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో 200 మంది గజ ఈతగాళ్లు, బోట్లు అందుబాటులో ఉంచారు. శోభాయాత్ర వేగంగా ముందుకు సాగేలా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. దాదాపు 30 వేల మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. శుక్రవారం కావటంతో పాతబస్తీలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించే సమయంలో పోలీసులు మరిన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రజలు కూడా స్వచ్ఛంగా ఒకరికి ఒకరు సహకరించుకొని పరమత సహనం.. పరస్పర గౌరవం చాటారు. చార్మినార్, మొజాంజాహి మార్కెట్ మార్గాల్లో మతాలకతీతంగా తాగునీరు, అల్పాహారం అందజేశారు. మహిళలను ఆకతాయిలు వేధించకుండా అడ్డుకొనేందుకు 26 'షీ–టీమ్స్'ను నియమించారు. 24 డ్రోన్లతో నిరంతరం నిఘా పెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలను బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించి పర్యవేక్షించారు. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

బాలాపూర్ లడ్డు రూ.39 లక్షలు..

బాలాపూర్ లంబోదరుడి లడ్డూ ప్రసాదం మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. గతేడాది ఈ లడ్డు రూ.35 లక్షలు పలకగా, ఈసారి రూ.39 లక్షలు పలికింది. పోటాపోటీగా సాగిన వేలంలో వనస్థలిపురం సాహెబ్‌నగర్‌కు చెందిన అర్బన్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత సామ ప్రణీత్‌రెడ్డి లడ్డూను కైవసం చేసుకున్నారు. అత్తాపూర్ గణేశుడి లడ్డూను గుమ్మడి భూపాల్ రెడ్డి సోదరులు రూ.13.21 లక్షలకు సొంతం చేసుకున్నారు. మాదాపూర్‌లోని కోహినూర్ ఆరో రియాలిటీ గేటెడ్ కమ్యూనిటీలో గణేశుడి లడ్డు రూ.30,500,01లు పలికింది. మైహోమ్ భుజాలో రూ.25 లక్షలకు ఓ భక్తుడు సొంతం చేసుకున్నాడు. కొండాపూర్‌లోని మైహోం మంగళాలో రూ.21,11,116లకు సాంబశివరావు, నవీన్ అనే భక్తులు లడ్డూను దక్కించుకున్నారు. కేపీహెచ్‌బీ ప్రగతినగర్ రఘుపతి కౌంటీలో రూ.13.66 లక్షలు, రాజేంద్రనగర్ ల్యాన్‌సమ్ అటానియాలో రూ.13.56 లక్షలు, కొండాపూర్ ఇండ?సవైవా సిటీలో రూ.13.21 లక్షలు, ప్రగతినగర్‌లో రూ.13 లక్షలకు విఘ్నేశ్వరుడి లడ్డూలను భక్తులు దక్కించుకున్నారు. చేవెళ్ల పట్టణంలోని రచ్చబండ వినాయకుడి లడ్డు రూ.28,11,101 పలికింది. బండ్లగూడ కీర్తి రిచ్‌మండ్ విల్లాలో ఈ ఏడాది లడ్డు రూ.1.01 కోట్లు పలికింది. ఈ సొమ్మును ఆర్వీ దియా ఛారిటబుల్ ట్రస్ట ద్వారా వివిధ సేవాకార్యక్రమాలకు వినియోగిస్తున్నట్లు భక్తులు తెలిపారు. గతేడాది ఇక్కడ లడ్డు రికార్డు స్థాయిలో రూ.2.32 కోట్లు పలకగా.. అందులోని రూ.1.66 కోట్లతో సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు వెల్లడించారు. దియా స్వచ్ఛంద సంస్థ సేవలను అభినందిస్తూ మాజీ క్రికెటర్ కపిల్‌దేవ్ వీడియో సందేశం పంపారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం అబ్బెందలో గణేశుడి లడ్డూను ఎండీ రహీం అనే ముస్లిం యువకుడు రూ.45 వేలకు దక్కించుకున్నాడు. కంగ్టి మండలం పంచమహల్ దామర్‌గిద్దలో మునీర్ అనే యువకుడు రూ.12 వేలకు గణపతి లడ్డూను సొంతం చేసుకున్నాడు.

13 మంది మృతి..
26 మందికి గాయాలు: డీజీపీ

రాష్ట్రవ్యాప్తంగా గణేశ్ విగ్రహాల నిమజ్జనాలు ప్రశాంతంగా ముగిశాయని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. డీజీపీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న నిమజ్జనోత్సవాలను కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షించినట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 1.24 లక్షల విగ్రహాలను బహిరంగ ప్రదేశాల్లో ప్రతిష్ఠించారని తెలిపారు. నిమజ్జనాల బందోబస్తు విధుల్లో.. నిమజ్జన ప్రదేశాల్లో, చెరువుల్లో ప్రమాదవశాత్తు 13 మంది మరణించారని.. 26 మంది గాయపడ్డారని వెల్లడించారు. పలుచోట్ల ఘర్షణలు జరిగినట్లు చెప్పారు. మొత్తంగా పకడ్బందీ ప్రణాళికతో నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించినట్లు చెప్పారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నియోజకవర్గం కార్మికనగర్‌కు చెందిన బీ శివ శుక్రవారం ఖైరతాబాద్ చౌరస్తాలో వాహనంపై నుంచి కింద పడడంతో తీవ్ర గాయాలతో మృతి చెందాడు. నిర్మల్ జిల్లా కడెం మండలం కుర్రగూడ గ్రామానికి చెందిన గణేశుడిని శుక్రవారం ఉదయం కడెం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రాంతంలో నిమజ్జనం చేస్తుండగా చుంచు రమేశ్ (45) ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మరణించాడు. నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్ మండలం సోమశిల వద్ద కృష్ణానదిలో గణేశుడి విగ్రహం నిమజ్జనం అనంతరం నదిలో ఈతకు వెళ్లిన హైదరాబాద్‌లోని ఉప్పుగూడకు చెందిన ఎస్. రాజు ముదిరాజ్ (37) అనే వ్యక్తి మరణించాడు.

దానంపై సుప్రీంకోర్టు తీర్పు
గౌరవిస్తాం

మొదటి పేజీ తరువాయి...

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హతపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవిస్తామని మహేశ్ కుమార్ అన్నారు. ఉప ఎన్నికలో పోటీ చేసే కాంగ్రెస్ అభ్యర్థిని పార్టీ అధిష్ఠానం నిర్ణయిస్తుందని తెలిపారు. దానం నాగేందర్ కేసుతో పోలిస్తే రాష్ట్రంలో పార్టీ మారిన మిగతా ఎనిమిది మంది ఎమ్మెల్యేల వ్యవహారం భిన్నమైనదని పేర్కొన్నారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఓ ప్రకటన చేస్తూ.. జ్ఞానేశ్ కుమార్‌ను తప్పించాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కనుసన్నల్లోనే ఎన్నికల కమిషనర్ల నియామకం జరిగేలా వ్యవస్థనే మార్చేశారని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి కేంద్ర ఎన్నికల సంఘం కీలుబొమ్మగా మారిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. సర్ ప్రక్రియను నిలిపేయాలన్నారు. ఎన్నికల సంఘం పనితీరు, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష వైఖరిని నిరసిస్తూ హైదరాబాద్‌లో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. దేశ ప్రజల ఓటుహక్కును కాపాడాల్సిన ఎన్నికల సంఘం.. బీజేపీ ఎన్నికల సంఘంగా మార్చిన జ్ఞానేశ్ కుమార్ నేరం దేశ ద్రోహంతో సమానమని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పేర్కొన్నారు.

సాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

మొదటి పేజీ తరువాయి...

వ్యవసాయ ఆధారితమైన ధర్మపురి నియోజకవర్గంలో ని అన్ని గ్రామాలకు సాగునీటిని అందించడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుని తగిన నిధులు కేటాయిస్తున్నట్లు మంత్రి తెలిపారు. గొల్లపల్లి మండలంలోని రంగధామునిపల్లి, దీకొండ చెరువు అభివృద్ధి చేసి పెగడపల్లి మండలంలో సాగునీటిని అందించడానికి చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. పెగడపల్లి మండలంలో గిరిజన సంక్షేమ శాఖ ద్వారా కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మంత్రి అడ్లూరి తెలిపారు. మండలంలోని అన్ని వర్గాల ప్రజలను సమన్వయం చేసుకొని మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు. పెగడపల్లి మండలంలోని 39 మంది లబ్ధిదారులకు రూ. 39,04,524 విలువ కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 115 మంది లబ్ధిదారులకు రూ. 35 లక్షల 39,500 విలువైన చెక్కులను మంత్రి అందజేశారు .ప్రజా సంక్షేమమే ముందుకు సాగుతున్న ప్రజాపాలనలోవచ్చే దసరాకి మహిళా సోదరిమణులకు ఇందిరమ్మ చీరలు అందజేస్తామని మంత్రి తెలిపారు. 2027 లో నిర్వహించే గోదావరి పుష్కరాలకు పెద్ద ఎత్తున ప్రభుత్వం నుండి నిధులు తీసుకు వస్తున్నట్లు మంత్రి వివరించారు.

ధర్మపురి నియోజకవర్గం లో పుష్కరాల పనులకు ప్రభుత్వం ఇప్పటికే రూ. 117 కోట్లు మంజూరు చేయగా ఇటీవల ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క పర్యటన సందర్భంగా రూ. 80 కోట్ల నిధులు కావాలని కోరగా ఆర్థిక శాఖ నుండి అనుమతి లభించినట్లు మంత్రి ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో పెగడపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు, పెగడపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుపతి, ఒరుగాలి శ్రీనివాస్, సంది మల్లారెడ్డి తోపాటు వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికే అత్యధిక ప్రాధాన్యం

మొదటి పేజీ తరువాయి...

సుమారు రూ.7.95 కోట్లతో భవన నిర్మాణం పూర్తయిన అనంతరం హైస్కూల్‌ను కూడా అక్కడికి తరలించి, పాఠశాల–జూనియర్ కళాశాలకు ఒకే ప్రాంగణంలో సమగ్ర విద్యా విధానం అమలు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహబూబ్‌నగర్ లోని ఎంవిఎస్ డిగ్రీ కళాశాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన తెలిపారు. కొత్త బ్లాక్ నిర్మాణంతో పాటు కళాశాల సమగ్ర అభివృద్ధికి సుమారు రూ.70 కోట్ల అంచనాతో దశలవారీగా పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ కళాశాల 60వ వార్షికోత్సవాన్ని ఈ విద్యా సంవత్సరంలో ఘనంగా నిర్వహించాలని భావిస్తున్నామని తెలిపారు. గత ఆరు దశాబ్దాల్లో కళాశాలలో చదివి పట్టాలు పొందిన పూర్వ విద్యార్థులను భాగస్వామ్యం చేసి భారీ స్థాయిలో వేడుకలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ని ఆహ్వానించి ఘనంగా నిర్వహించేందుకు ప్రయత్నిస్తామని వెల్లడించారు. విద్యార్థుల వసతి సమస్యల పరిష్కారానికి ఇప్పటికే రెండు హాస్టల్ బ్లాకుల నిర్మాణం చేపట్టామని ఎమ్మెల్యే తెలిపారు. ఎస్సీ బాలురు, బాలికల కోసం కూడా హాస్టళ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలను విద్యార్థుల వసతి అవసరాలకు వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. పాలమూరు యూనివర్సిటీ లో అత్యంత వేగంగా ఇంజనీరింగ్ కళాశాల మరియు లా కళాశాల భవనాలు నిర్మాణం జరుపుకుంటున్నాయని, తాను ఎమ్మెల్యే గా ఎన్నికైన తర్వాత పాలమూరు యూనివర్సిటీలో రెండు హాస్టల్ భవనాలను ప్రారంభించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. జిల్లా క్రీడా మైదానం వెనుక భాగంలో బాలికల హాస్టల్ నిర్మాణానికి స్థల కేటాయింపు అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యం ఇస్తూ స్టేడియం అభివృద్ధికి అవసరమైన స్థలం, మౌలిక వసతులపై సంబంధిత అధికారులతో చర్చిస్తున్నామని చెప్పారు. మైనారిటీ విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు భవిష్యత్తులో రెండు మైనారిటీ విద్యాసంస్థలను ఏర్పాటు చేసే దిశగా చర్యలుతీసుకుంటామని తెలిపారు. వీరన్న పేటలో రెండు మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయని, త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. అదేవిధంగా సుమారు రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. త్వరలో భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి, వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని వెల్లడించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆటోమేషన్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ రంగంలో వేగంగా మార్పులు వస్తున్నాయని, ఇప్పటికే పలు దేశాల్లో డ్రైవర్‌లెస్ రవాణా వ్యవస్థలు, ఆటోమేటెడ్ టెక్నాలజీలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. అమెరికా వంటి దేశాల్లో డ్రైవర్‌లెస్ ట్యాక్సీల వంటి సాంకేతికతలు వినియోగంలోకి వస్తున్న నేపథ్యంలో మనం కూడా భవిష్యత్ సవాళ్లకు ఇప్పటి నుంచే సిద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. 'రాబోయే రోజుల్లో టెక్నాలజీ మరింత వేగంగా అభివృద్ధి చెందుతుంది. ఈ మార్పులను ముందుగానే గుర్తించి మన పిల్లలకు టెక్నికల్ ఎడ్యుకేషన్, స్కిల్ డెవలప్‌మెంట్ అందించాలి. వారి ఉద్యోగ అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను చిన్న వయసు నుంచే పెంపొందించాలి" అని యెన్నం అన్నారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న సాంకేతిక మార్పుల ప్రాధాన్యతను తెలంగాణ ప్రభుత్వం ముందుగానే గుర్తించి స్కిల్ ఎడ్యుకేషన్‌కు ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి నాయకత్వంలోనైపుణ్యాభివృద్ధి, సాంకేతిక విద్యకు సంబంధించిన కార్యక్రమాలను విస్తరిస్తున్నామని చెప్పారు. ఐటీఐలు, నైపుణ్య శిక్షణా కేంద్రాల ద్వారా యువతకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలనుఅందిస్తున్నామని వెల్లడించారు. టాటా టెక్నాలజీ భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన సాంకేతిక శిక్షణా కార్యక్రమాల ద్వారా కూడా యువతకు ఆధునిక నైపుణ్యాలను అందిస్తున్నామని తెలిపారు. శిక్షణ పొందిన విద్యార్థులకు మెరుగైన ప్లేస్‌మెంట్ అవకాశాలు కల్పించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. కేవలం భవనాలు నిర్మించడం మాత్రమే కాకుండా, ఆధునిక విద్య, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్య శిక్షణ అందించేలా విద్యాసంస్థలనుతీర్చిదిద్దాలన్నదే తమ లక్ష్యమన్నారు. 'విద్యపై పెట్టే పెట్టుబడి మన పిల్లల భవిష్యత్తుపై పెట్టే పెట్టుబడి. రోడ్లు, భవనాలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి జరుగుతూనే ఉంటుంది. కానీ మన పిల్లలకు అందించే విద్యే వారి భవిష్యత్తును నిర్ణయిస్తుంది. రాబోయే సవాళ్ల నుంచి మన పిల్లలను, మన సమాజాన్ని కాపాడాలంటే మంచి విద్యతో పాటు సాంకేతిక విద్య, నైపుణ్య శిక్షణ అందించడమే మార్గం" అని ప్రభుత్వ విప్ స్పష్టం చేశారు. 'పాఠశాలలు, ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలలను అభివృద్ధి చేయడంతో పాటు విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించడంపై నిరంతరం దృష్టి సారిస్తాం. నా శక్తి, సమయం, ఎనర్జీ మొత్తం విద్యాభివృద్ధిపైనే కేంద్రీకరిస్తాను" అని యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మీడియా ఇంచార్జీ సిజె బెనహర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ కార్యనిర్వహక అధ్యక్షులు అజ్మత్ అలి, సుధాకర్ రెడ్డి, మోయాజ్ తదితరులు పాల్గొన్నారు.

రెండు పరివారాల మధ్యే దేశ భవిష్యత్తు పోరాటం

మొదటి పేజీ తరువాయి...

దేశంలో స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్యాడన్ మహమ్మద్ ఐదు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్‌లో పనిచేశారని, ఎనిమిదిసార్లు ఎమ్మెల్యేగా, నాలుగుసార్లు మంత్రిగా సేవలందించారని రేవంత్‌రెడ్డి కొనియాడారు. ఆయన స్మారక పురస్కారం అందుకోవడం గౌరవంగా భావిస్తున్నానన్నారు. కేరళ వెలుపల నుంచి ఈ పురస్కారం అందుకున్న తొలి వ్యక్తిగా ఎంపిక కావడం మరింత ప్రత్యేకమని పేర్కొన్నారు.

'కేరళ నుంచే మార్పు గాలి'

కేరళలో రాజకీయ మార్పులకు దేశ రాజకీయాలతో సంబంధం ఉందని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కేరళలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన సందర్భాల్లో కేంద్రంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని పేర్కొన్నారు. 1991లో కేరళలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండగా పీవీ నరసింహారావు ప్రధానమంత్రి అయ్యారని, 2001లో ఏకే ఆంటోనీ ముఖ్యమంత్రి అయిన తర్వాత 2004లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని గుర్తుచేశారు. 2026లో కేరళలో కాంగ్రెస్ విజయం సాధించడంతో కొత్త రాజకీయ గాలి మొదలైందని, అది దేశవ్యాప్తంగా



ప్రభంజనంగా మారాలని ఆకాంక్షించారు.

'నాకు ఇక వ్యక్తిగత ఆశలు లేవు'

2006లో క్షేత్రస్థాయి నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన తాను జెడ్పీటీసీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీ, పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వరకు వివిధ పదవులు చేపట్టానని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇక తనకు వ్యక్తిగతంగా సాధించాల్సింది ఏమీ లేదన్నారు. "నా మిగిలిన ఏకైక కల రాహుల్‌గాంధీని భారత ప్రధానమంత్రిని చేయడం. ఢిల్లీలో కాంగ్రెస్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడాలి. రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావాలి" అని ఆయన పేర్కొన్నారు.

'ఓటు చోరీ' అంటూ ఆరోపణలు

ఓటు, పార్టీ, ఎన్నికల గుర్తు, నిధుల విషయంలో అక్రమాలు జరుగుతున్నాయని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. యువత భవిష్యత్తును, ప్రజాస్వామ్య పునాదులను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. రాహుల్‌గాంధీకి అండగా నిలిచి దేశవ్యాప్తంగా కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కేరళ నుంచి ప్రారంభమైన కాంగ్రెస్ రాజకీయ గాలి దేశంలోని ప్రతి ఇల్లు, వీధి, గ్రామం, నగరం, రాష్ట్రానికి చేరాలని ఆకాంక్షించారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, స్వేచ్ఛ, రాజ్యాంగ పరిరక్షణ కోసం ఐక్యంగా నిలవాలని రేవంత్‌రెడ్డి కోరారు.

'సర్'పై కాంగ్రెస్‌ది ద్వంద్వ వైఖరి

మొదటి పేజీ తరువాయి...

'అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికైన ప్రధానమంత్రి, హోంమంత్రులను 'దేశద్రోహులు' అంటూ రాహుల్ అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరం. కోట్లాది మంది నమ్మకంతో ఓటేసి గెలిపించిన వారిపై రాహుల్ గాంధీ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం.. ఆయన మానసిక స్థితిని,అసహనాన్ని తెలియజేస్తోంది. ఎన్నికల్లో వరుసగా ఓడిపోతుండటంతో మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని పిస్తోంది.' అని కిషన్‌రెడ్డి ఒక ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు. 'ఒక పార్టీ గుర్తుతో గెలిచి వేరే పార్టీలోకి ఫిరాయించిన దానం నాగేందర్‌పై సుప్రీం కోర్టు అనర్హత వేటు వేయడాన్ని స్వాగతించి, క్షమాపణలు చెప్పాల్సింది పోయి.. ప్రజాస్వామ్యం గురించి రాహుల్ పాఠాలు చెప్పడం హాస్యాస్పదం. ఫిరాయింపుల ద్వారా ప్రజల తీర్పును దొంగిలించిన పార్టీకి.. ఇతరులు ఓట్లు దొంగిలించారని ఆరోపించే నైతిక హక్కు లేదు. కాంగ్రెస్ పార్టీకి దేశవ్యాప్తంగా లక్షలాది మంది బూత్ ఏజెంట్లు ఉన్నారు. ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలు ఉంటే.. తెలియజేయడానికి చాలా సమయం ఇచ్చారు. అయినా ఎలాంటి అభ్యంతరాలు దాఖలు చేయలేదు. 'ఓట్ చోరీ' జరిగిందని ప్రమాణపూర్వకంగా చెప్పాలని డిమాండ్ చేస్తే రాహుల్ గాంధీ మౌనం వహించారు. అలాంటప్పుడు ఎందుకు అర్థం పర్థం లేని ఆరోపణలు చేస్తారు? ఎన్నికల సంఘం స్వతంత్ర రాజ్యాంగబద్ధ సంస్థ అనే విషయంలో మాకో క్లారిటీ ఉంది. కేంద్ర ప్రభుత్వం ఆ సంస్థ వ్యవహారాల్లో ఎప్పుడూ జోక్యం చేసుకోలేదు.. చేసుకోదు కూడా...' అని ఆయన స్పష్టం చేశారు.

కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ), ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియ విషయంలో కాంగ్రెస్ పార్టీ, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న రాద్ధాంతం చూస్తుంటే దొంగే దొంగ అన్నట్లుగా ఉందని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాల చరిత్ర అంతా రాజ్యాంగ సంస్థలను పావులుగా వాడుకున్న ఉదంతాలతోనే నిండి ఉందని, అలాంటి పార్టీ ఇవాళ రాజ్యాంగ ప్రక్రియ ద్వారా పారదర్శకంగా జరుగుతున్న 'సర్' ప్రక్రియను తప్పుబట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

ఎమర్జెన్సీ సమయంలో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌గా వ్యవహరించిన నవీన్ చావ్లా శైలిని, ఆ సమయంలో ఢిల్లీలో జరిగిన అకృత్యాలు, దౌర్జన్యాలు, బలవంతపు కుటుంబ నియంత్రణ అమలులో ఆయన పాత్రను సాక్షాత్తు 'షా కమిషన్' తప్పుబట్టిన విషయాన్ని కాంగ్రెస్ నేతలు విస్మరిస్తున్నారని పేర్కొన్నారు. తీవ్ర ఆరోపణలు ఎదుర్కొన్న నవీన్ చావ్లాను తదనంతర కాలంలో ఇందిరా గాంధీ హయాంలో ఎన్నికల కమిషనర్‌గా నియమించి పక్షపాతంగా వ్యవహరించారని, అప్పటి చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఎన్. గోపాలస్వామి కూడా ఆయనపై 12 అభియోగాలు మోపి తప్పుబట్టిన చరిత్ర దేశానికి తెలుసన్నారు.

పసిపాపపై దారుణానికి యావజ్జీవ శిక్ష

మొదటి పేజీ తరువాయి...

అలాగే బాధిత చిన్నారి కుటుంబానికి రూ.3 లక్షల ఆర్థిక పరిహారాన్ని తక్షణమే అందజేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థను న్యాయస్థానం ఆదేశించిందని పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సుల్తానా బాద్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ గజ్జి కృష్ణతో కలిసి డీసీపీ కేసు పూర్వాపరాలు, దర్యాప్తు వివరాలను మీడియాకు సమగ్రంగా వెల్లడించారు.డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం... 2024 జూన్ 13న రాత్రి వేళ పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణంలో తల్లిదండ్రుల వద్ద ప్రశాంతంగా నిద్రపోతున్న ఆరేళ్ల పసిపాపను నిందితుడు మాయమాటలతో బయటకు తీసుకెళ్లాడు. అనంతరం పాపపై అమానుషంగా అత్యాచారా నికి పాల్పడి,నేరం బయటపడుతుందనే భయంతో అత్యంత దారుణంగా హత్య చేశాడు.మరుసటి రోజు ఉదయం చిన్నారి మృతదేహాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోతూ సుల్తానాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ ఘటనను జిల్లా పోలీసు యంత్రాంగం అత్యంత ప్రాధా న్యతతో కూడిన సవాలుగా స్వీకరించింది. ఘటన తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఏసీపీ గజ్జి కృష్ణ ప్రత్యక్ష నేతృత్వంలో సుల్తానాబాద్ సీఐ,ఎస్సైలతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని వెంటనే రంగంలోకి దించారు.ప్రత్యేక బృందం ఘటన జరిగిన ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా విశ్లేషించడమే కాకుండా,ఘటనా స్థలంలో కీలకమైన భౌతిక సాక్ష్యాలు, డిజిటల్ ఆధారాలు,ఫోరెన్సిక్ సాంకేతిక నివేదికలను పకడ్బందీగా సేకరించింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితుడి కదలికలను సరిగ్గా పసిగట్టి, స్వల్ప వ్యవధిలోనే అతడిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.అనంతరం దర్యాప్తును అత్యంత వేగంగా పూర్తి చేసి,పబ్లిక్ ప్రాసిక్యూటర్ డొంకేన రవి సకాలంలో అందించిన చట్టపరమైన సహకారంతో న్యాయస్థానంలో బలమైన నిరూపణ సాక్ష్యాలను ప్రవేశపెట్టారు. పోలీసులు,ప్రాసిక్యూషన్ బృందం కోర్టులో నేరాన్ని సందేహాలకు తావులేకుండా బలంగా నిరూపించడంతోనే నిందితుడికి ఈ తీవ్రమైన శిక్ష పడిందని డీసీపీ పేర్కొన్నారు. చిన్నారి కుటుంబానికి అత్యంత వేగంగా న్యాయం చేకూర్చేలా దర్యాప్తు సాగించి,నేరస్థుడికి శిక్ష పడేలా శ్రమించిన పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐలు రంజిత్‌రావు, ప్రవీణ్‌కుమార్,ఎస్సైలు చంద్రకుమార్, అశోక్‌రెడ్డిలతో పాటు దర్యాప్తులో భాగస్వాములైన పోలీసు సిబ్బందిని డీసీపీ భూక్య రామ్‌రెడ్డి ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.

పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



గొల్లపల్లి, సెప్టెంబర్ 25 ప్రజా కలం ప్రతినిధి గొల్లపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను శుక్రవారం అడిషనల్ కలెక్టర్ రాజా గౌడ్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, భోజనం నాణ్యత, వంటశాల పరిశుభ్రత, విద్యార్థులకు అందుతున్న మెనూ పరిశీలించారు.అనంతరం పాఠశాలలోని వివిధ రికార్డులను తనిఖీ చేసి, విద్యార్థుల హాజరు, విద్యా సంబంధిత వివరాలు, పాఠశాల నిర్వహణకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి చెరుకు రాజన్న,పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఆడవాల మల్లయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రమేష్ మృతి జర్నలిజం రంగానికి తీరని లోటు

- డీసీపీ భూక్య రాంరెడ్డి - సీనియర్ పాత్రికేయుడు టీకే రమేష్ మృతికి పోలీసుల సంతాపం



సుల్తానాబాద్, సెప్టెంబర్ 25:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) సుల్తానాబాద్‌కు చెందిన సీనియర్ జర్నలిస్టు టీకే రమేష్ గుండెపోటుతో మృతి చెందడంతో శుక్రవారం పోలీసులు, విలేకరులు ఘనంగా నివాళులర్పించారు. డీసీపీ భూక్య రాంరెడ్డి,ఏసీపీ గజ్జి కృష్ణ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ డొంకెన రవి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సీఐలు రంజిత్‌రావు,ప్రవీణ్‌కుమార్, ఎస్సైలు చంద్రకుమార్,అశోక్‌రెడ్డి,పోలీసు సిబ్బంది,మండల విలేకరులు రెండు నిమిషాలు మౌనం పాటించారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ రమేష్ మృతి జర్నలిజం రంగానికి తీరని లోటని అన్నారు.ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.రమేష్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రాష్ట్రస్థాయి షాట్‌పుట్ పోటీలకు రవితేజ ఎంపిక

పెద్దపల్లి,సెప్టెంబర్ 25:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

ఎన్టీపీసీ ఆవరణలో జిల్లా ఆటల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో అప్పన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి దామ రవితేజ షాట్‌పుట్ విభాగంలో స్వర్ణ పతకం సాధించి,రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు అశోక్,విద్యార్థి రవితేజకు జ్ఞాపికను అందజేసి ప్రశంసించారు.ఈ నెల 26, 27న హన్మకొండలోని జేఎన్ఎస్ క్రీడాంగణంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో రవితేజ పాల్గొంటున్నాడని వ్యాయామ ఉపాధ్యాయులు డాక్టర్ వేల్పుల సురేందర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పురుషోత్తం,కనకయ్య, సారయ్య,శ్రీనివాస్, శ్రీదేవి, వాసంతి, సోనియా,జ్యోతి,పద్మ, సమీ,సుమిత్, సీఆర్‌పీ తిరుపతితో పాటు తోటి విద్యార్థులు రవితేజకు అభినందనలు తెలియజేశారు.



యువతకు ఉపాధి నైపుణ్య శిక్షణే ధ్యేయం

-జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి,సెప్టెంబర్ 25:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)


జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహిస్తూ స్థానిక యువతకు ఉపాధి,నైపుణ్య శిక్షణ అవకాశాలు కల్పించడమే ధ్యేయమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సముదాయంలో టాస్క్,డీట్



మరియు వివిధ సంస్థల ప్రతినిధులతో ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు స్థానిక ఉద్యోగాలు,వర్క్ ఫ్రమ్ హోమ్ అవకాశాలు కల్పించాలని సూచించారు.డేటా అనలిస్ట్, ఐటీ రంగానికి అవసరమైన నైపుణ్య శిక్షణను టాస్క్ ద్వారా అందించాలన్నారు.పదో తరగతి,ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులకు బ్యాంకింగ్,హెల్త్‌కేర్,సేల్స్ వంటి రంగాల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు.మహిళల కోసం 30 రోజుల స్వల్పకాలిక శిక్షణా కార్యక్రమాలు రూపొందించాలని,యువతకు తగిన అవగాహన కల్పించిన అనంతరమే జాబ్ డ్రైవ్‌లు నిర్వహించాలని చెప్పారు.అనంతరం పెద్దపల్లి టాస్క్ సెంటర్ ద్వారా శిక్షణ పొంది,ఐసీఐసీఐ బ్యాంక్‌లో సీనియర్ ఆఫీసర్‌గా ఎంపికైన ముస్త్యాల మణిశ్రీని కలెక్టర్ అభినందించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధి అధికారి ఎం.రాజశేఖర్,రీజినల్ టాస్క్ ఇన్చార్జ్ కౌసల్య,పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రియాద్‌లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

- తెలుగు భాషా వైభవంతో పాటు సౌదీ జాతీయ దినోత్సవ వేడుకలు



జగిత్యాల్ ప్రతినిధి సెప్టెంబర్ 25 (ప్రజాకలం)

రియాద్, సౌదీ అరేబియా: సౌదీ అరేబియా తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో 5వ తెలుగు భాషా దినోత్సవం అసోసియేషన్ వార్షికోత్సవం, సౌదీ అరేబియా జాతీయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రియాద్‌లో జరిగిన ఈ కార్యక్రమం తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పేలా ఉత్సాహభరితంగా సాగింది. ఈ వేడుకలకు రియాద్‌లో భారత రాయబారి విపుల్, ప్రముఖ సంగీత దర్శకుడు రఘు కుంచె, ప్రముఖ గాయని మాళవిక ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సౌదీ అరేబియా తెలుగు అసోసియేషన్ కోర్ టీమ్, ఎగ్జిక్యూటివ్ టీమ్ సభ్యులతో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, భాగస్వాములు, శ్రేయోభిలాషులు, తెలుగు భాషాభిమానులు, అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.కార్యక్రమంలో వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు, సంగీత కార్యక్రమాలు, అతిథుల సందేశాలు, తెలుగు భాషా-సాహిత్య ప్రాధాన్యతను చాటిచెప్పే కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సభ్యుల ఉత్సాహభరిత భాగస్వామ్యంతో వేడుకలు వైభవంగా జరిగాయి.తెలుగు భాష గొప్పతనాన్ని, తెలుగు సంస్కృతి-సంప్రదాయాల ఔన్నత్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు, సౌదీ అరేబియా తెలుగు అసోసియేషన్ ప్రస్థానంలో మరో ముఖ్యమైన మైలురాయిగా నిలిచిందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన భారత రాయబారి విపుల్, సంగీత దర్శకుడు శ్రీ రఘు కుంచె, గాయని మాళవికలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. వారి సందేశాలు, సాన్నిహిత్యం కార్యక్రమానికి మరింత ప్రత్యేకతను తీసుకొచ్చాయని పేర్కొన్నారు.కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన కోర్ టీమ్, ఎగ్జిక్యూటివ్ టీమ్ సభ్యుల సేవలను అభినందించారు.

తెలుగు భాష పరిరక్షణ, తెలుగు సంస్కృతి-సంప్రదాయాల పరిరక్షణ, యువతలో తెలుగు భాషపై ఆసక్తిని పెంపొందించడం, సమాజ ఐక్యతను బలోపేతం చేయడం వంటి లక్ష్యాలతో భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా సౌదీ అరేబియా జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సౌదీ ప్రజలకు సౌదీ అరేబియా తెలుగు అసోసియేషన్ తరఫున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. సౌదీ అరేబియా శాంతి, ఐక్యత, సౌభాగ్యం, సుస్థిర అభివృద్ధి, సమృద్ధితో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

మండల స్థాయి అభివృద్ధి సమీక్ష సమావేశం

ఎండపల్లి, సెప్టెంబర్ 25 : (ప్రజా కలం ప్రతినిధి) మండల అభివృద్ధిపై సమగ్ర సమీక్ష సమావేశం గుల్లకోట రైతు వేదిక లో శుక్రవారం రోజున అధికారులు-ప్రజాప్రతినిధులు సమన్వయం తో ముందుకు మండల అభివృద్ధి పనుల కు మరింత వేగం పెంచి గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల కు త్వరితగతిన పరిష్కారం చూపే దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమ న్వయం తో పనిచేయాలని ప్రత్యేక అధికారి, డీఎఫ్ఓ ఎం. రవి ప్రసాద్ సూచించారు. గుల్లకోట రైతు వేదికలో శుక్రవారం మండల అభివృద్ధి సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రత్యేక అధికారి ఎం. రవి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశం లో మండలం లోని గ్రామాల సర్పంచులు, వివిధ శాఖల అధికారుల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతి పై సుదీర్ఘంగా సమీక్షించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనుల ప్రస్తుత పరిస్థితి, రాబోయే ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై అధి కారులతో చర్చించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా క్షేత్ర స్థాయిలో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి రవి ప్రసాద్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారులు సమష్టిగా పనిచేసినప్పుడే మండలం సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. గ్రామాల వారీగా సమస్యలను గుర్తించి, వాటి



పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సమావేశం లో మండల స్థాయి అధి కారులు, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతి నిధులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు. ప్రత్యేక అధికారి రవి ప్రసాద్ ఎంపీడీఓ దొండ కృపాకర్, తహసీల్దార్ ఎడ్ల అనిల్ కుమార్, ఎంఈఓ హరి కృష్ణ, ఆర్ ఐ అన్వేష్, విద్యుత్ శాఖ ఎఈ బండి సమ్మయ్య, హౌసింగ్ డిపార్ట్మెంట్, గౌతమి, పిఆర్ ఎఇ రాజు, ఈజిఎస్, అనిల్ ఐకేపీ తులసిమాత అంగన్ వాడీ సూపర్ వైజేర్ అండాలు, మిషన్ భగీరథ, ఆర్ డబ్ల్యూఎస్ సాయి, పశు వైద్యాధికారి బూర మనోజ్ కుమార్, వైద్య శాఖ నుండి మనోరమ, వ్యవసాయ శాఖ అధికారి కామాల్ల మహేష్, హార్టి కల్చర్ అధికారిని అక్షర, వ్యవసాయ శాఖ ఏ ఈ ఓ సూత్రపు లావణ్య, బలిజ పెళ్లి సందీప్, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆశయాలు ఆచరణీయం

- ఘనంగా పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి



పెద్దపల్లి,సెప్టెంబర్ 25:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

సమాజంలోని చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు చేరాలనే అంత్యోదయ భావన,దేశం మరియు సమాజ సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా చేసుకున్న పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆలోచనలు నేటికీ ఎంతో ప్రాసంగికం అని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కౌన్సిలర్ పెంజర్ల రాకేష్,మండల అధ్యక్షుడు వెల్పుల రమేష్ అన్నారు.భారతీయ జనసంఘ్ మాజీ అధ్యక్షుడు,ఏకాత్మ మానవతావాద సిద్ధాంతకర్త పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని శుక్రవారం భారతీయ జనతా పార్టీ పట్టణ మరియు మండల శాఖల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు,కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు పెంజర్ల రాకేష్,మండల అధ్యక్షుడు వెల్పుల రమేష్ మాట్లాడుతూ దేశమే ముందు-ప్రజాసేవే లక్ష్యం అనే స్ఫూర్తితో ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని,నిస్వార్థ రాజకీయాల పట్ల ఆయన చూపిన మార్గాన్ని ప్రతి కార్యకర్త ఆదర్శంగా తీసుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పోల్సాని సంపత్ రావు,ఎగ్రోళ్ల శ్రీకాంత్,ప్రధాన కార్యదర్శులు గుడ్ల సతీష్,బోలేవేన సురేందర్, ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి కుమార్, ముంజ రాజేంద్రప్రసాద్,కోశాధికారి గదాసి సతీష్, కార్యదర్శి పోగుల రాజులతో పాటు బొడ్డవల్లి సంపత్,షిండే శివసాయి,కుక్క అంజి,ప్రశాంత్,ఆకాష్,మనోజ్,అవినాష్, రాజు తోపాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

భూసేకరణలో దళారుల చేతిలో మోసపోవద్దు

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి,సెప్టెంబర్ 25:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

జిల్లాలోని రామగుండం,ఎన్టీపీసి,సింగరేణి, రాజాపూర్ ప్రాంతాలలో జరుగుతున్న భూసేకరణతో పాటు,జాతీయ రహదారులు,రైల్వే మార్గాల విస్తరణ నిమిత్తం జరుగుతున్న భూసేకరణ ప్రక్రియకు సంబంధించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం నేరుగా బాధితులకే నష్టపరిహారం అందుతుందని,ఎవరైనా మధ్యవర్తుల మాటలు నమ్మి మోసపోవద్దని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు.రామగుండం, ఎన్టీపీసి,సింగరేణి, రాజాపూర్ ప్రాంతాలలో సింగరేణి సంస్థకు సంబంధించిన భూసేకరణ జరుగుతుండగా,జిల్లాలో వివిధ ప్రాంతాలలో కొత్త జాతీయ రహదారులు, రైల్వే మార్గాల నిర్మాణం కోసం భూములు



సేకరిస్తుండగా,కొంతమంది దళారులు,మధ్యవర్తులు ప్రవేశించి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ నష్టపరిహారం ఇప్పిస్తామని నమ్మిస్తూ అమాయక ప్రజల నుండి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని జిల్లా కలెక్టర్ తెలిపారు.భూమి కోల్పోతున్న బాధితులు ఎవరూ ఇలాంటి దళారులు, మధ్యవర్తుల మాయ మాటలను నమ్మి మోసపోవద్దని,ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రావాల్సిన నష్టపరిహారాన్ని ప్రభుత్వ అధికారులే నేరుగా బాధితులకు తెలియజేసి అందజేస్తారని, పరిశ్రమలు, సింగరేణితో పాటు నేషనల్ హైవేస్,రైల్వే భూసేకరణ విషయాలలోనూ మధ్యవర్తులు ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసినా, మోసపూరితంగా వ్యవహరించినా వెంటనే సంబంధిత అధికారులకు, పోలీసులకు సమాచారం అందించాలని,అనధికార వ్యక్తులను నమ్మి మోసపోవద్దు జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత..

వెల్గటూర్, సెప్టెంబర్ 25,ప్రజాకలం, ప్రతినిధి : జగిత్యాల జిల్లా, కథలాపూర్ మండలంలోని అంబారీపేట గ్రామానికి చెందిన మంచాల శేఖర్ కు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వార మంజూరు కాబడిన రూ. 1,61, 000ల చెక్కును సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుక్రవారం లబ్ధిదారునికి అందజేశారు. మంచాల శేఖర్ పేద కుటుంబానికి చెందినవాడు కావడంతో ఆయన కుటుంబ



పరిస్థితిని అర్థం చేసుకున్న మంత్రి లక్ష్మణ్ కుమార్ స్పెషల్ కోట కింద రూ.1,61,000 లను మంజూరు చేయించారు. కాగా తనకు సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు కావడానికి కృషి చేసిన మంత్రి లక్ష్మణ్ కుమార్ కు ఈ సందర్భంగా శేఖర్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోటిలింగాల ఆలయ డైరెక్టర్ గుమ్ముల వెంకటేష్, కథలాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జవ్వాజి రవీందర్. ఫిషరిష్ రాష్ట్ర కార్యదర్శి కల్లెడ గంగాధర్ పాల్గొన్నారు

పి.ఎం.శ్రీ పాఠశాలలకు కొనుగోలు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి, సెప్టెంబర్ 25 (ప్రజాకలం జిల్లా ప్రతినిధి):రాష్ట్ర పాఠశాల విద్య సంచాలకుల ఆదేశాల మేరకు 2026-27 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని 16 పి.ఎం.శ్రీ పాఠశాలలకు కావలసిన ద్విభాషా నిఘంటువులు, ఆట వస్తువుల సేకరణకై అర్హులైన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి జి.శారద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.



జిల్లాలోని ఎంపిక చేసిన 16 పి.ఎం.శ్రీ పాఠశాలల ప్రగతికి ఈ ద్విభాషా నిఘంటువులను,ఆట వస్తువులను సమకూర్చడం జరుగుతుందని పేర్కొన్నారు.ఆసక్తి కలిగిన వారు తమ దరఖాస్తులను సెప్టెంబర్ 28లోగా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.ఈ సమకూర్పు ప్రక్రియకు సంబంధించి మరింత సమాచారం కోసం 9849878622 సంఖ్యను సంప్రదించాలని ఆ ప్రకటనలో తెలిపారు.

వార్డ్ సభ్యుల మండల ఇంచార్జిగా పాదం అంజలి నియామకం

వెల్గటూర్,సెప్టెంబర్ 25 ప్రజాకలం, ప్రతినిధి : వెల్గటూర్ మండల వార్డు సభ్యుల ఇంచార్జిగా మండలంలోని స్తంభంపల్లి గ్రామానికి చెందిన పాదం అంజలిని నియమిస్తున్నట్లు వార్డు సభ్యుల ఫోరం రాష్ట్ర అధ్యక్షురాలు జ్యోతి శుక్రవారం ప్రకటన ద్వార తెలిపారు. ఈ సందర్భంగా పాదం అంజలి, దుబ్బస్వామి మాట్లాడుతూ మండలంలోని వార్డ్ సభ్యుల సమస్యల పరిష్కారం కోసం నా వంతు కృషి చేస్తానని అన్నారు.. తన నియామకానికి సహకరించిన నాయకులందరి కృతజ్ఞతలు తెలియజేశారు. వార్డు సభ్యుల మండల ఇంచార్జిగా పాదం అంజలిని నియమించడం పట్ల స్తంభంపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు..



వార్డు 20లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి సెప్టెంబర్ 25 (ప్రజాకాలం): -తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం మెట్‌పల్లి పట్టణంలోని 20వ వార్డులో ప్రారంభమైంది. 20వ వార్డు కౌన్సిలర్ మాసుల ప్రవీణ్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ మాసుల ప్రవీణ్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న



స్మార్ట్ రేషన్ కార్డులను అర్హులైన ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత పారదర్శకంగా, సులభంగా అందించాలనే ఉద్దేశంతో స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తున్నట్లు తెలిపారు.స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీపై వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో వార్డు ప్రజలు, సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి డిపో ఐఎన్‌టీయూసీ (ఎస్‌డబ్ల్యూయూ)

నూతన కమిటీ నియామకం

మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి సెప్టెంబర్ 25 (ప్రజాకాలం): – టీఎస్ఆర్టీసీ మెట్‌పల్లి డిపో ఐఎన్‌టీయూసీ (ఎస్‌డబ్ల్యూయూ) నూతన కమిటీని నియమిస్తూ ఉ



త్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్ పార్టీ అనుబంధ కార్మిక సంస్థ అయిన ఐఎన్‌టీయూసీ (ఎస్‌డబ్ల్యూయూ) మెట్‌పల్లి డిపో కమిటీ అధ్యక్షుడిగా ఏ. వేణుగోపాల్, సెక్రటరీగా ఎం. రమేష్ గౌడ్, గ్యారేజీ సెక్రటరీగా ఎం.డి. ఏ. అహ్మద్ లను నియమించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఎస్‌డబ్ల్యూయూ రాష్ట్ర కమిటీ సెక్రటరీ జక్కుల మల్లేశం, రాష్ట్ర అధ్యక్షుడు అబ్రహం, రాష్ట్ర గ్యారేజీ సెక్రటరీ కలిముద్దీన్, జిల్లా అధ్యక్షుడు ఎన్.కె. రాజు, జిల్లా సెక్రటరీ పి.ఆర్. రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. తమ నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.కార్మికుల సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ కృషి చేస్తుందని తెలిపారు.

ప్రజా కలం
శనివారం, సెప్టెంబర్ 26, 2026

ప్రియాంకే ఎక్కువ క్రౌడ్ పుల్లరా

కాంగ్రెస్ నాయకత్వంలో అంతర్గతంగా ఒక కీలకమైన వ్యూహాత్మక మార్పు జరుగుతోంది. రాబోయే రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల బాధ్యతలను, ప్రచార సారథ్యాన్ని రాహుల్ గాంధీ కంటే ప్రియాంక గాంధీ వాద్రాకే అప్పగించాలని భావిస్తున్నారు. రాహుల్ గాంధీ లోక్‌సభలో ప్రతిపక్ష నేత స్థానానికే పరిమితమవుతుండగా.. క్షేత్రస్థాయిలో అసెంబ్లీ ఎన్నికల బాధ్యతను ప్రియాంక భుజాలకెత్తేలా రోల్ డివిజన్ జరుగుతోందిరాష్ట్రాల ఎన్నికల్లో ప్రియాంక గాంధీ ప్రచార శైలికి వస్తున్న ప్రజా స్పందన, ఆమె సక్సెస్ రేట్. గతంలో హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక ఎన్నికల్లో రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో బిజీగా ఉన్నప్పుడు సైతం ప్రియాంక నేతృత్వంలో సాగిన దూకుడు ప్రచారం కాంగ్రెస్‌కు అద్భుత ఫలితాలనిచ్చింది. ముఖ్యంగా ఆమె ప్రసంగించే తీరు, ప్రజలతో మమేకమయ్యే విధానం, తన నాయనమ్మ ఇందిరా గాంధీని గుర్తుకు తెచ్చే హావభావాలు ఉత్తర, మధ్య భారత ఓటర్లను విశేషంగా ఆకట్టుకుంటాయి. స్థానిక నేతల మధ్య ఉండే గ్రూపు తగాదాలను చక్కదిద్దడంలోనూ, మహిళా ఓటర్లను ప్రభావితం చేయడంలోనూ ప్రియాంక అనుసరించే శైలి రాహుల్ కంటే చాలా ఎక్కువ ప్రభావాన్ని చూపుతోంది.కాంగ్రెస్ నాయకత్వంలో అంతర్గతంగా ఒక కీలకమైన వ్యూహాత్మక మార్పు జరగబోతున్నట్లు తెలుస్తోంది. రాబోయే రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల బాధ్యతలను, ప్రచార సారథ్యాన్ని రాహుల్ గాంధీ కంటే ప్రియాంక గాంధీ వాద్రాకే అప్పగించాలని భావిస్తున్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను స్థానిక అంశాలపైనే ఉంచడం కాంగ్రెస్‌కు సాధ్యమవుతోంది. ఎంపీగా గెలిచిన తర్వాత ప్రియాంక కేవలం తెరవెనుక సంస్థాగత సర్దుబాట్లు చూసే నాయకురాలిగా కాకుండా.. పూర్తిస్థాయి మాస్ లీడర్‌గా ఆమెను ముందంజలో ఉంచాలని కాంగ్రెస్ పెద్దలు డిసైడ్ అయ్యారు.కానీ "రాహుల్‌ను అసెంబ్లీ ఎన్నికల బాధ్యతల నుంచి తప్పించి, ప్రియాంకకు అప్పగిస్తున్నారు" అని చెప్పడానికి ప్రస్తుతం పరిస్థితులు సరిపోవు.మోదీ వర్సెస్ రాహుల్ గా మార్చి రాష్ట్ర స్థాయి ఎన్నికలను సైతం జాతీయీకరణ చేసే ప్రయత్నం బీజేపీ చేస్తోంది. అయితే, ప్రియాంక రంగంలోకి దిగితే ఆ సమీకరణం మారుతుంది. ఆమె స్థానిక సమస్యలు, ధరల పెరుగుదల, మహిళా సంక్షేమం, నిరుద్యోగం వంటి అంశాల చుట్టూనే ప్రచారాన్ని నడిపిస్తూ బీజేపీపై ఎదురుదాడి చేస్తారు. దీనివల్ల రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను స్థానిక అంశాలపైనే ఉంచడం కాంగ్రెస్‌కు సాధ్యమవుతోంది. ఎంపీగా గెలిచిన తర్వాత ప్రియాంక కేవలం తెరవెనుక సంస్థాగత సర్దుబాట్లు చూసే నాయకురాలిగా కాకుండా.. పూర్తిస్థాయి మాస్ లీడర్‌గా ఆమెను ముందంజలో ఉంచాలని కాంగ్రెస్ పెద్దలు డిసైడ్ అయ్యారు.ఈ అంశంలో కొన్ని సవాళు లేకపోలేదు. ప్రియాంక ఇమేజ్ ఎంత ఆకర్షణీయంగా ఉన్నప్పటికీ.. స్థానిక బలమైన నాయకత్వం, గ్రౌండ్ లెవల్ బూత్ మేనేజ్‌మెంట్ లేకపోతే కేవలం వ్యక్తుల చరిష్మాతోనే ఎన్నికలను గెలవలేమని గత ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో నిరూపితమయింది. కాంగ్రెస్ ఇప్పటికే కొన్ని రాష్ట్రాలకు కొత్త ఇన్‌చార్జిలను నియమిస్తూ, ఎన్నికల రాష్ట్రాలపై ప్రత్యేకంగా దృష్టి పెడుతోంది.అయితే ముఖ్యమైన విషయం ఏమిటంటే, 2027 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో రాహుల్ గాంధీనే ప్రచారాన్ని నడిపిస్తారని కొత్త రాష్ట్ర ఇన్‌చార్జి సచిన్ పైలట్ స్పష్టంగా చెప్పారు.ఉత్తరాఖండ్‌లో కూడా కాంగ్రెస్ ప్రణాళికలో ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ముగ్గురూ ప్రచారంలో పాల్గొనడం కనిపిస్తోంది. అంటే ఇప్పటి వరకు "రాహుల్‌కు అసెంబ్లీ ఎన్నికల నుంచి పూర్తిగా విముక్తి" అనే సూచనలు కనిపించడం లేదు.అవును. దీనికి ఒక ముఖ్యమైన ఉదాహరణ 2026 అసోం ఎన్నికల సమయంలో కనిపించింది. కాంగ్రెస్ ప్రియాంక గాంధీని అస్సాం చైర్‌పర్సన్‌గా నియమించింది. ఈ కమిటీ ఎన్నికల అభ్యర్థుల ఎంపికకు సంబంధించిన ప్రక్రియలో కీలక పాత్ర పోషించింది.అంటే ప్రియాంక పాత్ర కేవలం సభల్లో ప్రచారం చేయడం వరకు కాకుండా టికెట్ల ఎంపిక, రాష్ట్ర స్థాయి ఎన్నికల వ్యూహం, సంస్థాగత సమన్వయం వంటి అంశాల వైపు కూడా విస్తరిస్తున్న సంకేతాలు ఉన్నాయి.అయితే ఇదే సమయంలో ఒక ఆసక్తికరమైన వ్యత్యాసం ఉంది. 2027 ఉత్తరప్రదేశ్ ఎన్నికల కోసం కాంగ్రెస్ చేపడుతున్న పునర్వ్యవస్థీకరణను పరిశీలించిన పార్టీ రాహుల్ గాంధీ బృందానికే జఖ ప్రచార బాధ్యతను ఎక్కువగా అప్పగించే దిశలో ఉందని పార్టీ వర్గాలను ఉటంకించింది.ఆగస్టులో జరిగిన యూపీ కాంగ్రెస్ సమావేశానికి రాహుల్, ఖర్గే హాజరైనా, ప్రియాంక హాజరు కాలేదని కూడా ఆ కథనం పేర్కొంది. కాబట్టి ప్రస్తుతం కనిపిస్తున్నది , కాంగ్రెస్ సంక్షోభంలో ఉన్న ప్రతిసారీ ఒక సంజీవనిలా కనిపించే ప్రియాంక ఫ్యాక్టర్‌ను.. ఈసారి పూర్తిస్థాయిలో ప్రయోగించి అసెంబ్లీ పోరుల్లో బీజేపీని నిలువరించాలని అధిష్ఠానం గట్టి పట్టుదలతో ఉంది. రాహుల్-ప్రియాంకల ఈ సరికొత్త పవర్ షేరింగ్ కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రాల స్థాయిలో ఎంతవరకు పునరుజ్జీవాన్ని తెస్తుందో రాబోయే ఎన్నికల ఫలితాలే తేల్చనున్నాయి.

మెట్‌పల్లి ప్రెస్ క్లబ్‌లో ఘనంగా చీటి శ్రీనివాస్ రావు

జన్మదిన వేడుకలు





మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి సెప్టెంబర్ 25(ప్రజాకలం) : తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే-ఐజేయూ) జగిత్యాల జిల్లా అధ్యక్షులు, మన తెలంగాణ దినపత్రిక జగిత్యాల జిల్లా స్టాఫ్ రిపోర్టర్ చీటి శ్రీనివాస్ రావు జన్మదిన వేడుకలను శుక్రవారం మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు, తోటి పాత్రికేయులు, మిత్రులు, శ్రేయోభిలాషులు శ్రీనివాస్ రావును శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి, పరస్పరం ఆనందాన్ని పంచుకున్నారు. పాత్రికేయ వృత్తిలో నిత్యం ప్రజా సమస్యలపై గళం వినిపిస్తూ, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ కోసం అంకితభావంతో పనిచేస్తున్న శ్రీనివాస్ రావు మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని, ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బూరం సంజీవ్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అజీమ్, ఉపాధ్యక్షులు జంగం విజయ్, అఫ్రోజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు సాజిద్ పాషా, బాసెట్టి హరీశ్, గౌరవ సలహాదారు దాసం కిషన్, క్యాషియర్ మక్సూద్, జాయింట్ సెక్రెటరీ పింజరి శివకుమార్, పుంద్ర శశికాంత్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎం.డి. సమీయుద్దీన్, కార్యవర్గ సభ్యులు పొనగాని మహేందర్, కుర్ర రాజేందర్, యానం రాకేష్, రఫీ ఉల్లా, సోహెల్, హైమద్, ముత్యాల రమేశ్, బొల్లం రాజు, మాజీ అధ్యక్షుడు ఆగ సురేష్, సభ్యులు ఆదిల్ పాషా, రమణ, శశికుమార్, అమ్ముల ప్రవీణ్, సమీర్ అలీ, తెలుకంటి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి

- అదనపు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసిన కాంగ్రెస్ నాయకులు



మల్లాపూర్, సెప్టెంబర్ 25 (ప్రజా కలం ప్రతినిధి)

మల్లాపూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయడంతో పాటు అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు అదనపు కలెక్టర్ రాజాగౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు సూచన మేరకు మల్లాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాట్ల సోమయ్య, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఏలాల జలపాతి రెడ్డి ఆధ్వర్యంలో ఈ వినతిపత్రాన్ని సమర్పించారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.ఇళ్లులేని అర్హులైన పేద కుటుంబాలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఎల్2, ఎల్3 కేటగిరీల్లో ఉన్న అర్హులైన లబ్ధిదారులకు ప్రాధాన్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు పెండింగ్‌లో ఉన్న పనులకు నిధులు మంజూరు చేసి త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు వెంకట్ రెడ్డి, లింబాద్రి, వెంకటేష్, కిసాన్ గౌడ్, సురేష్, గోల్కొండ రమేష్, గొండ రాజేందర్, నాయకులు నల్ల రాజన్న, నర్సారెడ్డి, కిరణ్, రొండ్ల రాజారెడ్డి, నర్సయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గణేశ్ నిమజ్జనం

మూడో రోజు భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ అశోక్‌కుమార్





జగిత్యాల ప్రతినిధి సెప్టెంబర్ 25 (ప్రజాకలం)

జిల్లాలో గణేష్ నిమజ్జనోత్సవాలు మూడో రోజు కూడా ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. జగిత్యాల, కోరుట్ల పట్టణాల్లోని నిమజ్జన కేంద్రాల వద్ద జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఐపీఎస్ భద్రతా ఏర్పాట్లను, నిమజ్జన ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు.న్ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో గణేష్ నిమజ్జనోత్సవాలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. గత రెండు రోజులుగా వివిధ శాఖల సమన్వయంతో నిమజ్జన కార్యక్రమాలను సజావుగా నిర్వహిస్తున్నామని చెప్పారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా భద్రతా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. నిమజ్జన కేంద్రాల వద్ద సీసీటీవీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని తెలిపారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు ప్రజలు పోలీసులకు సహకరించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. గణేష్ నిమజ్జనోత్సవాల్లో ట్రాఫిక్ నియంత్రణ, ప్రజలకు మార్గనిర్దేశం చేయడంలో ట్రాన్స్‌జెండర్లు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజల భద్రత కోసం పోలీసులతో కలిసి వారు స్వచ్ఛందంగా అందిస్తున్న సహకారం సామాజిక బాధ్యతకు నిదర్శనమన్నారు.

ప్రజలు కూడా వారి సేవలను గౌరవిస్తూ సహకరించాలని సూచించారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీ చేతన్ నితిన్, డీఎస్పీలు రాములు, పురుషోత్తంరెడ్డి, ఇన్‌స్పెక్టర్లు సురేష్‌బాబు, లక్ష్మీనారాయణ, ఆరిఫ్ అలీఖాన్, సుధాకర్ తదితర పోలీసు అధికారులు ఉన్నారు.



ఘనంగా చీటి శ్రీనివాస్ రావు జన్మదిన వేడుకలు





మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి సెప్టెంబర్ 25 (ప్రజా కలం) తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే-ఐజేయూ) జగిత్యాల జిల్లా అధ్యక్షులు, మన తెలంగాణ దినపత్రిక జగిత్యాల జిల్లా స్టాఫ్ రిపోర్టర్ చీటి శ్రీనివాస్ రావు జన్మదిన వేడుకలను శుక్రవారం మెట్‌పల్లిలోని జువ్వాడి భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్మక కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగ్ రావు చీటి శ్రీనివాస్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు, నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొని శ్రీనివాస్ రావుకు శుభాకాంక్షలు తెలిపారు.

నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



జగిత్యాల ప్రతినిధి సెప్టెంబర్ 25 (ప్రజాకలం)

జగిత్యాల జిల్లా భీమారం మండలంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుక్రవారం ఆకస్మికంగా పర్యటించి వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రాజలింగంపేట గ్రామంలో నిర్మాణంలో ఉన్న గ్రామ పంచాయతీ భవనాన్ని పరిశీలించారు. భవన నిర్మాణ పనుల పురోగతిని, నిర్మాణ నాణ్యతను పరిశీలించి, పనులను నిర్దేశిత ప్రమాణాల ప్రకారం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా భవనాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం భీమారం గ్రామంలో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతి, భవనం నాణ్యత, మౌలిక వసతుల ఏర్పాటుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.చిన్నారులకు అనుకూలంగా, సురక్షితమైన వాతావరణం కల్పించే విధంగా అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణాన్ని పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, పనులలో ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశిత లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, తహసీల్దార్ వసంత, ఇంజనీర్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లిలో వనమహోత్సవం

నేషనల్ హైవే డివైడర్ల మధ్య 400 మొక్కలు



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి సెప్టెంబర్ 25 (ప్రజాకాలం):- వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మెట్‌పల్లి పట్టణంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. నేషనల్ హైవే డివైడర్ల మధ్యలో 400 మొక్కలతో పాటు ఉర్దూ మీడియం హైస్కూల్‌లో మొక్కలను నాటారు.పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించడం, పట్టణాన్ని పచ్చదనంతో కళకళలాడించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. మొక్కల పెంపకం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు భావితరాలకు స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించవచ్చన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, కౌన్సిలర్లు బొడ్ల ఆనంద్, బత్తుల నరేశ, అరిగెల అనూశ, నాయకులు అరిగెల రాకేశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేష్ నాయక్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ విష్ణు ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.



27న ఉమ్మడి జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ ఎంపిక పోటీలు



పెద్దపల్లి,సెప్టెంబర్ 25:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) కరీంనగర్ ఉమ్మడి జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ ఎంపిక పోటీలు ఈ నెల 27న సుల్తానాబాద్‌లో నిర్వహించనున్నట్లు పెద్దపల్లి జిల్లా ఎస్ జి ఎఫ్ కార్యదర్శి కనుకుంట్ల లక్ష్మణ్ తెలిపారు.స్థానిక ఎస్ ఎన్ ఆర్ స్పోర్ట్స్ అకాడమీ లో అండర్-14,అండర్-17 బాలబాలికల విభాగాల్లో ఎంపిక పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని నాలుగు జిల్లాలకు చెందిన అర్హత కలిగిన క్రీడాకారులు పోటీలకు హాజరుకావచ్చని తెలిపారు.క్రీడాకారులు 27న ఉదయం 9 గంటలకు ఎలిజిబిలిటీ ఫామ్‌తో వేదిక వద్ద రిపోర్టు చేయాలని సూచించారు.ప్రతిభ ఆధారంగా క్రీడాకారులను తదుపరి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.మరిన్ని వివరాలకు 9396540067, 99898 48858, 9618336976 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బాలింతలకు గర్భిణీలకు పోషణ మాసం కార్యక్రమం



ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 25(ప్రజా కలం ప్రతినిధి) ఇబ్రహీంపట్నం మండలంలోని కోమటి కొండాపూర్ గ్రామంలోపోషణ మాసంలో భాగంగా గర్భిణీ బాలింతలు పిల్లల పైన ఆరోగ్యం పైన దృష్టి సరైన సమయంలో సరైన పోషకాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు పరిశుభ్రత స్వచ్ఛత పైన అంగన్వాడీ సూపర్వైజర్ శంకరమ్మ. అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పద్మజా.హెచ్ఎం సుధారాణి, కార్యదర్శి మనోజ్ , వివో అధ్యక్షులు జక్కని లక్ష్మి. నవ్య శ్రీ కారోబార్ మహదేవ్, పాఠశాల ఉపాధ్యాయునిఉపాధ్యాయులు, ఆశాలు .పద్మ. వసంత అంగన్వాడీ టీచర్స్ అంగన్వాడీ టీచర్స్ స్వరూప రాణి, సుమలత గర్భిణీ బాలింతలు పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

వికలాంగుల సమస్యల పరిష్కారానికి 28న కలెక్టరేట్ ధర్నా

ఎన్ పి ఆర్ డి జిల్లా ప్రధాన కార్యదర్శి పులిజాల బాలేశ్వర్



నాగర్ కర్నూల్ సెప్టెంబరు 25 (ప్రజా కలం): వికలాంగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 28న జిల్లా కేంద్రం లోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఎన్ పి ఆర్ డి వికలాంగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పులిజాల బాలిశ్వర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలోని వికలాంగుల బ్యాక్ లాగ్ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.జనాభా లెక్కల్లో కేంద్ర ప్రభుత్వం 21 రకాల వైకల్యాలను నమోదు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వికలాంగులకు పెన్షన్ నెలకు రూ.6000 కు పెంచాలని అన్నారు. వికలాంగుల హక్కులు సంక్షేమ కోసం నిర్వహిస్తున్న ధర్నాకు జిల్లాలోని వికలాంగులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

భోసిలో రూ. 71 వేలు పలికిన వరసిద్ధి కర్ర వినాయక లడ్డూ

తానూర్, సెప్టెంబర్ 25(ప్రజా కలం): మండలంలోని భోసి గ్రామంలో శ్రీ వరసిద్ధి కర్ర వినాయక ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో సాగాయి, వేలం పాటలో స్వామివారి లడ్డూను పసుల భోజన్న రూ,71 వెలకు దక్కించుకున్నారు, అలాగే పలక – బలపం రూ. 12,000, కండువా రూ. 5,500, కాపీ పెన్ను రూ. 5,100, చిన్న కండువా రూ. 2,800కు వేలంలో పలికాయి,భక్తుల ఉత్సాహంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది,వచ్చిన ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి, ఉత్సవాలకు వాడనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



నిర్మల్ ఎస్పీ క్యాంపు కార్యాలయంలో

ఘనంగా గణేష్ నిమజ్జనోత్సవం

- పాల్గొన్న జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల



నిర్మల్ సెప్టెంబర్ 25 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) నిర్మల్ జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రతిష్ఠించిన శ్రీ గణేష్ విగ్రహానికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ప్రత్యేక పూజల అనంతరం జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, గణేష్ నిమజ్జన శోభాయాత్రను ప్రారంభించారు.అనంతరం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో పోలీస్ సిబ్బంది కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల తో పాటు, వికారాబాద్ అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనా, ఖైరుసా ఎ ఎస్పి సాయి కిరణ్, నిర్మల్ డి ఎస్పి శ్రీనివాస్, 14 మంది డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

న్యూ వెల్మల్‌లో 80 శాతం సర్వే పూర్తి.. మిగిలిన ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలి : జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ సెప్టెంబర్ 25 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

భూముల రీ సర్వే ద్వారా ఏళ్ల తరబడి కొనసాగుతున్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. శుక్రవారం సోన్ మండలం న్యూ వెల్మల్ గ్రామంలో భూముల రీ సర్వే ప్రక్రియపై గ్రామస్తులు, రైతులతో గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రీ సర్వే పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే ప్రక్రియతో భూముల హద్దులు, హక్కులకు సంబంధించి నెలకొన్న సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. న్యూ వెల్మల్ గ్రామంలో ఇప్పటికే 80 శాతం రీ సర్వే పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వే సమయంలో రైతులు తప్పనిసరిగా తమ భూముల వద్ద అందుబాటులో ఉండి అధికారులకు సహకరించాలని సూచించారు. రీ సర్వేకు రైతులు అందిస్తున్న సహకారాన్ని కలెక్టర్ అభినందించారు. క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియ సజావుగా జరిగేలా సంబంధిత అధికారుల బృందాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, గ్రామంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న భూ సమస్యలకు రీ సర్వే ద్వారా పరిష్కారం లభిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. సర్వే పూర్తయ్యే వరకు అధికారులకు తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ చర్యలు చేపట్టిన కలెక్టర్, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, ఏడీ ల్యాండ్ సర్వే అండ్ రికార్డ్స్ విఠల్, తహసీల్దార్ సంతోష్, సర్పంచ్ సాగర్, సంబంధిత అధికారులు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మందుల భద్రతలో ఫార్మసిస్టుల పాత్ర కీలకం

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఫార్మసిస్టుల సేవలు ఎంతో ముఖ్యం : ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ డాక్టర్ రఫీక్



నాగర్‌కర్నూల్ సెప్టెంబర్ 25 (ప్రజా కలం): మందుల నాణ్యత, భద్రత, నిల్వ, గడువు తేదీల పరిశీలనతో పాటు సరైన రోగికి సరైన మోతాదులో, సరైన సమయంలో మందులు అందేలా చూడటంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకమని ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ డాక్టర్ రఫీక్ అన్నారు. ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వ ఫార్మసీ అధికారుల సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పాత కలెక్టరేట్‌లోని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రఫీక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల లభ్యత, స్టాక్ నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ అవసరమన్నారు. యాంటీబయాటిక్స్‌ను అనవసరంగా వినియోగించకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ ఫార్మసిస్టులు కేవలం మందులు పంపిణీ చేసే సిబ్బంది మాత్రమే కాకుండా ప్రజారోగ్య వ్యవస్థలో కీలక భాగస్వాములని పేర్కొన్నారు. డిజిటల్ స్టాక్ మేనేజ్‌మెంట్, ఈ-విన్ వంటి సాంకేతికతల వినియోగంతో మందుల నిర్వహణ మరింత సమర్థవంతంగా మారుతోందన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో ఫార్మసీ సేవలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని సంఘం ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎం. సురేశ్ కుమార్, కార్యదర్శి శ్రీనివాసులు, ట్రెజరర్ దామగట్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.50 కోట్లతో మినీ ట్యాంక్ బండ్ సుందరీకరణ

- పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి
- వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, ఓపెన్ జిమ్, బతుకమ్మ ఘాట్ ఏర్పాటు
- పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి: అధికారులకు ఆదేశం



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి సెప్టెంబర్ 25:

మహబూబ్‌నగర్ పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన, ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) నిధులు రూ. 1.50 కోట్లతో మినీ ట్యాంక్ బండ్‌పై చేపట్టిన సుందరీకరణ, అభివృద్ధి పనులను ఆయన సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మినీ ట్యాంక్ బండ్‌నుపట్టణవాసులు కుటుంబ సమేతంగా వచ్చి సేదతీరేలా అన్ని హంగులతో తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వాకర్స్ సౌకర్యార్థం అత్యాధునిక వాకింగ్ ట్రాక్, యువత ఫిట్‌నెస్ కోసం ఓపెన్ జిమ్, ప్రత్యేక సెల్ఫీ పాయింట్, చిన్నారుల వినోదం కోసం ప్రత్యేక చిల్డ్రన్స్ ప్లే ఏరియాను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా మహిళలు ఘనంగా వేడుకలు జరుపుకునేలా విశాలమైన బతుకమ్మ ఘాట్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు.

అభివృద్ధి పనుల్లో ఎక్కడా నాణ్యతా ప్రమాణాలు తగ్గకుండా చూసుకోవాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా పనులను వేగవంతంగా పూర్తి చేసి, త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, నగర డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామానుజులు రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలి

అచ్చంపేట కల్వకుర్తి ప్రాంతాలకు సాగునీరు అందించాలి: సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టీ. సాగర్

నాగర్‌కర్నూల్ సెప్టెంబర్ 25 (ప్రజా కలం): ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను ప్రభుత్వం వెంటనే పూర్తి చేసి నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రతి ప్రాంతానికి సాగునీరు అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కామ్రేడ్ టీ. సాగర్ డిమాండ్ చేశారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన టీ. సాగర్ మాట్లాడుతూ పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం తదితర ప్రాజెక్టుల విషయంలో గత, ప్రస్తుత ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును త్వరగా పూర్తి చేస్తామని గత ప్రభుత్వం పలుమార్లు ప్రకటించినప్పటికీ, పదేళ్ల పాలనలో ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదని ఆయన అన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అవసరమైన నిధులు కేటాయించి పనులను వేగవంతం చేయకుండా జాప్యం చేస్తోందని ఆరోపించారు. ప్రాజెక్టులకు నిధుల విడుదలలో ఆలస్యం కారణంగా కృష్ణా జలాలను ఉమ్మడి పాలమూరు జిల్లాకు పూర్తిస్థాయిలో వినియోగించుకునే అవకాశం కోల్పోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలోని అచ్చంపేట, కల్వకుర్తి తదితర దూర ప్రాంతాల్లో సాగునీటి వసతులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో అనేక ఎకరాల భూములు బీడు భూములుగా మిగిలిపోతున్నాయని తెలిపారు. రైతులకు సాగునీరు అందించేందుకు అవసరమైన ప్రాజెక్టులు, కాలువల నిర్మాణం, పంపిణీ వ్యవస్థలను వేగంగా పూర్తి చేయాలని కోరారు. పెండింగ్ పనులకు ప్రత్యేక నిధులు కేటాయించి, నిర్దిష్ట గడువులోగా పనులు పూర్తయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే జిల్లాలో వ్యవసాయ విస్తీర్ణం పెరగడంతో పాటు రైతుల ఆదాయం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని పేర్కొన్నారు. నీటి లభ్యత ఉన్న ప్రాంతాలకు మాత్రమే కాకుండా సాగునీటి సౌకర్యం లేని మారుమూల ప్రాంతాలకు కూడా సమానంగా నీరు అందేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ఆయన కోరారు. సమావేశంలో సీపీఎం నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్. శ్రీనివాస్, దేశ్యానాయక్, గీత, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ బ్యాంకులపై కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించాలి

- సెప్టెంబర్ 28, 29, 30న బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు



నాగర్‌కర్నూల్ సెప్టెంబర్ 25 (ప్రజాకలం): ప్రభుత్వ రంగ బ్యాంకులను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, వాటిపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీనివాస్ అన్నారు. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో నిర్వహించనున్న బ్యాంకు ఉద్యోగులు, అధికారుల సమ్మెకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. సమ్మెకు మద్దతుగా గురువారం జిల్లాలోని ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వారానికి ఐదు రోజుల పని దినాల విధానాన్ని అమలు చేయాలని పీఎల్ఐ పథకం అమలులో ఏకపక్ష ధోరణిని వ్యతిరేకిస్తూ మొత్తం 12 డిమాండ్లతో బ్యాంకు ఉద్యోగులు సమ్మెకు పిలుపునిచ్చారని తెలిపారు. 2026 కేంద్ర బడ్జెట్‌లో బ్యాంకింగ్ రంగంపై ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు ప్రతిపాదనపై గతంలో నియమించిన పలు కమిటీల సిఫారసుల ఫలితంగా ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రభావం పడిందని పేర్కొన్నారు. దశాబ్దాలుగా బ్యాంకింగ్ రంగంలో అమలవుతున్న ద్వైపాక్షిక ఒప్పందాల విధానాన్ని బలహీనపరిచే చర్యలను సీఐటీయూ వ్యతిరేకిస్తుందని అన్నారు. బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగుల హక్కులు, ప్రభుత్వ రంగ బ్యాంకుల పరిరక్షణ కోసం చేపడుతున్న సమ్మెకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గుంపల్లి అశోక్, బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

రాయపాడులో సేంద్రీయ ఎరువుల తయారీపై శిక్షణ

ఆళ్లపల్లి, సెప్టెంబర్ 25, ప్రజాకలం ఆళ్లపల్లి మండల పరిధిలోని రాయపాడు గ్రామంలో సేంద్రీయ ఎరువుల తయారీపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఈ కార్యక్రమానికి ఐటీడీఏ భద్రాచలం డీజీఎం హరికృష్ణ, ఏడీఏ తాతారావు, వ్యవసాయ శాఖ అధికారులు అనసూర్య, కుమార్‌రాజా హాజరయ్యారు. 45 రోజుల పాటునిర్వహించనున్న ఈ శిక్షణలో శిక్షకురాలు శ్రేయతో పాటు సేంద్రీయ వ్యవసాయ రైతులు పాపారావు, ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు వర్మీ కంపోస్టు తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా వివరించారు. వర్మీ బెడ్ ఏర్పాటు చేసి, అందులో వానపాములను ప్రవేశపెట్టే విధానాన్ని ప్రదర్శించారు.అనంతరం డీజీఎం హరికృష్ణ రైతులకు కిట్, టీషర్ట్, నోట్‌బుక్, పెన్, శిక్షణా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఏడీఏ తాతారావు మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో ఆరోగ్యకరమైన జీవనం ఎంతో అవసరమన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే రైతులు సేంద్రీయ వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రీయ పద్ధతుల్లో సాగు చేయడం ద్వారా ఆరోగ్యకరమైన పంటలను ఉత్పత్తి చేయవచ్చని తెలిపారు.

పాఠశాలల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి సెప్టెంబర్ 25: మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ లైన్ ఉన్నత పాఠశాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో పారిశుధ్య నిర్వహణ, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు.అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, విద్యాబోధన, తాగునీరు, మరుగుదొడ్లు తదితర వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రాంగణం, తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీటి వసతులను పరిశీలించారు.పాఠశాలలో పారిశుధ్య నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసిన అదనపు కలెక్టర్, ఇదే విధంగా నిరంతరం పరిశుభ్రతను కొనసాగించాలని సూచించారు. విద్యార్థులకు ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకుఉపాధ్యాయులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని అన్నారు.విద్యార్థుల విద్యాభ్యాసంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పాఠశాలలో వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి సూచించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం:

ఐసిడిఎస్ సిడిపిఓ రాజశ్రీ - తానూర్‌లో పోషణ్ అభియాన్ సదస్సు



తానూర్, సెప్టెంబర్ 25(ప్రజా కలం): మండల కేంద్రమైన తానూర్ లో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ముధోల్ సిడిపిఓ రాజశ్రీ, సూపర్వైజర్ నిఖిత ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు,ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని, అప్పుడే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు, ముఖ్యంగా గర్భవతులు, బాలింతలు సరైన ఆహార నియమాలు పాటించాలని అవగాహన కల్పించారు, ఆయుర్వేదిక్ డాక్టర్ లలిత కూడా మహిళలకు ఆరోగ్య సూచనలు చేశారు,ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుగంధ, కార్యదర్శి షఫీక్, ఐసిడిఎస్ సిబ్బంది రోజా, అంగన్వాడీ టీచర్లు వందన, శోభ, మనీషా, సావిత్ర, అనిత, సరస్వతి, బాలింతలు, చిన్నారులు, పాల్గొన్నారు.

శాంతియుత వాతావరణంలో వినాయక

నిమజ్జనోత్సవాలు నిర్వహించాలి

- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌లి

నిర్మల్ సెప్టెంబర్ 25 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) కుభీర్ మండల కేంద్రంలో వినాయక నిమజ్జనోత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ సూచించారు.



శుక్రవారం కుబీర్ మండల కేంద్రంలోని శ్రీ విఠలేశ్వర ఆలయం వద్ద నిర్వహించిన శ్రీ వరసిద్ధి వినాయక నిమజ్జన మహోత్సవంతో పాటు వలు వినాయక మండపాల్లో జరిగిన నిమజ్జన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.ఈ సందర్భంగా శ్రీ విఠలేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం వినాయక నిమజ్జనోత్సవంలో పాల్గొని భక్తులతో కలిసి వేడుకలను తిలకించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిమజ్జనోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ సంయమనం, క్రమశిక్షణ పాటించాలని కోరారు. పోలీసు, అధికార యంత్రాంగానికి సహకరిస్తూ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు.భక్తులు, యువత శాంతి, సోదరభావంతో వ్యవహరిస్తూ నిమజ్జనోత్సవాలను విజయవంతంగా నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు,మండల సీనియర్ నాయకులు, కార్యకర్తలు,తదితరులు ఉన్నారు.

తల్లాడలో ఘనంగా వినాయక నిమజ్జన శోభాయాత్ర

- మహిళలు కుంకుమార్చన కలశ కార్యక్రమాలు నిర్వహణ

తల్లాడ సెప్టెంబర్ 25, ప్రజా కలం న్యూస్.తల్లాడ పట్టణం నందు శ్రీ వాసవి కన్వెన్షన్ హాల్ లో ఆర్యవైశ్య సంఘం వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్న



వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన, కార్యక్రమాలలో రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ సభ్యులు నంబూరి మోహన్ రావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ విఘ్నాలు తొలగి,ఆయురారోగ్యాలు,సుఖసంతోషాలు,శాంతి సమృద్ధులు కలగాలని శ్రీ వినాయకుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో నంబూరి నారాయణరావు,వేమిశెట్టి వెంకటేశ్వరరావు, నంబూరి కనకయ్య, వేమిశెట్టి నాగన్న, నంబూరి నాగేశ్వరరావు, జవాజి పెద్ద నగేష్, అనుమోలు సర్వేశ్వరరావు, నంబూరి శ్రీను,బొజ్జా నరసింహారావు,గుర్రం గురుణాఖర్,బండారు గోపాలకృష్ణ,వేమిశెట్టి జగదీష్,బండారి నరసింహారావు, పసుమర్తి హరీష్, దేవిశెట్టి రాంబాబు, కొత్తూరి సతీష్,పసుమర్తి మురళి,వేమిశెట్టి సంతోష్,పసుమర్తి కాశి,లగడపాటి నెహ్రూ,వేమిశెట్టి శంకర్, కనకయ్య,మణికంఠ, శబరి,వేమిశెట్టి దిలీప్,రంగా రమేష్, కొత్తూరు సతీష్, మురళి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు

మల్హర్, సెప్టెంబర్ 25 ప్రజాకలం ప్రతినిధి...

మల్హర్‌రావు మండలంలోని ఎడ్లపల్లి మోడల్ స్కూల్ అండ్ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు



ఎంపికైనట్లు శుక్రవారం కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్. పూర్ణచంద్రరావు తెలిపారు. ఈ నెల 26, 27 తేదీల్లో హనుమకొండ జిల్లాలోని జేఎన్ఎస్ స్టేడియంలో నిర్వహించనున్న పోటీల్లో జిల్లా తరఫున వారు రాష్ట్రస్థాయిలో ప్రాతినిధ్యం వహించనున్నారు. షాట్‌పుట్ విభాగంలో బండి గణేష్, కొడారి హిమజ, లాంగ్‌జంప్‌లో పుట్ట సంకీర్తన, 100 మీటర్ల పరుగు పందెంలో పోలం నిత్య పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థులకు శిక్షణ అందించి రాష్ట్రస్థాయి పోటీలకు తీసుకువచ్చిన ఫిజికల్ డైరెక్టర్ పక్కల రాజబాబు, కోచ్ హాట్కార్ రఘువీర్, మేనేజర్ లావుడ్యా సారయ్యలను ప్రిన్సిపల్, ఉపాధ్యాయ బృందం అభినందించారు. చదువుతోపాటు విద్యార్థులకు క్రీడలు, సామాజిక కార్యక్రమాల్లోనూ ప్రాధాన్యం ఇస్తున్నామని ప్రిన్సిపల్ పూర్ణచంద్రరావు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో సైతం విద్యార్థులు ప్రతిభ కనబరచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

పదోన్నతిపై బదిలీ వెళ్తున్న గోపాల్ నాయక్‌కు ఘన సన్మానం

గద్వాల ప్రతినిధి । సెప్టెంబర్ 25 । ప్రజా కలం : జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న గోపాల్ నాయక్ శుక్రవారం పదోన్నతి పొంది బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పి. వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా సన్మానం నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ పి. వినోద్ కుమార్ మాట్లాడుతూ.. గోపాల్ నాయక్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన కాలంలో ప్రజలకు అందించిన సేవలను అభినందించారు. విధి నిర్వహణలో ప్రజలతో స్నేహపూర్వకంగా ఉంటూ, బాధ్యతాయుతంగా సేవలు అందించారని కొనియాడారు. ఏఎస్సైగా పదోన్నతి పొందడం అభినందనీయమని, నూతన బాధ్యతల్లో కూడా ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందిస్తూ మంచి పేరు సంపాదించుకోవాలని ఆకాంక్షించారు. పదోన్నతితో పాటు బదిలీపై వెళ్తున్న గోపాల్ నాయక్‌కు సర్పంచ్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా గోపాల్ నాయక్‌ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు రంగస్వామి, గంగన్న, వెంకట్రాములు, ఆనంద్తో పాటు గ్రామ యువత, తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛ గ్రామంగా తయారు చేయడమే ప్రధాన లక్ష్యం

అన్నారుగూడెంలో ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమం

దొడ్డ శ్రీనివాసరావు పర్యవేక్షణలో బీసీ కాలనీలో పరిశుభ్రత పనులు

లక్ష్యాలు చేరుకోవడానికి ప్రజలు విధిగా భాగస్వాములవ్వాలి

మాజీ ఎంపీపీ, స్థానిక సర్పంచ్ గొడ్ల ప్రభాకర్ పిలుపు



తల్లాడ సెప్టెంబర్ 25, ప్రజా కలం న్యూస్

అన్నారుగూడెం గ్రామాన్ని పరిశుభ్రతకు ఆదర్శంగా నిలపాలనే లక్ష్యంతో తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు పర్యవేక్షణలో,స్థానిక సర్పంచ్ గొడ్ల ప్రభాకర్ నేతృత్వంలో శుక్రవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. అన్నారుగూడెం రామాలయ పరిసరాల నుంచి బీసీ కాలనీ అంతటా పారిశుద్ధ్య పనులు చేపట్టి, పేరుకుపోయిన చెత్తాచెదారం, మురుగు, పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా దొడ్డ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పడం ప్రతి ఒక్కరి బాధ్యతని, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అన్నారుగూడెంను స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంలో పరిశుభ్రత కార్యక్రమాలు ఒక్కరోజుకే పరిమితం కాకుండా నిరంతరం కొనసాగాలి.ప్రజలు కూడా తమ ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని సహకరించాలని ఆయన పేర్కొన్నారు. గ్రామంలోని ప్రధాన వీధులు,కాలనీల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక దృష్టి సారించాలని, మురుగు నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా గ్రామపంచాయతీ సిబ్బందికి సహకరించాలని కోరారు. స్థానిక సర్పంచ్ గొడ్ల ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పంచాయతీ ఆధ్వర్యంలో నిరంతర చర్యలు చేపడుతున్నామని తెలిపారు.ప్రతి కుటుంబం పారిశుద్ధ్య బాధ్యతలో భాగస్వామయితేనే స్వచ్ఛ అన్నారుగూడెం లక్ష్యాలు సాధ్యమవుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, సర్పంచ్ గొడ్ల ప్రభాకర్,వార్డ్ మెంబర్ రాజబంటి వంశీ, పంచాయతీ సెక్రెటరీ కె వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు సుంకర రోశయ్య, సుంకర జగ్గయ్య, సుంకర నాగేశ్వరరావు,గ్రామ ప్రజలు,పంచాయతీ గుమస్తా రవేష్, పంచాయతీ సిబ్బంది,స్థానిక నాయకులు పాల్గొని పారిశుద్ధ్య పనుల్లో భాగస్వాములయ్యారు.

వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలను

సమగ్రంగా రూపొందించాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి సెప్టెంబర్ 25:

ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలలో భాగంగా శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికల రూపకల్పనపై అడ్డాకల్, భూత్పూర్, చిన్నచింతకుంట, దేవరకద్ర, జడ్చర్ల, కోయిలకొండ, కౌకుంట్ల, మూసాపేట, రాజాపూర్ తొమ్మిది మండలాల సర్పంచులు, ఎం.పి.డి.ఓలు, ఎం.పి.ఓలు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్రస్థాయి సిబ్బందికి ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామసభల్లో చర్చించాల్సిన అంశాలు, గ్రామాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు, ప్రభుత్వ పథకాలు, అందుబాటులో ఉన్న నిధులను సద్వినియోగం చేసుకునే విధానాలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా వి.బి.జి. రామ్‌జీ పథకం కింద గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలలో పొందుపర్చువాలని అన్నారు. గ్రామాభివృద్ధికి సర్పంచులు, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అక్టోబర్ 1 నుంచి 2027 జూన్ వరకు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాల సమగ్ర అభివృద్ధికి దోహదపడే పనులను గుర్తించి, వాటిని వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికల్లో పొందుపరచాలని తెలిపారు.ఎల్ నీనో వల్ల జిల్లాలో వర్షాభావ పరిస్థితులు ఉన్నందున భూగర్భ జలాలపై వాటి ప్రభావాలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో నీటి భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేలా అవసరమైన ప్రాంతాల్లో చెక్‌డ్యామ్‌లు, ఫామ్ పాండ్లు, పర్కొలేషన్ ట్యాంకులు, రీచార్జ్ నిర్మాణాలు, రీచార్జ్ బోర్‌వెల్లు, సోక్‌పిట్లు వంటి పనులను చేపట్టాలని తెలిపారు. వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు నీటి వనరుల సంరక్షణ, భూగర్భ జలాల రీచార్జ్, వ్యవసాయంలో నీటి వినియోగ సామర్థ్యం పెంపు, పంటల వైవిధ్యీకరణ వంటి అంశాలను ప్రణాళికల్లో చేర్చాలని సూచించారు. గ్రామాల వారీగా వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలను ఈ నెల 30వ తేదీలోగా సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు. నీటి సంరక్షణ తో పాటూ, మౌలిక వసతుల కల్పన, జీవనోపాధి అభివృద్ధి, వర్షాభావ పరిస్థితుల నివారణ అనే నాలుగు ప్రధాన రంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.గ్రామాలలో పాఠశాల, గ్రామ పంచాయతీ, వి.ఓ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, ప్రహరీ గోడలు, డ్రైనేజీలు, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు తదితర మౌలిక అవసరాలను గుర్తించి ప్రణాళికల్లో చేర్చాలని తెలిపారు.అక్టోబర్ 2న నిర్వహించనున్న గ్రామసభల్లో గ్రామాభివృద్ధికి సంబంధించిన అంశాలపై సమగ్రంగా చర్చించి, అవసరమైన తీర్మానాలు చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. గ్రామం అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొంటూ, గ్రామాభివృద్ధిలో సర్పంచులు పునాది వంటివారని అన్నారు. గ్రామాల్లో ఎదురయ్యే సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన నిధులు, సౌకర్యాలను పొందేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని తెలిపారు. పరిష్కరించాల్సిన సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువస్తే, ప్రభుత్వ స్థాయిలో వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లాను అభివృద్ధిలో ముందంజలో నిలిపేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని అదనపు కలెక్టర్ కోరారు.కార్యక్రమంలో భాగంగా జిల్లా ఉద్యానవన శాఖ అధికారి వేణుగోపాల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద నాయక్, మిషన్ భగీరథ ఇంట్రా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జయాబాయి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శివానంద స్వామి తమ శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు, అమలు చేస్తున్న పథకాలను సర్పంచులకు వివరించారు. ఆయా శాఖల పరిధిలో ఉన్న పథకాలకు అనుగుణంగా గ్రామాల్లో అవసరమైన పనులను గుర్తించి వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికల్లో పొందుపరచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జెడ్.పి.సి.ఈ.ఓ, ఇన్‌చార్జి డి.పి.ఓ వెంకట్ రెడ్డి, డి.ఆర్.డి.ఓ నరసింహులు, జిల్లా అధికారులు, ఎం.పి.డి.ఓ లు, ఎం.పి.ఓ లు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎఫ్ఏలు, టీఏలు, వి.బి.జి. రామ్‌జీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోలు పకడ్బందీగా చేపట్టాలి

- జిల్లా ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్

నిర్మల్ సెప్టెంబర్ 25 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ఖరీఫ్ పంటల కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్ రెవెన్యూ రాథోడ్ రమేష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో కలిసి ఖరీఫ్ (వానాకాలం) వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంబంధిత శాఖల అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సమన్వయంతో పనిచేస్తూ, పంట కొనుగోలును పకడ్బందీగా చేపట్టాలన్నారు. గతంలో క్షేత్రస్థాయిలో ఎదురైన అనుభవాల దృష్ట్యా తగిన ప్రణాళికలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎటువంటి సమస్యలు కలగకుండా చూడాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని వివరించారు. వ్యవసాయ అధికారులు మండలాల వారీగా వివరాలు సేకరించి, తగినన్ని



కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కు సంబంధించి సామాగ్రి అంతా అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, వ్యవసాయ అధికారి సుజాత, తూనికలు కొలతల అధికారి శంకర్, డిసిఓ నర్సయ్య, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పుల్జల గ్రామానికి బస్సు సౌకర్యం

ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి చొరవతో

నాగర్‌కర్నూల్-మల్కాపూర్ బస్సు ప్రారంభం



నాగర్‌కర్నూల్ సెప్టెంబర్ 25 (ప్రజాకలం): గత కొన్నేళ్లుగా బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పుల్జల గ్రామ ప్రజల సమస్యకు పరిష్కారం లభించింది. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి చొరవతో నాగర్‌కర్నూల్ నుంచి మల్కాపూర్ మీదుగా పుల్జల, తాళ్లపల్లి, నడిగడ్డ, తెలకపల్లి వరకు నూతన బస్సు మార్గాన్ని ప్రారంభించారు.గ్రామీణ ప్రాంత ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ప్రారంభించిన ఈ బస్సు మార్గం వల్ల ఆయా గ్రామాల ప్రజలకు ప్రయాణ ఇబ్బందులు తగ్గనున్నాయని ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, మహిళలు, వృద్ధులు మండల కేంద్రాలు, జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగించేందుకు సౌకర్యం కలగనుంది.ఇప్పటివరకు బస్సు సౌకర్యం లేక ప్రైవేట్ వాహనాలపై ఆధారపడాల్సి వచ్చిన గ్రామాల ప్రజలకు ఈ మార్గం అందుబాటులోకి రావడం ఉపశమనంగా మారిందన్నారు ప్రజల అవసరాలను గుర్తించి రవాణా సౌకర్యం కల్పించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. నూతన బస్సు మార్గం ద్వారా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, ప్రజల రాకపోకలకు మరింత ప్రోత్సాహం లభించనుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.

నాగర్‌కర్నూల్ అథ్లెటిక్స్ విద్యార్థుల సత్తా

రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్

ఛాంపియన్‌షిప్‌కు నవీన్, అజయ్ ఎంపిక

నాగర్‌కర్నూల్ సెప్టెంబర్ 25 (ప్రజా కలం): నాగర్‌కర్నూల్ లక్ష్య అథ్లెటిక్స్ కోచింగ్ సెంటర్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 26, 27 తేదీల్లో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ జేఎన్ స్టేడియంలో నిర్వహించనున్న 12వ తెలంగాణ రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2026లో వారు పాల్గొననున్నారు. అండర్-18 విభాగంలో 1500 మీటర్ల పరుగులో నవీన్, అండర్-20 విభాగంలో 400 మీటర్ల పరుగులో అజయ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా ప్రతిభను వెలికితీస్తూ లక్ష్య అథ్లెటిక్స్ కోచింగ్ సెంటర్ ద్వారా విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నట్లు కోచ్ రాణా మల్లేష్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి అర్హత సాధించాలని ఆయన ఆకాంక్షించారు. క్రీడల్లో క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధించవచ్చని పేర్కొన్నారు. విద్యార్థుల కృషితో పాటు తల్లిదండ్రుల సహకారం కూడా ఈ విజయాలకు ప్రధాన కారణమని తెలిపారు. రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించి నాగర్‌కర్నూల్ జిల్లాకు మరింత పేరు తీసుకురావాలని క్రీడాభిమానులు, తల్లిదండ్రులు ఆకాంక్షిస్తున్నారు.



అంగన్వాడీ ఎంపికలో స్థానికతపై స్పష్టత ఇవ్వాలి

- స్థానిక మహిళలకు అన్యాయం జరగకుండా వాస్తవ నివాసాన్ని పరిశీలించాలి

- కోవిడ్ బ్యాచ్ మార్కులపై కూడా స్పష్టమైన మార్గదర్శకాలు అవసరం



భూపాలపల్లి, సెప్టెంబర్ 25 (ప్రజాకలం): -అంగన్వాడీ ఎంపికలో స్థానికతకు సంబంధించి స్పష్టమైన విధానం పాటించాలని అభ్యర్థులు కోరుతున్నా రు. అంగన్వాడీ కేంద్రం ఉన్న గ్రామం, వార్డు లేదా ప్రాంతంలో వాస్తవంగా స్థిరనివాసం ఉన్న మహిళలకు అవ కాశం కల్పించేలా ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.వివాహం అనంతరం భర్త నివసించే ప్రాంతానికి వెళ్లిన మహిళను పుట్టింటి గ్రామానికి స్థానికురాలిగా పరిగ ణించే విధానం ఏమిటి, ఉద్యోగం కోసం కొంతకాలంగా మాత్రమే ఓ గ్రామంలో నివసిస్తున్న అభ్యర్థి స్థానికతను ఎలా నిర్ణయిస్తారు అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.కేవలం ఆధార్ లేదా ఇతర పత్రాల్లో చిరునామా ఉండటంతోపాటు, వాస్తవంగా అక్కడే స్థిరనివాసం ఉ ందా అనే అంశాన్ని కూడా పరిశీలించాలని కోరుతున్నారు. స్థానికంగా ఎన్నో సంవత్సరాలుగా నివసిస్తున్న మహి ళలకు అన్యాయం జరగకుండా ప్రతి అభ్యర్థి స్థానికతను నిబంధనల ప్రకారం నిర్ధారించాలని పేర్కొంటున్నారు.అదేవిధంగా కోవిడ్ కాలంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు సాధారణ పరీక్షలకు భిన్నంగా మా ర్కుల మూల్యాంకనం జరిగిన నేపథ్యంలో, ఆ మార్కులను అంగన్వాడీ మెరిట్ ఎంపికలో ఎలా పరిగణిస్తు న్నారనే దానిపై కూడా స్పష్టత అవసరమని అభ్యర్థులు కోరుతున్నారు.వివిధ బ్యాచ్లకు భిన్నమైన మూల్యాంకన విధానాలు అమలైన విషయాన్ని పరిగణనలోకి తీసుకుని, అంద రికీ సమాన అవకాశాలు కల్పించే విధంగా మెరిట్ జాబితా రూపొందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.అంగన్వాడీ ఎంపికలో వివాహ స్థితిని కాకుండా నోటిఫికేషన్లో పేర్కొన్న స్థానిక నివాస అర్హతలను కచ్చి తంగా పరిశీలించాలని కోరుతున్నారు. ప్రతి అభ్యర్థి వాస్తవ స్థానిక నివాసం, ధ్రువీకరణ పత్రాలు, నోటిఫికేష న్లోని నిబంధనలను పరిశీలించిన అనంతరం పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలని విజ్ఞప్తి చేస్తు న్నారు.

కోనారెడ్డి చెరువుకు జలకళ

- కాలువలో పూడిక తొలగింపు.. రెండు పంటలకు సాగునీరు లక్ష్యం
- మున్సిపల్ చైర్మన్ సారంగపాణి, కౌన్సిలర్ తిరుపెల్లి వాణి కుమారస్వామి



సెప్టెంబర్ 25 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ /వర్ధన్నపేట) వర్ధన్నపేట పట్టణ పరిధిలోని కోనారెడ్డి చెరువును నింపి, ఆయకట్టు పరిధిలోని రైతులకు రెండు పంటలకు సరిపడా సాగునీరు అందించడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి తెలిపారు. ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కె.ఆర్.నాగరాజు ఆదేశాల మేరకు కోనాచలం నుంచి కోనారెడ్డి చెరువు వరకు ఉన్న కట్ట కాలువలో పూడిక, మట్టిని జేసీబీ సహాయంతో తొలగించి శుభ్రం చేయించినట్లు వెల్లడించారు.ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆరు నెలల్లోనే రైతులకు ఇచ్చిన హామీ మేరకు గత రెండు నెలలుగా కోనాచలం నుంచి కోనారెడ్డి చెరువు వరకు నీటి కాలువను పరిశీలిస్తూ, చెరువులోకి నీరు చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు సారంగపాణి తెలిపారు. గతేడాది కూడా బండౌతపురం సమీపంలోని కాలువ నుంచి కోనారెడ్డి చెరువు వరకు ఉన్న కట్ట కాలువను జేసీబీతో శుభ్రం చేసి నీటిని మళ్లించినట్లు పేర్కొన్నారు.ప్రస్తుతం కాలువ మట్టితో, పూడికతో నిండిపోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడిందని, దీంతో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పూడిక తొలగింపు చేపట్టినట్లు తెలిపారు. కాలువ శుభ్రం చేయడంతో నీటి ప్రవాహానికి మార్గం సుగమమైందని, చెరువులోకి నీటిని మళ్లించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు.కోనారెడ్డి చెరువు పూర్తిస్థాయిలో నిండితే ఆయకట్టు రైతులకు సాగునీటి సౌకర్యం మెరుగుపడి రెండు పంటలు సాగు చేసుకునే అవకాశం కలుగుతుందని సారంగపాణి తెలిపారు. రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని చెరువును నింపేందుకు అవసరమైన చర్యలను నిరంతరం కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ తిరుపెల్లి వాణి-కుమారస్వామి, కాంగ్రెస్ నాయకులు చిరురాల కుమారస్వామి, దిటిపెల్లి వెంకటనర్సు, భూక్యా బాబులాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నమ్మకమే బలం.. యూనియన్ బ్యాంక్‌కు 46 ఏళ్లు

- మల్దకల్ శాఖలో ఘనంగా 46వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు



గద్వాల ప్రతినిధి । సెప్టెంబర్ 25 । ప్రజా కలం

జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలో 46వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 1980 సెప్టెంబర్ 25న ప్రారంభమైన మల్దకల్ శాఖ 46 సంవత్సరాలుగా ప్రజలకు బ్యాంకింగ్ సేవలు అందిస్తూ ముందుకు సాగుతోంది.
ఈ సందర్భంగా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎ. మురళీకృష్ణ పాల్గొని శాఖ సిబ్బంది, ఖాతాదారులకు వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. శాఖ అందిస్తున్న సేవలను, వ్యాపార వృద్ధిని అభినందించారు. ప్రస్తుతం శాఖలో రూ.38 కోట్లకు పైగా డిపాజిట్లు, రూ.116 కోట్లకు పైగా రుణాలు ఉన్నాయని తెలిపారు. ఖాతాదారుల విశ్వాసాన్ని మరింత పెంపొందిస్తూ నాణ్యమైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.
కార్యక్రమానికి స్థానిక ఆలయ చైర్మన్ ప్రహ్లాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా స్వయం సహాయక సంఘాలకు శాఖ ఆధ్వర్యంలో రూ.2 కోట్ల రుణాలను పంపిణీ చేశారు. మహిళల ఆర్థిక సాధికారతకు బ్యాంకు అందిస్తున్న సహకారాన్ని ఈ సందర్భంగా అభినందించారు.
ఈ కార్యక్రమంలో శాఖ మేనేజర్ నరేష్ యాదవ్, ఎల్‌డీఎం శ్రీనివాస్, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు. మల్దకల్ ప్రాంత ప్రజలకు భవిష్యత్తులోనూ మరింత మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందిస్తూ, స్థానిక అభివృద్ధికి తోడ్పడేందుకు కృషి చేస్తామని శాఖ సిబ్బంది తెలిపారు.

దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ



(వరంగల్/ పర్వతగిరి) సెప్టెంబర్ 25, ప్రజాకలం ప్రతినిధి: పర్వతగిరి మండలంలోని దివ్యాంగులలో అర్హులైన 1నుంచి 18 సంవత్సరాల లోపు వారికి అవసరమైన సహాయ ఉపకరణాల అందించేందుకు గుర్తింపు నిర్ధారణ శిబిరాన్ని వరంగల్ శంభునిపేట లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 26 శనివారం రోజున ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి ఏ. బిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరానికి హాజరు కాబోయే విద్యార్థులు సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, యూడిఐడి కార్డు జిరాక్సులు, ఒక ఫోటో వెంట తీసుకొని రావలెనని తెలిపారు. పూర్తి వివరాలకు ఐఆర్పి అశోక్ 9949303163 నంబర్ సంప్రదించవలసిందిగా తెలిపారు.

రీ సర్వేను వేగవంతం చేయాలి

- తహసీల్దార్లు, సర్వేయర్లు, లైసెన్స్‌డ్ సర్వేయర్లకు అవగాహన సదస్సు
- సదస్సులో హన్మకొండ అదనపు కలెక్టర్ ఎ. రవి దిశా నిర్దేశం

హనుమకొండ, సెప్టెంబర్ 25:- (ప్రజా కలం ప్రతినిధి)

జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీసర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ అదనపు కలెక్టర్ ఎన్. రవి అధికారులను ఆదేశించారు. రీసర్వే ప్రక్రియపై జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు, సర్వేయర్లు, లైసెన్స్‌డ్ సర్వేయర్లకు అవగాహన కల్పించేందుకు నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. హనుమకొండ ఆర్డీఓ ఎన్. వెంకటేష్‌తో కలిసి అదనపు కలెక్టర్ రీసర్వే పురోగతిని సమీక్షించారు.
క్షేత్రస్థాయిలో సర్వే సందర్భంగా ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై చర్చించారు. సీనియర్ సర్వేయర్ జీవన్ కుమార్ సర్వేలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలు, వాటి పరిష్కార విధానాలను సిబ్బందికి వివరించారు. రీసర్వేలో అనుసరించాల్సిన విధానాలు, పూరించాల్సిన ఫారాలు, రైతులకు అందజేయాల్సిన నోటీసులు, ఇతర ప్రక్రియలపై సర్వేయర్లు, లైసెన్స్‌డ్ సర్వేయర్లకు అవగాహన కల్పించారు. తహసీల్దార్లు కూడా రీసర్వే ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండేలా సదస్సులో వారికి సూచనలు చేశారు.

ఐదు గ్రామాల్లో తుది దశకు రీసర్వే

హనుమకొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో రీసర్వే ప్రక్రియ పూర్తికాగా, ఆయా గ్రామాల్లో తుది దశ పనులు



కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. భీమదేవరపల్లి మండలం భీమదేవరపల్లి, కాజీపేట మండలం అమ్మవారిపేట, ధర్మసాగర్ మండలం జానకిపురం, ఎల్కతుర్తి మండలం వల్భాపూర్, కమలాపూర్ మండలం మాదన్నపేట గ్రామాల్లో రీసర్వే తుది దశకు చేరుకుంది. మిగిలిన మండలాల్లోనూ రీసర్వే పనులను వేగవంతం చేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని అదనపు కలెక్టర్ సూచించారు. తహసీల్దార్లు, సర్వేయర్లు, లైసెన్స్‌డ్ సర్వేయర్లు పరస్పర సమన్వయంతో పనిచేసి రీసర్వే ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

రోడ్డు భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రమాద ప్రాంతాల్లో తక్షణ, దీర్ఘకాలిక చర్యలు చేపట్టాలి : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
జాయింట్ ఇన్‌స్పెక్షన్ సిఫార్సుల అమలుకు అధికారుల బాధ్యతలు నిర్దేశించాలి
శ్రీశ్రీ సర్కిల్ వద్ద ప్రమాదాలు నియంత్రించేందుకు కార్యాచరణ ప్రణాళిక



ఖమ్మం సెప్టెంబర్ 25(ప్రజా కలం న్యూస్)

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని, రోడ్డు భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో రోడ్డు భద్రతపై సమీక్షించారు. జిల్లాలోని వివిధ ప్రమాదకర, సున్నితమైన రహదారి ప్రాంతాల పరిస్థితిని జిల్లా కలెక్టర్ సమీక్షించి, ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలపై సంబంధిత అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు.జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ రోడ్డు భద్రతకు అవసరమైన సామగ్రి, పరికరాలను కొనుగోలు చేయాలని సూచించారు. ఇతర జిల్లాల్లో చేపట్టిన పనులకు సంబంధించిన వర్క్ ఆర్డర్లను పరిశీలించి, అక్కడ వినియోగించిన సామగ్రి స్పెసిఫికేషన్లు, ప్రమాణాలను క్రాస్ చెక్ చేసి, అదే తరహా స్పెసిఫికేషన్లతో అవసరమైన సామగ్రికి ఆర్డర్లు ఇవ్వాలని ఆదేశించారు. గత సమావేశంలో సూచించిన మేరకు ప్రమాదాలకు అవకాశం ఉన్న ప్రాంతాలను సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలించి, తక్షణ, దీర్ఘకాలిక చర్యలను ప్రతిపాదించాలని కలెక్టర్ సూచించారు. జాయింట్ ఇన్‌స్పెక్షన్ అనంతరం చేపట్టాల్సిన చర్యలపై సమగ్ర కన్సాలిడేటెడ్ నివేదికను సిద్ధం చేయాలని అన్నారు. జాయింట్ ఇన్‌స్పెక్షన్‌లో చేసిన ప్రతి సిఫార్సుకు సంబంధిత అధికారుల బాధ్యతను నిర్దేశించి, ప్రతిపాదించిన చర్యలను రహదారులపై పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.లిరోడ్డు భద్రతకు సంబంధించి ఇంజినీరింగ్ చర్యల్లో భాగంగా రంబుల్ స్ట్రిప్స్, పాదచారుల క్రాసింగ్ మార్కింగ్, బ్లింకర్లు, సెంటర్, ఎడ్జ్ లైన్లు, రోడ్ స్టడ్స్, అవసరమైన హెచ్చరిక సూచిక బోర్డుల ఏర్పాటును పూర్తి చేయాలని అన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను నిరంతరం కొనసాగించాలని, ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు.
ప్రతి రోడ్డు ప్రాంతంలో అవసరమైన భద్రతా చర్యలు చేపట్టే ముందు, చర్యలు పూర్తయిన తర్వాత ఫొటోలతో కూడిన నివేదికను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జాతీయ రహదారుల పరిధిలో అవసరమైన అన్ని రోడ్డు భద్రతా చర్యలను సంబంధిత ఎన్‌హెచ్ అధికారులు చేపట్టేలా సమన్వయం చేయాలని అన్నారు.ఎన్‌టీఆర్ సర్కిల్ నుంచి శ్రీశ్రీ సర్కిల్ వరకు అవసరమైన రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేసినందున రోడ్డు మార్కింగ్ పనులను కూడా పూర్తిచేయాలని కలెక్టర్ సూచించారు.శ్రీశ్రీ సర్కిల్ వద్ద క్రిస్‌క్రాస్‌గా జరుగుతున్న వాహనాల రాకపోకలను నియంత్రించేందుకు అవసరమైన చర్యలు చేపట్టి, స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. రోడ్డు భద్రతకు సంబంధించిన పనులను అత్యంత సీరియస్‌గా చేపట్టాలని, ఒకరిపై మరొకరు నెపం మోపడం వల్ల సమస్య పరిష్కారం కాదని కలెక్టర్ స్పష్టం చేశారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, జాయింట్ ఇన్‌స్పెక్షన్‌లో గుర్తించిన సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపించాలని అన్నారు. రహదారులపై చేపట్టాల్సిన ప్రతి మార్పు, మెరుగుదల, భద్రతా చర్యలను ముందుగానే కాగితంపై స్పష్టంగా నమోదు చేయాలని అన్నారు. ఏ ప్రాంతంలో ఏ పని ఎందుకు చేపట్టాలి, దానికి అవసరమైన చర్యలు ఏమిటి అనే వివరాలతో ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి జాయింట్ ఇన్‌స్పెక్షన్‌కు సంబంధించిన రహదారి వివరాలను, సమస్య ఉన్న ప్రాంతాల ఫొటోలను, గుర్తించిన లోపాలను, అవసరమైన సిఫార్సులను పొందుపరిచి సమగ్ర నివేదికను సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. కేవలం సమస్యలను గుర్తించడం కాకుండా, వాటికి పరిష్కార మార్గాలను కూడా నివేదికలో స్పష్టంగా సూచించాలని అన్నారు.ఖమ్మం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీశ్రీ సర్కిల్ వద్ద అవసరమైన రెండు సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. జాతీయ రహదారులపై గుర్తించిన బ్లాక్ స్పాట్లకు సంబంధించిన డిజైన్లను తుది రూపంలో సిద్ధం చేసి, పనులను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ఎస్‌ఆర్ గార్డెన్స్ పరిసరాల్లో రహదారి భద్రతకు, వాహనాల రాకపోకలకు ఆటంకంగా ఉన్న నిర్మాణాలను గుర్తించి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని అన్నారు.
రోడ్డు భద్రత కోసం కొనుగోలు చేసే అన్ని రకాల సామగ్రి నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. తక్కువ నాణ్యత కలిగిన సామగ్రి వల్ల రోడ్డు భద్రతా చర్యల ఉద్దేశ్యం నెరవేరదని, కొనుగోలుకు ముందే నాణ్యత, స్పెసిఫికేషన్లను పూర్తిస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యలు, ఇతర భద్రతా సమస్యలను పోలీసు శాఖ క్షేత్ర స్థాయిలో గుర్తించి, వాటికి పరిష్కార మార్గాలను ప్రతిపాదించాలని కలెక్టర్ సూచించారు. సమస్యలను గుర్తించడం మాత్రమే కాకుండా, వాటి పరిష్కారానికి అవసరమైన సూచనలు, కార్యాచరణ ప్రణాళికను సంబంధిత శాఖలకు అందించాలని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో రోడ్డు పక్కన వాహనాల పార్కింగ్ అస్తవ్యస్తంగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, అక్కడ పార్కింగ్‌ను క్రమబద్ధీకరించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. బెంగుళూరు, ఇతర నగరాల్లో అమలు చేస్తున్న పార్కింగ్ విధానాలను పరిశీలించి, ఖమ్మం నగరంలోని ముఖ్యమైన ప్రాంతాల్లో కూడా నిర్దిష్ట పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేసే విధానాన్ని అమలు చేయాలని సూచించారు. నిర్ణయించిన పార్కింగ్ ప్రాంతాలకు వెలుపల వాహనాలను నిలిపితే వాటిని తొలగించే విధంగా అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. ఖమ్మం నగరంలోని షాపింగ్ మాల్స్, పెద్ద ఆసుపత్రులు, తదితర వాణిజ్య, ప్రజా వినియోగ సంస్థల్లో తగినంత పార్కింగ్ సదుపాయం ఉండేలా చూడాలని కలెక్టర్ సూచించారు. రోడ్డుపై వాహనాలు నిలిపే పరిస్థితి ఏర్పడకుండా ఆయా సంస్థల యాజమాన్యాలతో సమన్వయం చేసి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఖమ్మం నగరంలో రోడ్‌సైడ్ పార్కింగ్ వల్ల అధిక సమస్యలు ఎదురవుతున్న ప్రాంతాలను గుర్తించి, అక్కడ సమస్య నివారణకు తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యమైన రహదారుల పక్కన రోడ్‌సైడ్ పార్కింగ్ లేకుండా చూడాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా వాహనాలు నిలపకుండా అవసరమైన నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సమావేశంలో అడిషనల్ డిసిపి రామానుజమ్, ఆర్ అండ్ బి ఎస్ ఈ యుగంధర్ రావు, జిల్లా వైద్య, ఆరోగ్యాధికారి డా. రామారావు, జిల్లా రవాణాధికారి జగదీష్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య, డిఈఓ సదానందం, ఎన్హెచ్ఏఐ పిడి దివ్య, మునిసిపల్ కమీషనర్ లు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



నూతన పర్వతగిరి పిఎసిఎస్ చైర్మన్ లను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన ఎంపీడీవో

(వరంగల్/పర్వతగిరి)సెప్టెంబర్ 25, ప్రజాకలం ప్రతినిధి:

పర్వతగిరి కేంద్రంలో శుక్రవారం ఇటీవల నూతనంగా నియామకమైన పర్వతగిరి పిఎసిఎస్ చైర్మన్ పిన్నింటి అనిల్ రావు, చౌటపల్లి పిఎసిఎస్ చైర్మన్ అత్తి కుమారస్వామి లను ఎంపీడీఓ మాలోత్ శంకర్ నాయక్, సూపర్డెంట్ విష్ణు మూర్తి లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపినారు.

వైభవంగా 'వరసిద్ధి కర్ర వినాయకుని' శోభాయాత్ర

భారీగా తరలివచ్చిన భక్తులు - భక్తిపారవశ్యంలో భోసి గ్రామం
వేలం పాటలో రూ. 71 వేలకు గణేషుని లడ్డూ దక్కించుకున్న భక్తుడు



తానూర్, సెప్టెంబర్ 25 (ప్రజా కలం): నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని భోసి గ్రామంలో 'వరసిద్ధి కర్ర వినాయకుని' శోభాయాత్ర శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది,వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు.

పోటీపోటీగా సాగిన వేలం పాటలు...

ఉత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ నిర్వహించిన స్వామివారి లడ్డూ మరియు వివిధ పూజా వస్తువుల వేలం పాట భక్తులను విశేషంగా ఆకట్టుకుంది,భక్తులు ఎంతగానో పోటీపడి వేలం పాటల్లో పాల్గొని స్వామివారి ప్రసాదాలను దక్కించుకున్నారు,అదే గ్రామానికి చెందిన పసుల భోజన్న రూ,71,000 కు లడ్డూను దక్కించుకున్నారు,
పలక-బలపం: మదస్తు ఎంగులు రూ, 12,000 కు సొంతం చేసుకున్నారు,
పెద్ద కండువా కనకాపూర్ లక్ష్మణ్ రూ, 5,500 కు పాడుకున్నారు,
కాపీ-పెన్ను జక్క హన్మండ్లు రూ,5,100 కు దక్కించుకున్నారు,
చిన్న కండువా సబ్బన్ రఘు రూ. 2,800 కు వేలంలో గెలుచుకున్నారు,
ఈ సందర్భంగా వేలంలో ప్రసాదాలు దక్కించుకున్న భక్తులను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించి, స్వామివారి జ్ఞాపిక (ఫొటో)ను అందజేశారు.

కోలాహలంగా శోభాయాత్ర....

ప్రతి సంవత్సరం వేలం పాట అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మంగళ వాయిద్యాల నడుమ శోభాయాత్రను ప్రారంభించారు,గ్రామంలోని ప్రధాన వీధుల గుండా సాగిన ఈ ఊరేగింపులో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిపారవశ్యంతో నాట్యాలు చేశారు, సంప్రదాయం ప్రకారం కర్ర వినాయకుడిపై నీళ్లు చల్లి ఆలయంలో సురక్షితంగా భద్రపరిచారు, అలాగే మండపంలో ప్రతిష్టించిన మారో వినాయక విగ్రహాన్ని చెరువులో నిమజ్జనం చేశారు,దీంతో భోసి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది,ఈ కార్యక్రమంలో కర్ర వినాయక ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, గౌరవ అధ్యక్షుడు ,గ్రామ సర్పంచ్, గణేష్ మండప నిర్వాహకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు మరియు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తుఫాను ప్రభావంతో కూలిన ఇంటి గోడ.. తప్పిన పెను ప్రమాదం

చింతపల్లి, /అరకులోయ : బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను ప్రభావంతో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఓ ఇంటి గోడ కూలిపోయింది. ఈ ఘటనలో పెను ప్రమాదం తప్పింది. చౌడుపల్లి పంచాయతీ పరిధిలోని గేర్రిలగడ్డ గ్రామానికి చెందిన బురిడీ నాగేష్.ఇంటి గోడ గురువారం తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో కూలిపోయింది. కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో గోడ ఒక్కసారిగా కూలి బయటివైపు పడటంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. గోడ ఇంటి లోపలివైపు కూలి ఉంటే ప్రాణనష్టం జరిగే అవకాశం ఉండేదని కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఉదయాన్నే బాలరాజు ఇంటికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. మరియు చౌడు పల్లి పంచాయతీ సత్యవారం పాత వీధి గ్రామంలో గేమెలి వెంకటరావు ఇల్లు గోడ కూడా కూలిపోయింది ఈ ఇల్లు దెబ్బతినడంతో ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి కోరారు. ఈ సందర్భంగా పీసా కమిటీ సభ్యులు జి. అప్పలస్వామి, బురిడీ నాగేష్ కుటుంబాన్ని పరామర్శించి, ఇంటి నష్టాన్ని అధికారులు పరిశీలించి వెంటనే నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

సీహెచ్‌డబ్ల్యూగా పనిచేస్తున్న మహిళ అనారోగ్యంతో మృతి

చింతపల్లి,/అరకులోయ : గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సీహెచ్‌డబ్ల్యూగా పనిచేస్తున్న తగ్గి మంగకుమారి ఉదయం 10 గంటలకు మృతి చెందారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం లోతుగడ్డ పంచాయతీ పరిధిలోని బందబయలు గ్రామానికి చెందిన తగ్గి మంగకుమారి, లోతుగడ్డ పిహెచ్సి బందబయలు గ్రామంలో సీహెచ్‌డబ్ల్యూగా విధులు నిర్వహిస్తున్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె గురువారం తుదిశ్వాస విడిచారు. ఆమెకు భర్త సోమలింగం, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మంగకుమారి మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు విషాదంలో మునిగిపోయారు. ఈ ఘటనపై ఆదివాసీ గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, మంగకుమారి అంత్యక్రియలు బందబైలు గ్రామంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు సకాలంలో హాజరై అంత్యక్రియల్లో పాల్గొనాలని కుటుంబ సభ్యులు కోరారు.

ఎస్సై, కానిస్టేబుల్, పోలీస్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయాలి

చిట్వేలి:ఆంధ్రప్రదేశ్ పోలీస్‌శాఖలో ఖాళీగా ఉన్న 11,000 ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులతో పాటు ఇతర పోలీస్ పోస్టులకు తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేసి భర్తీ చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర నాయకులు దార్ల రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు రైల్వే కోడూరు డిప్యూటీ తహసిల్దార్ సుధీర్ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో వేలాదిమంది నిరుద్యోగ యువత ప్రభుత్వఉద్యోగాల కోసం ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నారని తెలిపారు. పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న 11,000 ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేసి నియామక ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న ఇతర పోస్టులను కూడా గుర్తించి, నోటిఫికేషన్లు విడుదల చేసి భర్తీ చేయాలని కోరారు. సంవత్సరాల తరబడి ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు వయోపరిమితి సమస్యలు ఎదురవుతున్నందున ప్రభుత్వం తక్షణమే స్పందించి తగిన న్యాయం చేయాలని అన్నారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన ఉద్యోగ హామీలను అమలు చేసి, పోలీస్ శాఖలో ఖాళీ పోస్టులను భర్తీ చేయడం ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని బూరవాసు డిమాండ్ చేశారు. 11,000 ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులతో పాటు ఇతర పోలీస్ పోస్టులకు నోటిఫికేషన్లు విడుదల చేసి భర్తీ చేసే వరకు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత పక్షాన ఉద్యమాలను కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

ప్రణయ్ హత్యకేసు నిందితుడు మృతి

సికింద్రాబాద్ : నల్లగొండ జిల్లా -మిర్యాలగూడ లో సంచలనం సృష్టించిన.. "ప్రణయ్" హత్యకేసులో ఏ4 గా శిక్ష అనుభవిస్తున్న అబ్దుల్ బారీ మృతి చెందాడు. చర్లపల్లి జైలులో వున్నబారీ గుండె నొప్పితో అస్వస్థతకు గురైయాడు. వెంటనే జైలు సిబ్బంది బారీని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బారీ మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రిలో మృతదేహం వుంచారు. నల్లగొండ ప్యారసభాగ్ కాలనీకి చెందిన అబ్దుల్ బారీ, గతంలో గుజరాత్ మంత్రి హరేన్ పాండే హత్య కేసులోనూ జైలు శిక్ష అనుభవించాడు. ప్రస్తుతం ఏ4 గా ప్రణయ్ హత్య కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్నాడు.

జన్మదిన వేడుకల పేరిట డబ్బు వృథా చేయొద్దు

మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

జంగపల్లి హైస్కూల్ విద్యార్థులకు సర్పంచ్ దంపతుల ప్లేట్ల పంపిణీ

కరీంనగర్ : జన్మదిన వేడుకల పేరుతో డబ్బును ఆర్భాటంగా ఖర్చు చేయకుండా సమాజానికి, విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలకు వెచ్చించాలని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. గన్నేరువరం మండలం జంగపల్లి గ్రామ సర్పంచ్ తాడూరి కరుణశ్రీ-రమణారెడ్డి దంపతుల కుమార్తె జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు , గ్లాసుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ కుమార్తె జన్మదినం సందర్భంగా సొంత ఖర్చులతో పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు అందించడం అభినందనీయమన్నారు. జన్మదిన వేడుకల పేరుతో తల్లిదండ్రులు ఆర్భాటాలకు వెళ్లి అధికంగా డబ్బు ఖర్చు చేస్తున్నారని, ఆ మొత్తాన్ని విద్యార్థులకు అవసరమైన వస్తువులు అందించేందుకు లేదా ఇతర సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగిస్తే మరింత సార్థకత ఉంటుందని అన్నారు. పిల్లలు కూడా తమ పుట్టినరోజు సందర్భంగా తోటి విద్యార్థులకు పుస్తకాలను కానుకగా అందించే అలవాటును పెంపొందించుకోవాలని సూచించారు. ఫోన్లకు దూరంగా.. చదువుపై దృష్టివిద్యార్థులు సెల్‌ఫోన్ల వినియోగాన్ని పూర్తిగా తగ్గించి చదువుపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే సూచించారు. విద్యార్థులపై టీవీలు, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఇతర సామాజిక మాధ్యమాల ప్రభావం అధికంగా ఉందన్నారు. వాటికి దూరంగా ఉంటూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు ఇచ్చే హోంవర్క్‌ను ఇంటికి వెళ్లిన తర్వాత పూర్తి చేయడంతో పాటు పుస్తక పఠనంపై మక్కువ పెంచుకోవాలన్నారు.

ఖమ్మం జిల్లాలో పోలీస్ వాహనాన్ని ఢీకొట్టిన లారీ

పోలీస్ వాహనం ధ్వంసం.. ఎస్ఐతో పాటు డ్రైవర్కు తీవ్ర గాయాలు

ఖమ్మం : హైదరాబాద్ ట్యాంక్ బండ్ నై వినాయక నిమజ్జనాల బందోబస్తులో వున్న, ఎస్సై వెంకన్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆ సంఘటన మరువక ముందే ఖమ్మం జిల్లాలో మరో ఎస్సై నిమజ్జనాల ఏర్పాట్లు చూసి వస్తున్న సమయం లో జరిగిన ఘటన లో తీవ్రంగా గాయపడ్డాడు. తిరుమలాయపాలెం పోలీస్ స్టేషన్ ఎస్ఐ కూచిపూడి జగదీష్కు రోడ్డు ప్రమాదం గాయాలయ్యాయి. వినాయక నిమజ్జన వేడుకల సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో విధులు నిర్వహించిన అనంతరం పిండిప్రోలు గ్రామం నుంచి తిరుమలాయపాలెం పోలీస్ స్టేషన్కు తిరిగి వస్తుండగా పోలీసు వాహనాన్ని లారీ ఢీకొంది. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తిరుమలాయపాలెం ఆసుపత్రికి తరలించారు.

ఐబొమ్మ రవికి ఊరట.. బ్యాంక్ ఖాతాల ఫ్రీజ్ ఎత్తివేయాలని కోర్టు ఉత్తర్వులు

హైదరాబాద్ : బ్యాంక్ అకౌంట్ల వినియోగం విషయంలో ఐబొమ్మ రవికి నాంపల్లి కోర్టు ఊరట కల్పించింది. పైరసీ కేసులో రవిని అరెస్ట్ చేసిన పోలీసులు బ్యాంక్ అకౌంట్లు సీజ్ చేయించారు. తన బ్యాంక్ అకౌంట్లు ఫ్రీజ్ చేసి ఉంచడం వల్ల కుటుంబ పోషణకు డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నానని ఫ్రీజ్ ఎత్తివేయించాలని అభ్యర్థిస్తూ కోర్టులోరవి పిటిషన్ వేసారు.

'యువ వికాసం' అందేనా..?

కరీంనగర్ : యువత స్వయం ఉపాధికి బాటలు వేసే యువవికాసం పథకం దిశగా మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. త్వరలో అర్హులను గుర్తించి ఆర్థికసాయం అందించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. నవంబరులో రాజీవ్ యువవికాసం కింద మొదటి విడతగా కొందరికి ప్రయోజనాన్ని అందించాలని నిర్ణయం తీసుకుంది. మళ్లీ దరఖాస్తులను జిల్లాలో అధికారులు పరిశీలించనున్నారు. ఆయా సంక్షేమ శాఖల పరిధిలో మండలాలు, పట్టణాల వారీగా వచ్చిన దరఖాస్తుల్లో ఉన్న ధ్రువపత్రాలను సరిచూస్తారు. అందులో అర్హులెవరు.? అనర్హులెవరనే కోణంలో క్షుణ్ణంగా గమనిస్తూ అర్హుల ఎంపిక దిశగా కసరత్తును మొదలు పెడతారు. మరోవైపు జిల్లాకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ యువత సర్కారు సాయాన్ని తొందరగా అందిస్తే ఏదో ఒక ఉపాధితో రాణించాలనే ఆశతో నిరీక్షిస్తున్నారు. పనిలో పనిగా కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఎప్పుడు అందిస్తారని అధికారుల్ని ఆరా తీస్తున్నారు.

57,763 మంది దరఖాస్తు... ఏడేళ్ల తర్వాత రాష్ట్రంలో యువతకు స్వయం ఉపాధి పథకాలకు సంబంధించి రుణాల్ని ఇవ్వాలని ప్రస్తుత సర్కారు నిర్ణయించింది. ఇందులో భాగంగానే ఈ ఏడాది మార్చి 25న పథకం విధివిధానాలను ఖరారు చేస్తూ ఉత్తర్వులను వెలువరించింది. నెలన్నర రోజులపాటు దరఖాస్తుకు గడువు ఇవ్వడంతో జిల్లాలోని నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. మొదట ఇనకమ్, రేషనకార్డు తప్పక ఉండాలని చెప్పడంతో కొందరే ఆసక్తి చూపించారు. తర్వాత ఈ నిబంధనను సడలించడంతో పెద్దమొత్తంలో యువత ఆసక్తిని చూపించారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 57,763 మంది ఆనలైనలో దరఖాస్తు చేసుకున్నారు. తర్వాత ఆ దరఖాస్తు ఫారాలను ఎంపీడీవో కార్యాలయాలు, మున్సిపాలిటీ ఆఫీసుల్లో అందజేశారు. అత్యధికంగా ఎస్సీ కార్పొరేషనకు 15వేలకుపైగా దరఖాస్తు చేసుకున్నారు. బీసీ కార్పొరేషన, ఈబీసీ, మైనారిటీ కార్పొరేషనలకు కలిపి 35వేలపైచిలుకు అందాయి. ఎస్టీ కార్పొరేషనకు 1200కుపైగా అర్జీలొచ్చాయి. కరీంనగర్ కార్పొరేషన పరిధిలోనే 15వేల మంది ఆసక్తి చూపించారు. అప్పట్లోనే అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలను జరపాలి. కాని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాకపోవడంతో వాటి జోలికి వెళ్లలేదు. తాజాగా సర్కారు వీటిని పరిశీలించాలని చెప్పడంతో అధికారులు ఈదిశగా కార్యాచరణను సిద్ధం చేస్తున్నారు. ఇటీవల వచ్చిన మార్గదర్శకాల ప్రకారం వీటిపై త్వరలోనే ఓ నిర్ణయానికి రానున్నారు. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా చూస్తేనే అర్హులకు లబ్ధి చేకూరుతుంది. పైరవీలకు ఆస్కారమిస్తే అర్హులకు అన్యాయం జరిగే వీలుంది. అందుకనే పారదర్శకంగా ప్రక్రియను కొనసాగించాలని అర్జీదారులు కోరుతున్నారు. గతంలో రుణాలు తీసుకున్న వారికి కాకుండా కొత్తవారికి అందించాలని విన్నవిస్తున్నారు.

యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో సమ్మె

కడప : యునైటెడ్ పురం ఆఫ్ బ్యాంకు యూనియన్ సెప్టెంబర్ నెల 28, 29 మరియు 30 తేదీలలో దేశవ్యాప్త బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో, వైఎస్ఆర్ కడప జిల్లాలో బ్యాంకింగ్ సేవలకు అంతరాయం కలగకుండా అన్ని బ్యాంకులు ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని వైఎస్ఆర్ కడప జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీ జి. జనార్ధన్ నేడొక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు కలిగే అసౌకర్యాన్ని తగ్గించేందుకు సెప్టెంబర్ 27, 2026 ఆదివారం నాడు పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు మరియు రీజినల్ రూరల్ బ్యాంకులు సాధారణ పనివేళల్లో పనిచేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా సెప్టెంబర్ 27న బ్యాంకు శాఖలు, కార్యాలయాలు, ఏటీఎం లింక్ శాఖలు మరియు కరెన్సీ చెస్టు పూర్తిస్థాయిలో పనిచేసేందుకు అనుమతి ఇచ్చింది. అందువల్ల, సెప్టెంబర్ 26 నాల్గవ శనివారం సెలవు కాగా, సెప్టెంబర్ 27 ఆదివారం బ్యాంకులు సాధారణంగా పనిచేస్తాయి. అనంతరం సెప్టెంబర్ 28, 29 మరియు 30 తేదీలలో ప్రతిపాదిత బ్యాంకు ఉద్యోగుల సమ్మె నేపథ్యంలో శాఖల ప్రత్యక్ష కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నందున, ప్రజలకు అవసరమైన ముఖ్యమైన బ్యాంకింగ్ సేవలు అందుబాటులో అమలు చేయాలని సూచించారు.

ప్రజలకు లీడ్ బ్యాంక్ మేనేజర్ సూచన

వైఎస్ఆర్ కడప జిల్లా ప్రజలు సెప్టెంబర్ 25, 2026లోగా తమకు అవసరమైన ముఖ్యమైన బ్యాంకింగ్ లావాదేవీలను పూర్తి చేసుకోవాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ జి. జనార్దన్ సూచించారు. సెప్టెంబర్ 27, 2026 ఆదివారం బ్యాంకులు సాధారణ పనివేళల్లో పనిచేసే అవకాశం కల్పించినప్పటికీ, చివరి నిమిషంలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముఖ్యమైన మరియు అత్యవసర బ్యాంకింగ్ లావాదేవీలను వీలైనంత వరకు సెప్టెంబర్ 25లోగా ముందుగానే పూర్తి చేసుకోవడం మంచిదని ఆయన తెలిపారు. ముఖ్యంగా నగదు ఉపసంహరణలు, డిపాజిట్లు, చెక్కుల లావాదేవీలు, రుణ వాయిదాల చెల్లింపులు, ప్రభుత్వ/ఇతర ముఖ్యమైన చెల్లింపులు అవసరమున్న వారు చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా ముందుగానే పూర్తి చేసుకోవాలని కోరారు. డిజిటల్ మరియు ప్రత్యామ్నాయ బ్యాంకింగ్ సేవలను వినియో గించుకోవచ్చని తెలిపారు. వైఎస్ఆర్ కడప జిల్లాలో బ్యాంకింగ్ సేవలకు సాధ్యమైనంత వరకు అంతరాయం కలగకుండా అన్ని బ్యాంకులు ముందస్తు చర్యలు చేపట్టాలని, ఖాతాదారులకు అవసరమైన సహకారం అందించాలని ఎల్డిఎం కోరారు.

పల్నాడు ఎస్పీగా జగదీష్ ఆదహళ్లి బాధ్యతల స్వీకరణ

నరసరావుపేట: పల్నాడు జిల్లా నూతన ఎస్పీగా జగదీష్ ఆదహళ్లి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎస్పీ సిబ్బందితో పరిచయ కార్యక్రమం నిర్వహించి జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితి, పోలీసు శాఖ పనితీరుపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడం, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించి ప్రజల నమ్మకాన్ని మరింత పెంపొందించాలని సూచించారు.

ఆర్టీసీ కార్యాలయంలో ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

తిరుపతి : ఆర్టీసీ కార్యాలయంలో చీఫ్ సెక్యూరిటీ ఇన్స్పెక్టర్ సి.ఎస్. వర్మ ఆత్మహత్య కలకలం రేపింది. డీపీటీవో కార్యాలయంలో ఫ్యాన్కు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు తోటి ఉద్యోగులు గుర్తించారు. ఉద్యోగి బదిలీ విషయంలో లంచం డిమాండ్ చేశారనే ఆరోపణలపై మూడు నెలల క్రితం వర్మను ఉన్నతాధికారులు సస్పెండ్ చేసారు. మృతుడు వచ్చే ఏడాది ఏప్రిల్ లో రిటైర్ కానున్నాడు. విధులు నిర్వహించిన తన చాంబర్ లో ఫ్యాన్ కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈస్ట్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపరెందుకు..?

అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందన కరువు

మురుగునీటితో కాలనీవాసుల అవస్థలు..

తక్షణమే పరిష్కరించాలని డిమాండ్

సి. బెళగల్ : మండల కేంద్రంలోని మాలగేరిలో డ్రైనేజీ సమస్య ఏళ్లుగా వేధిస్తున్నా అధికారులు శాశ్వత పరిష్కారం చూపడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీరు వెళ్లేందుకు సరైన కాలువ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరు రోడ్డుపైకి చేరి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. మురుగునీరు రోడ్లపై నిలిచిపోవడంతో కాలనీలో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోందని, నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కాలనీవాసులు పేర్కొన్నారు. ముఖ్యంగా వర్షాలు కురిసిన సమయంలో పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోందని తెలిపారు. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లామని,సమస్యను పరిశీలించి శాశ్వతపరిష్కారం చూపాలని కోరామని మాల మహానాడు జిల్లా నాయకుడు మునిస్వామి తెలిపారు. స్థానిక అధికారులను సంప్రదించడంతో పాటు జిల్లా అధికారులను సైతం కలిసి సమస్యను వివరించి వినతులు అందించినప్పటికీ ఇప్పటివరకు ఫలితం కనిపించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు విన్నవించినా సమస్య పరిష్కారం కాకపోవడానికి కారణమేంటి? సమస్య పరిష్కారానికి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? డ్రైనేజీ నిర్మాణానికి నిధులు కేటాయించారా? కేటాయించి ఉంటే పనులు ఎప్పుడు ప్రారంభిస్తారు? అనే ప్రశ్నలు కాలనీవాసుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మాలగేరిలో డ్రైనేజీ సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి, మురుగునీరు రోడ్లపైకి రాకుండా శాశ్వత డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. సమస్యను ఇకపై కూడా నిర్లక్ష్యం చేస్తే ప్రజల ఇబ్బందులు మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.

కాచిగూడ రైల్వేస్టేషన్ కొత్త సొబగులు



హైదరాబాద్ : భాగ్యనగర చారిత్రక శోభకు, నిజాం కాలం నాటి నిర్మాణ వైభవానికి ప్రతీకగా నిలిచే కాచిగూడ రైల్వే స్టేషన్ రూపురేఖలు మారనున్నాయి. చారిత్రక వారసత్వాన్ని కాపాడుతూనే ప్రయాణికులకు ఆధునిక సదుపాయాలు అందించేలా స్టేషన్ పునరాభివృద్ధికి దక్షిణ మధ్య రైల్వే ప్రాథమిక ప్రణాళిక సిద్ధం చేసింది. డ్రాఫ్ట్ కాన్సెప్ట్ ప్లాన్ ప్రకారం సుమారు రూ.474.29 కోట్ల అంచనా వ్యయంతో స్టేషన్‌ను ఆధునికీకరించేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. ప్రస్తుతం ఇది కేవలం డ్రాఫ్ట్ ప్లాన్ మాత్రమేనని, తుది ప్రణాళికలో కొన్ని మార్పులు, చేర్పులు ఉండే అవకాశం ఉందని రైల్వే అధికారులు తెలిపారు. స్టేషన్ పశ్చిమ వైపున ఉన్న పురాతన హెరిటేజ్ భవనాన్ని యథాతథంగా పరిరక్షించాలని ప్రతిపాదించారు. అదే సమయంలో తూర్పు వైపు, అంబర్‌పేట వైపున ఆధునిక టెర్మినల్ భవనాన్ని నిర్మించేలా డ్రాఫ్ట్ ప్లాన్‌ను రూపొందించారు. దీంతో పాత నిర్మాణానికి ఉన్న చారిత్రక ప్రాధాన్యాన్ని కాపాడుతూనే కొత్త అవసరాలకు అనుగుణంగా స్టేషన్‌ను విస్తరించే అవకాశం ఏర్పడుతుంది. ప్లాట్‌ఫాంల పైన 72 మీటర్ల వెడల్పు, 115 మీటర్ల పొడవుతో విశాలమైన ఎయిర్ కాన్‌కోర్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇందులో ఫుడ్ కోర్టులు, ఎగ్జిక్యూటివ్ లాంజ్‌లు, రిటైల్ అవుట్‌లెట్లు, ప్రదర్శన హాళ్లు, పిల్లల ఆట స్థలాలు వంటి సదుపాయాలు కల్పించేలా ప్రణాళిక రూపొందించారు. ప్రయాణికులు రైలు కోసం వేచి ఉండే సమయంలో మెరుగైన సౌకర్యాలు పొందేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయనున్నారు. స్టేషన్‌లో రద్దీని తగ్గించి ప్రయాణికుల రాకపోకలను సులభతరం చేయడంపై కూడా ప్రణాళికలో దృష్టి పెట్టారు. రైలు ఎక్కే ప్రయాణికులు, రైలు దిగే ప్రయాణికులు ఒకరికి ఒకరు అడ్డంకిగా మారకుండా విడివిడిగా మార్గాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అవసరమైన చోట్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించనున్నారు. కాచిగూడ రైల్వే స్టేషన్‌కు పక్కనే ఉన్న ఆర్టీసీ బస్ స్టేషన్‌తో మెరుగైన కనెక్టివిటీ కల్పించేందుకు స్కైవాక్ నిర్మాణాన్ని కూడా ప్రతిపాదించారు. పశ్చిమ, తూర్పు వైపుల వాహనాల పార్కింగ్ కోసం మల్టీ లెవల్ కార్ పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని ప్రణాళికలో పొందుపరిచారు. రైలు, బస్సు, వ్యక్తిగత వాహనాల రాకపోకలను సమన్వయం చేసేలా మల్టీమోడల్ కనెక్టివిటీని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కనిపిస్తోంది. కాచిగూడ రైల్వే స్టేషన్ హైదరాబాద్ రైల్వే చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది. 1916లో నిజాం కాలంలో నిర్మించిన ఈ స్టేషన్ భవనం ఇండో-ఇస్లామిక్ వాస్తుశిల్ప శైలికి, ఆ కాలం నాటి నిర్మాణ నైపుణ్యానికి ప్రతీకగా నిలుస్తోంది. నిజాం స్టేట్ రైల్వేస్ అభివృద్ధిలో భాగంగా ఏర్పాటైన ఈ స్టేషన్ అప్పట్లో హైదరాబాద్ నగరానికి కీలక రైల్వే కేంద్రంగా మారింది. కాలక్రమంలో నగరం విస్తరించడంతో కాచిగూడ స్టేషన్ ప్రాధాన్యం కూడా పెరిగింది. దశాబ్దాలుగా లక్షలాది మంది ప్రయాణికులకు సేవలందిస్తున్న ఈ చారిత్రక భవనం నేటికీ తన ప్రత్యేక రూపాన్ని నిలుపుకుంది. అందుకే పునరాభివృద్ధిలో పాత హెరిటేజ్ భవనాన్ని పరిరక్షిస్తూ.. దాని చుట్టూ ఆధునిక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం ప్రాధాన్యంగా మారింది.

ఫాంహౌస్‌లో 10 ఎకరాల అసైన్డ్ భూమి?



మెదక్ : మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫాంహౌస్ అంశం మరోసారి కేంద్ర బిందువుగా మారింది. ఈ భూములపై ప్రభుత్వం శరవేగంగా విచారణ చేపడుతోంది. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని సర్వే నంబర్ 325లో ఉన్న ప్రభుత్వ గైరాన్ భూములు, అసైన్డ్ భూముల అన్యాక్రాంతంపై రెవెన్యూ యంత్రాంగం ఉక్కుపాదం మోపుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ఎర్రవల్లి, సమీప శివారు వెంకాపురం గ్రామాల్లో గత మూడు రోజులుగా భూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సర్వే ద్వారా ప్రభుత్వ భూముల హద్దులను స్పష్టంగా గుర్తించారు. ప్రాథమిక విచారణలో కేసీఆర్ ఫాంహౌస్ పరిధిలో సుమారు 10 ఎకరాల అసైన్డ్ భూమి ఉన్నట్లు వెల్లడైంది. అంతేకాకుం డా, దళితులకు కేటాయించాల్సిన ఈ భూములను కొందరు అన్యక్రాంతం చేసుకుని, ఫాంహౌస్ అవసరాల కోసం నీటి వనరుల నిర్మాణానికి ఉపయోగించినట్లు తేలింది. భూ ఆక్రమణలపై సిద్ధిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశాల మేరకు అధికారులు చర్యలు వేగవంతం చేశారు. సర్వే నంబర్ 325 పరిధిలోని సుమారు 388.05 ఎకరాల గైరాన్ భూమి ఆక్రమణలను గుర్తించి, సంబంధిత భూయజమానులకు గత వారంలోనే 180 నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులపై స్పందించాల్సిన భూయజమానులు ఇవాల్టి నుంచి తమ పత్రాలతో అధికారుల ముందు హాజరవుతున్నారు. పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఇతర చట్టబద్ధమైన పత్రాలను సమర్పిస్తే పరిశీలిస్తామని అధికారులు స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ రాకతో రికార్డులు తారుమారయ్యా యని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. ఎర్రవల్లి, శివారు వెంకాపురం గ్రామాల మధ్య సర్వే నంబర్లు, భూ రికార్డుల్లో తీవ్రమైన లొసుగులు, ఓవర్‌లాపింగ్ ఉన్నాయని మర్కూక్ తహశీల్దార్ సరితకు స్థానికులు ఫిర్యాదు చేశారు. పాండురంగ రిజర్వాయర్‌కోసం భూములు కోల్పోయినరైతన్నలకు ప్రత్యా మ్నాయ భూములు ఇస్తామని గతంలో ఇచ్చిన హామీలు నెరవేరలేదని వాపోతున్నారు. ఈ వివాదంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం అత్యంత వ్యూహాత్మకంగాఅడుగులువేస్తోంది. వివాదాస్పద సర్వేనంబర్ 325లో నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూములనుఅనుభవిస్తున్న అనర్హులనుతొలగించడమే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించారు. నిజమైన దళిత రైతులకు దక్కాల్సిన భూములను వెనక్కి తీసుకుని, నిరుపేద దళిత కుటుంబాలకు పంపిణీ చేయాలని సర్కార్ భావిస్తోంది. మరోవైపు ఏ ఒక్క దళితుడి లేదాగిరిజనుడి భూమిని ప్రభుత్వంతీసుకోదని, సెక్షన్ 22ఏ పై మళ్లీ సర్వే నిర్వహించి బాధితులకు న్యాయం చేస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

హయత్‌నగర్‌లో కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ కలకలం: 730 కిలోలు సీజ్

హైదరాబాద్ : హయత్‌నగర్‌లోని అల్లం-వెల్లుల్లి పేస్ట్ తయారీ యూనిట్‌పై ఎల్బీనగర్, హయత్‌నగర్ పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. అపరిశుభ్ర పరిస్థితుల్లో తయారవుతున్నట్లు అనుమానిస్తున్న సుమారు 730 కిలోల కల్తీ పేస్ట్‌తో పాటు గుర్తుతెలియని ద్రావణం, ఫుడ్ కలర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ఒకరిని అదుపులోకి తీసుకుని హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పేస్ట్ తయారీలో స్వాధీనం చేసుకున్న ద్రావణం, ఫుడ్ కలర్ వినియోగంపై దర్యాప్తు కొనసాగుతోంది.

మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలి

హాస్టల్ ఆవరణ పరిశుభ్రంగా ఉండాలి - జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

గిరిజన సంక్షేమ శాఖ హాస్టల్ లో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

రాజన్న సిరిసిల్ల : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ హాస్టల్ లో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా అధికారులు, సిబ్బంది హాజరు రిజిస్టర్ తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకొని..వారి హాజరు రిజిస్టర్ పరిశీలించారు. మెనూ చార్ట్ పరిశీలించి.. కిచెన్ గోదాంలో బియ్యం, పప్పులు, కూరగాయలు ఇతర ఆహార పదార్థాలను నాణ్యతను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం ఈ రోజు ఆహార పదార్థాలు సిద్ధంగా ఉన్నాయో పరిశీలించారు. అనంతరం వసతి గదులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ .. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు.

ఎన్‌సీఆర్ ద్వారక వెంచర్ గణపతి లడ్డూ రూ.90,999కువేలంలో దక్కించుకున్న గంగా జీవన్ దంపతులు

గజ్వేల్: 25 సెప్టెంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి):


గజ్వేల్‌లోని ఎన్‌సీఆర్ ద్వారక వెంచర్‌లో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన గణపతి లడ్డూ వేలం ఉత్సాహభరితంగా సాగింది. కాలనీవాసులు, భక్తులు పోటాపోటీగా పాల్గొన్న ఈ వేలంలో బుడికె గంగా జీవన్



దంపతులు రూ. 90,999కు గణపతి లడ్డూను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా గంగా జీవన్ దంపతులు మాట్లాడుతూ విఘ్నేశ్వరుడి లడ్డూను వేలంలో దక్కించుకోవడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. స్వామివారి కృపతో అందరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ఆకాంక్షించారు. లడ్డూ వేలం ద్వారా వచ్చిన మొత్తాన్ని సేవా కార్యక్రమాలకు లేదా తదుపరి ఉత్సవాల నిర్వహణకు వినియోగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.సి. సంతోష్, వెంచర్ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడి చంద్రశేఖర్ రెడ్డిని కలిసి సన్మానించిన మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గున్న సంగమేశ్వర్ గుప్తా

ప్రజా కలం ప్రతినిధి మెదక్ సెప్టెంబర్ 25 సంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డిని , రేగోడు మండల కాంగ్రెస్ పార్టీ



మండల ఉపాధ్యక్షుడు సీనియర్ నాయకుడు గున్న సంగమేశ్వర్ గుప్తా మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి మిఠాయి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్ రెడ్డి నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. మండల, గ్రామస్థాయిలో కాంగ్రెస్ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో నియోజకవర్గం అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు శ్రీరామ్ గ్రూప్ చేయూత..!

పదవ తరగతి ప్రభుత్వ విద్యకు నగదు ప్రోత్సాహం.

సంగారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 25(ప్రజా కలం):

పేదరికాన్ని జయించి విద్యలో ప్రతిభ కనబరిచిన జిల్లా పరిషత్తు హై స్కూల్ మల్కాపూర్, కొండాపూర్ మండలం కు చెందిన విద్యార్థిని ఎ. వర్షిత కి శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ రూ. 5 లక్షల నగదు ప్రోత్సాహకాన్ని అందించింది. ఇటీవల నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి 10 వ తరగతి పరీక్షలో 594 మార్కులు సాధించి విశేష ప్రతిభ కనబరిచింది. ఆమెతో పాటు మరో విద్యార్థిని కె. మౌనిక కూడా 592 మార్కులు సాధించగా.. రూ. 3 లక్షల ప్రోత్సాహకాన్ని శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రకటించింది. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ తరఫున ఈ నగదు ప్రోత్సాహకాలను గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల గారు అందజేశారు. ఆర్థిక ఇబ్బందులను అధిగమించి కష్టపడి చదివి విజయం సాధించిన విద్యార్థులను శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో మరింత కృషి చేసి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ క్యాషి, శ్రీరామ్ ఫైనాన్స్ ఎండి ప్రవీణ్ ,శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఇండియా మార్కెటింగ్ మేనేజర్ వరుణ్ కిషోర్, శ్రీరామ్ లైఫ్ తెలంగాణ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాస రెడ్డి, హైదరాబాద్ జోనల్ మేనేజర్ నరేందర్ , సంగారెడ్డి డివిజన్ ఏజీఎం విజయ్ , బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్ , స్థానిక మల్కాపూర్ పాఠశాల హెడ్మాస్టర్ యాదగిరి , ఉపసర్పంచ్ ప్రవీణ్ పాల్గొన్నారు.



బాయ్.. బాయ్.. బాలాపూర్ గణేశా

- కన్నుల ముందే కదిలిన బాలాపూర్ గణనాథుడు

- లక్షలాది భక్తుల జయజయధ్వానాల మధ్య ఘనంగా బాలాపూర్ గణేష్ నిమజ్జన శోభాయాత్ర

-శోభాయాత్ర బాలాపూర్ లడ్డూకి రికార్డు స్థాయిలో వేలం పాట - 39 లక్షలకు దక్కించుకున్న సామ ప్రణీత్‌రెడ్డి







మహేశ్వరం,బాలాపూర్, సెప్టెంబర్ 24 (ప్రజా కలం):

తొమ్మిది రోజులుగా భక్తుల పూజలందుకున్న బాలాపూర్ గణేషుడు చివరకు గంగమ్మ ఒడికి చేరాడు. "బాలాపూర్ గణేష్ కీ జై.. గణపతి బప్పా మోరియా" అంటూ లక్షలాది భక్తుల నినాదాల మధ్య బాలాపూర్ గణనాథుడి నిమజ్జన శోభాయాత్ర అంగరంగ వైభవంగా సాగింది.

ఉదయం నుంచే భక్తుల రద్దీ:

ఉదయం నుంచే బాలాపూర్ గణేష్ మండపం వద్ద భక్తుల రద్దీ నెలకొంది. బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గణనాథునికి ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు. అనంతరం బాలాపూర్ లడ్డూ వేలం పాట నిర్వహించారు. లడ్డు వేలం పాట రికార్డు ధర పలికింది 39 లక్షలకు దక్కించుకున్న సామ ప్రణీత్‌రెడ్డి

రికార్డు ధర పలికిన బాలాపూర్ లడ్డూ:

ఏటా అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే బాలాపూర్ లడ్డూ ఈసారి కూడా రికార్డు ధర పలికింది. భక్తుల మధ్య తీవ్ర పోటీ నెలకొనగా, లడ్డూను 39 లక్షలకు దక్కించుకున్న సామ ప్రణీత్‌రెడ్డి భారీ ధరకు సొంతం చేసుకున్నారు. లడ్డూను దక్కించుకోవడం అదృష్టంగా భావించే భక్తులు పెద్ద ఎత్తున వేలంలో పాల్గొన్నారు.

ఊరేగింపుగా హుస్సేన్ సాగర్ కు:

లడ్డూ వేలం అనంతరం బాలాపూర్ గణేషుడిని భారీ క్రేన్ సహాయంతో ట్రాక్టర్ పైకి ఎక్కించి శోభాయాత్ర ప్రారంభించారు. బాలాపూర్ నుండి మొదలైన ఈ శోభాయాత్ర చండానగర్, కర్మన్ ఘాట్, చంపాపేట, సైదాబాద్, మూసారంబాగ్, ఖైరతాబాద్ మీదుగా హుస్సేన్ సాగర్ వరకు సాగింది.

దారి పొడవునా భక్తులు గణనాథునిపై పూలవర్షం కురిపిస్తూ, డీజేలు, డప్పు వాయిద్యాలు, కోలాటాలతో ఘనంగా వీడ్కోలు పలికారు.

కట్టుదిట్టమైన భద్రత:

బాలాపూర్ గణేష్ శోభాయాత్ర దృష్ట్యా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ ఆంక్షలు విధించి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారు.

హుస్సేన్ సాగర్ లో ఘనంగా నిమజ్జనం:

చివరకు సాయంత్రం హుస్సేన్ సాగర్ వద్దకు చేరుకున్న బాలాపూర్ గణేషుడిని అధికారులు, ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ క్రేన్ సహాయంతో గంగమ్మ ఒడిలోకి చేర్చారు. దీంతో తొమ్మిది రోజుల బాలాపూర్ గణేష్ ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. భక్తులందరూ "వచ్చే ఏడాది మళ్లీ రావయ్యా బాలాపూర్ గణేషా" అంటూ కన్నీటి వీడ్కోలు పలికారు.

నాణ్యమైన విద్య కోసం నిరంతరం పోరాటం చేయాలి

విద్యా కమిషన్ మాజీ చైర్మన్ ఆకునూరి మురళి



గజ్వేల్: 25 సెప్టెంబర్ (ప్రజా కలం ప్రతినిధి):

తెలంగాణ రాష్ట్రంలో నాణ్యమైన విద్య అందించేందుకు సమిష్టిగా నిరంతరం పోరాటం సాగించాలని తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ మాజీ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి పిలుపునిచ్చారు .ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల ఫీజుల నియంత్రణకు చట్టం తీసుకురావాలని, రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 18 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ పీపుల్స్ ఫ్రంట్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న విద్యా బస్సు యాత్ర శుక్రవారం గజ్వేల్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా టీపీఎఫ్ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆకునూరి మురళి మాట్లాడుతూ ప్రస్తుతం తెలంగాణలో విద్యా వ్యవస్థ ఐసీయూలో ఉన్న పరిస్థితి నెలకొందన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలను చదివించాలా,తగిన వసరులు, సౌకర్యాలు లేని ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలా అనే అయోమయంలో ప్రతి సంవత్సరం లక్షలాది కుటుంబాలు పడుతున్నాయని అన్నారు. అనియంత్రిత ప్రైవేట్ పాఠశాల ఫీజుల పెంపు, ప్రభుత్వ విద్యా వ్యవస్థలో మౌలిక సదుపాయాల కొరత, క్షీణత ఒకే విద్యా సంక్షోభానికి రెండు పార్శ్వాలని పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రతి మండలంలో నాలుగు ఫౌండేషన్ పాఠశాలలు, మూడు తెలంగాణ మోడల్ పాఠశాలలు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతిపాదించిన 52 అంశాల మేరకు మౌలిక సదుపాయాలు, టీచింగ్--లెర్నింగ్ వసరులు కల్పించి పేదలకు నాణ్యమైన విద్యను హక్కుగా అందించాలన్నారు. రాష్ట్రంలోని 600కు పైగా మండలాల్లో తెలంగాణ మోడల్ పాఠశాలల నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. ప్రభుత్వ విద్యను కాపాడుకోవడం ప్రజా ఉద్యమం ద్వారానే సాధ్యమవుతుందని అన్నారు.రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎం.వి. రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం తెలంగాణలో సుమారు 37 శాతం మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో,63 శాతం మంది ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్నారని తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరంలో మొదటి తరగతిలో చేరిన విద్యార్థుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన వారు 26 శాతం కాగా,ప్రైవేట్ పాఠశాలల్లో 74 శాతం ఉన్నారని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో తగిన మౌలిక సదుపాయాలు, నిర్వహణ,నాణ్యమైన విద్య అందుబాటులో లేకపోవడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు కూడా ప్రైవేట్ పాఠశాలలను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు.ఫీజుల విషయంలో తల్లిదండ్రులకు సమర్థవంతమైన రక్షణ, ఫిర్యాదు పరిష్కార వ్యవస్థ అవసరమన్నారు.జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీకి చెందిన సామాజిక కార్యకర్త సృజన యాదవ్ మాట్లాడుతూ చిన్ననాటి నుంచే పిల్లలకు రాజ్యాంగ విలువలను బోధించాలని,ఆధిపత్య భావజాలాలను అరికట్టి మహిళలను గౌరవించే విలువలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు.దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి వి.శంకర్ మాట్లాడుతూ ఆకునూరి మురళి నేతృత్వంలోని తెలంగాణ విద్యా కమిషన్ 2025 జనవరిలో సమర్పించిన నివేదికలో ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణ, పర్యవేక్షణ కోసం చట్టబద్ధమైన కమిషన్ ఏర్పాటు చేయాలని సిఫారసు చేసిందన్నారు.ఆ నివేదికను అసెంబ్లీలో చర్చించి ఆమోదించి అమలు చేయాలని డిమాండ్ చేశారు.సమర్థవంతమైన ఫీజు నియంత్రణ చట్టం లేకపోవడంతో తల్లిదండ్రులపై ఆర్థిక భారం పెరుగుతోందన్నారు.టీపీఎఫ్ కోర్ కమిటీ సభ్యుడు కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 2,582 ఒకే గది పాఠశాలలు,5,697 రెండు గదుల పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 5,001 పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయుడు బోధిస్తున్నారని వివరించారు.సమావేశంలో టీపీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఏ.రామచంద్రం, నాయకులు బి.రాజులు,నుంచు నరేందర్, జె.శ్రీనివాస్,నాగరాజ్, విద్యాసాగర్, పి.ఎల్లయ్య,నీపీఐ నాయకులు రాజేశం,దయాసందరెడ్డి, స్వర్గం రాములు,శ్రీనివాస్,దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి దాసరికొండ స్వామి,రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుబాయ్ సంజీవ్,ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు పొన్నాల కుమార్, తిమ్మాపూర్ సర్పంచ్ రాజు,జర్నలిస్టులు చిన్ని కృష్ణ,పుట్టరాజు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రక్షణ సేనలో పలు సంస్థాగత నియామకాలు

కొట్టాల యాదగిరి ఆధ్వర్యంలో నియామక పత్రాల అందజేత



గజ్వేల్: సెప్టెంబర్ 25 (ప్రజా కలం ప్రతినిధి):


తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు గజ్వేల్ నియోజకవర్గంలో పార్టీ సంస్థాగత బలోపేతంలో భాగంగా పలు నియామకాలు చేపట్టినట్లు పార్టీ నాయకులు తెలిపారు.గజ్వేల్ నియోజకవర్గ న్యాయ రక్షణ విభాగం అధ్యక్షుడిగా పి. నరేష్ చారి, మీడియా విభాగం అధ్యక్షుడిగా ఏ.ప్రవీణ్,గజ్వేల్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా లింగని రాజును నియమిస్తూ నియామక పత్రాలు అందజేశారు.

గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొట్టాల యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నూతనంగా నియమితులైన బాధ్యులకు పార్టీ సంస్థాగత నిర్మాణం, కార్యకర్తల సమన్వయం,పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం తదితర అంశాలపై సూచనలు చేశారు.పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సందర్భంగా నూతన బాధ్యులు పి.నరేష్ చారి, ఏ.ప్రవీణ్,లింగని రాజు మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, నియోజకవర్గ ఇన్‌చార్జి కొట్టాల యాదగిరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎడ్ల నర్సింలు,పట్టణ యువజన అధ్యక్షుడు కూరాకుల శ్రీకాంత్,7వ వార్డు అధ్యక్షుడు కుమార్,నరేందర్ రెడ్డి, స్వామి, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్లుగా ప్రశాంత్, శ్రీధర్

గజ్వేల్: 25 సెప్టెంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి):

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవ కమిటీ రాష్ట్ర కన్వీనర్లుగా గజ్వేల్ ప్రాంతానికి చెందిన ఎన్ఎస్‌యూఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ రాచకొండ, రామ్‌గారి శ్రీధర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఈ సందర్భంగా శుక్రవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తమపై నమ్మకంతో చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవ కమిటీ రాష్ట్ర కన్వీనర్లుగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి,రజక కార్పొరేషన్ చైర్మన్ దాసరి అజయ్‌కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ చాకలి ఐలమ్మ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.





సహాయ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా సిద్ధి వినాయక నిమజ్జనోత్సవం

రూ.1,36,116కు భారీ వినాయకుడి లడ్డూ..
దక్కించుకున్న కౌన్సిలర్ గోలి మమత సంతోష్
వేలంలో దక్కిన లడ్డూను కాలనీవాసులకు పంచిన కౌన్సిలర్

గజ్వేల్:25 సెప్టెంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి):

గజ్వేల్ పట్టణంలోని వాసవి నగర్‌లో సహాయ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాలు గురువారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ముగిశాయి. సెప్టెంబర్ 14న ప్రారంభమైన ఉత్సవాలు పది రోజులపాటు వైభవంగా కొనసాగాయి. ఉత్సవాల చివరి రోజు వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, మహిళలు మంగళహారతులు సమర్పించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా భారీ వినాయక విగ్రహం వద్ద పురోహితుడు నందగారి శ్యాంప్రసాద్ సమక్షంలో లడ్డూ వేలం నిర్వహించారు. పోటాపోటీగా సాగిన వేలం పాటలో 2వ వార్డు కౌన్సిలర్ గోలి మమత సంతోష్ రూ.1,36,116కు లడ్డూను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినాయకుడి లడ్డూను దక్కించుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. వేలంలో దక్కిన లడ్డూను కాలనీవాసులందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా కౌన్సిలర్‌ను కాలనీవాసులు అభినందించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వినాయక విగ్రహాన్ని మంగళవాయిద్యాలు,భక్తుల జైకారాల మధ్య ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. యువత ఉత్సాహంగా పాల్గొనగా,మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారికి వీడ్కోలు పలికారు. నిమజ్జన ప్రదేశానికి చేరుకున్న భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తిశ్రద్ధలతో వినాయకుడి నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేశారు.



సీఎం పర్యటనకు పకడ్బందీ కార్యాచరణ

- అధికారులకు కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశం.

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబరు 25 (ప్రజా కలం ప్రతినిధి) : ఈ నెల 30న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని



కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. సీఎం పర్యటన ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో శుక్రవారం ఎస్పీ మహేష్ బి.గితె, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు.సీఎం పర్యటనలో భాగంగా వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతోపాటు సిరిసిల్ల రగుడు బైపాస్ రోడ్డు సమీపంలోని మైదానంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. శాఖల వారీగా బాధ్యతలు అప్పగించి, పరస్పర సమన్వయంతో ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. సభా ప్రాంగణం, పార్కింగ్, ట్రాఫిక్, తాగునీరు, విద్యుత్తు తదితర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పోలీసు అధికారులు భద్రత, బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకుని అమలు చేయాలని ఎస్పీ సూచించారు. ఈసమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు శ్రీధర్‌బాబు, కేఎస్‌బీ కుమారి, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖితతోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కళా ప్రదర్శనతో ప్రజలకు అవగాహన.

సంక్షేమ పథకాలు, రోడ్డు భద్రతపై సందేశాలు.

దుబ్బాక ప్రజాకలం సెప్టెంబర్ 25: ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రోడ్డు భద్రత, గంజాయి--డ్రగ్స్ నిర్మూలన, సీజనల్ వ్యాధుల నివారణ, పరిసరాల పరిశుభ్రతపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు కళా ప్రదర్శనల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. శుక్రవారం రాయపోల్ మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బిజ్జూరి రవికుమార్ ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహించారు. టీఎస్ఎస్ దుబ్బాక బృందం లీడర్ బిట్ల ఎల్లయ్య ఆధ్వర్యంలో కళాకారులు మాటలు, పాటలు, కళారూపాల ద్వారా పలు అంశాలపై సందేశాలు ఇచ్చారు. సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులను నివారించవచ్చని వివరించారు. కార్యక్రమంలో కళాకారులు ఆస రామారావు, కమ్మరి నర్సయ్య, పిల్లుట్ల ప్రకాశ్, తుమ్మల ఎల్లయ్య, సందుర్ల శేఖర్, జినుక దేవదాసు పాల్గొన్నారు.

పటాన్‌చెరులో అంగరంగ వైభవంగా గణేష్ శోభాయాత్ర

పటాన్‌చెరు, సెప్టెంబరు 25 (ప్రజా కలం ప్రతినిధి):

'బై బై గణేశా' అంటూ భక్తులు గణనాథుడికి వీడ్కోలు పలికారు. పటాన్‌చెరులోని సాయిచెరువులో శ్రీ విఘ్నేశ్వర స్వామి నిమజ్జనం శుక్రవారం భక్తిశ్రద్ధల మధ్య జరిగింది. టీమ్ రుద్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ శోభాయాత్రలో యువకులు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యుత్ దీపాలంకరణలు, నృత్యాలు, బతుకమ్మ పాటలతో శోభాయాత్ర సందడిగా సాగింది.

మూడు లడ్డూలకు రూ.1,36,667

విఘ్నేశ్వర స్వామికి ప్రత్యేక పూజల అనంతరం నిర్వహించిన లడ్డూ వేలంపాటలో మూడు లడ్డూలకు కలిపి రూ.1,36,667 రాబడి వచ్చింది. తొలి లడ్డూను కృష్ణ రూ.41,000కు, రెండో లడ్డూను అబ్దుల్ ఖాదీర్ రూ.39,001కు, మూడో లడ్డూను సన్నీ కుమార్ రూ.56,666కు దక్కించుకున్నారు.



వేలంపాటలో తొలిసారిగా అబ్దుల్ ఖాదీర్ రెండో లడ్డూను కైవసం చేసుకున్నారు.

భక్తులతో కలిసి శోభాయాత్ర: దిశా కమిటీ సభ్యురాలు, భాజపా జిల్లా మహిళా మోర్చా నాయకురాలు కొల్లోల సుజాత, టీమ్ రుద్ర యూత్ అసోసియేషన్ పటాన్‌చెరు అధ్యక్షుడు కొర్వి సాయి చందు ముదిరాజ్ ఆధ్వర్యంలో శోభాయాత్ర ప్రారంభ మైంది. గణనాథుడి విగ్రహాన్ని చిన్నారులు శిరస్సుపై మోస్తూ ముందుకు సాగగా.. భక్తులు 'జై బోలో గణేశ్ మహారాజ్' నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా సాయి చందు మాట్లాడుతూ.. టీమ్ రుద్రలోని సుమారు 30 మంది గణేశ్ భక్తులు స్నేహభావంతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నా రని తెలిపారు. తమ మధ్య భేదాలు లేవని, అందరూ ఒక్కటేనని పేర్కొన్నారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా సోదరభావం, ఐక్యతను చాటుకోవడం సంతోషంగా ఉంద న్నారు.

పోలీసులకు కృతజ్ఞతలు :గణేష్ శోభాయాత్ర, నిమజ్జనం ప్రశాంతంగా జరిగేందుకు ప్రభుత్వం, పోలీసు శాఖ, జీహెచ్ఎంసీ సిబ్బంది అందించిన సహ కారానికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. శాంతిభద్రతల పరిర క్షణకు పోలీ సులు అంకితభావంతో విధులు నిర్వహించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో చిట్ల శివకుమార్ ముదిరాజ్ (పీఆర్ అండ్ మీడియా సంచాలకులు), గౌతం నగర్ భాజపా బూత్ అధ్యక్షుడు కుందన్ ముది రాజ్, హైదరాబాద్ పెన్సిల్ ఆర్టిస్ట్ చిట్ల కార్తీక్ ముది రాజ్, చందు,మణి, ముఖేష్ ముది రాజ్, నాగసాని జగదీష్ ముదిరాజ్, రిషి కుమార్ ముదిరాజ్, సాయి కుమార్ ముదిరాజ్, సన్నీ కుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వీరభద్ర యూత్ ఆధ్వర్యంలో ఘనంగా గణపతి వీడ్కోలు

డీజే మోతతో యువత నృత్యాలు.. మహిళల కోలాటాలతో సందడి
గణేష్ నామస్మరణతో మార్మోగిన న్యూ రామ్‌నగర్.. ఐక్యత చాటిన కాలనీ ప్రజలు

ఉప్పల్ సెప్టెంబర్ 25(ప్రజాకలం న్యూస్)

న్యూ రామ్‌నగర్‌లో వీరభద్ర టీం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు.గణేష్ ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన నిమజ్జన కార్యక్రమంలో కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో గణపతిని సాగనంపారు. వేడుకల్లో మహిళలు, పురుషులు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా సందడి చేశారు. డీజే బాక్సుల మోతతో న్యూ రామ్‌నగర్ వీధులు మార్మోగగా.. యువత ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మహిళలు సంప్రదాయబద్ధంగా కోలాటాలు ఆడుతూ గణనాథుడికి వీడ్కోలు పలికారు. చిన్నారులు సైతం గణేష్ పాటలకు నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు.



గణేష్ నామస్మరణతో మార్మోగిన కాలనీ

'గణపతి బప్పా మోరియా' అంటూ భక్తులు పెద్దఎత్తున నినాదాలు చేయడంతో న్యూ రామ్‌నగర్ పరిసర ప్రాంతాలు భక్తి పారవశ్యంలో మునిగిపోయాయి. గణనాథుడి ప్రతిమను ప్రత్యేకంగా అలంకరించి, పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం నిమజ్జనానికి తరలించారు.

అడుగడుగునా భక్తుల సందడి

గణపతి శోభాయాత్ర సాగినంతసేపు మహిళలు, పురుషులు, యువత, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డీజే సంగీతానికి యువత చేసిన నృత్యాలు, మహిళల కోలాటాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కాలనీ వీధుల్లో ఎటుచూసినా గణేష్ నామస్మరణ, భక్తుల సందడి కనిపించింది.

కాలనీ ఐక్యతకు ప్రతీకగా వేడుకలు

వీరభద్ర టీం సభ్యులు సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించడంతో వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి. కాలనీ ప్రజలు ఒకే వేదికపై కలిసి గణనాథుడికి వీడ్కోలు పలకడం ద్వారా తమ ఐక్యతను చాటుకున్నారు. భక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్సాహంతో సాగిన గణవతి వీడ్కోలు కార్యక్రమం న్యూ రామ్‌నగర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.గణనాథుడి ఆశీస్సులతో కాలనీ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ఆకాంక్షించారు. గణపతి నిమజ్జనంతో ఉత్సవాలు ముగిసినా.. భక్తులలో గణనాథుడి జ్ఞాపకాలు, ఉత్సవ సందడి చిరస్మరణీయంగా నిలిచాయి.

ఆర్‌అండ్‌ఆర్ కాలనీల సమస్యలకు
పరిష్కారం చూపుతాం



- పెండింగ్ అంశాలపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు.. కలెక్టర్ హైమావతి

గజ్వేల్ నియోజకవర్గం: 25 సెప్టెంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి):

గజ్వేల్ నియోజకవర్గంలోని కొండపోచమ్మ సాగర్,మల్లన్న సాగర్ ప్రాజెక్టుల నిర్మాణం కోసం భూములు కోల్పోయిన నిర్వాసితుల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు.శుక్రవారం ములుగు మండలంలోని కొండపోచమ్మ సాగర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ,గజ్వేల్ పట్టణంలోని ముట్రాజ్‌పల్లి పరిధిలోని మల్లన్న సాగర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో పరిహారం,పునరావాసం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలు, ఇళ్ల స్థలాలు తదితర అంశాలు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పెండింగ్ సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించి, అవసరమైన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపిస్తామని చెప్పారు. ప్రభుత్వం నుంచి బడ్జెట్ మంజూరైన వెంటనే అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నిబంధనల ప్రకారం ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పెండింగ్ అంశాలను పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ప్రాజెక్టుల కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు ప్రభుత్వం అందించాల్సిన ప్రయోజనాలు అర్హత మేరకు అందేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.కొండపోచమ్మ సాగర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో చెరువు పక్కన నిర్మాణాలు చేపడుతున్న నేపథ్యంలో చెరువు ఎఫ్‌టీఎల్ బౌండరీలను నిర్ధారించాలని ములుగు తహశీల్దార్‌ను ఆదేశించారు. ఎఫ్‌టీఎల్‌కు అనుకుని ప్లాట్లు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నిర్వాసితుల పునరావాసం కోసం భూసేకరణ చేసినప్పటికీ ఎవరికీ కేటాయించకుండా, ఎలాంటి నిర్మాణాలు చేపట్టని భూములను వెంటనే స్వాధీనంలోకి తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.ఆయా భూములు ఆక్రమణలకు గురికాకుండా, పంటలు సాగు చేయకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఆర్డీఓ చంద్రకళ, సిద్దిపేట ఆర్డీఓ సదానందం, ఆయా మండలాల తహశీల్దార్లు,స్థానిక ప్రజాప్రతినిధులు,ఆర్‌అండ్‌ఆర్ కాలనీల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన భక్తులకు ప్రసాద వితరణ
సేవాభావంతో 'మానవసేవే మాధవసేవ' బృందం కార్యక్రమం

మల్కాజిగిరి, సెప్టెంబరు 25 (ప్రజా కలం ప్రతినిధి): వినాయక నిమజ్జనానికి తరలివచ్చిన భక్తులకు 'మానవసేవే మాధవసేవ' బృందం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. సఫిల్‌గూడ మినీ ట్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భక్తులకు ప్రసాదం, తాగునీరు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాగంగా గణనాథుడు, సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్పస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు పులిహోర, దద్దోజనం, తాగునీరు అందించారు. ఈ సందర్భంగా బృందం నిర్వాహకుడు కుమ్మరి రాజు మాట్లాడుతూ వినాయక నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఆహారం, తాగునీరు అందించాలనే సంకల్పంతో గత ఐదేళ్లుగా సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన బృంద సభ్యులు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.శ్రీనివాస క్యాటరర్స్ శ్రీనివాసరావు, లక్ష్మణ్ యాదవ్, ఎక్సైడ్ బ్యాటరీస్ వెంకటేష్, మోహన్ రాజు, డాక్టర్ సుధాకర్, జంగాల శ్రీరామ్ యాదవ్, శ్రీనివాస్ చారి, మహమ్మద్ రషీద్ తదితరుల సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.



కార్యక్రమంలో కుమ్మరి రాజు, మహమ్మద్ రషీద్, వెంకటేష్, రాహుల్ తదితరులు పాల్గొని భక్తులకు ప్రసాదాలు, తాగునీరు పంపిణీ చేశారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి నిమజ్జన పర్యవేక్షణ

- నిజామాబాద్ నగరంలో 200 సీసీ కెమెరాలతో పోలీస్ నిఘా

- శాంతియుతంగా జరుపుకోవాలని సీపీ పి. సాయి చైతన్య పిలుపు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) సెప్టెంబర్ 25:

నగరంలో వినాయక నిమజ్జన మహోత్సవాన్ని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసింది. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య కమాండ్ కంట్రోల్ హాల్ నుంచి నిమజ్జన ప్రక్రియను క్షుణ్ణంగా




పర్యవేక్షించారు. నగరవ్యాప్తంగా కీలక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 200 సీసీ కెమెరాల నిఘా వ్యవస్థ ద్వారా శాంతిభద్రతల పరిస్థితిని ఆయన ఎప్పటికప్పుడు సమీక్షించారు. ప్రధాన రహదారులు, శోభాయాత్ర సాగే మార్గాలు, విగ్రహాల తరలింపు ప్రాంతాలతో పాటు నిమజ్జన వేదికల వద్ద రద్దీని సీసీ కెమెరాల ద్వారా వీక్షించారు. క్షేత్రస్థాయిలో విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందికి వైర్‌లెస్ సెట్ల ద్వారా అవసరమైన సూచనలు చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా నివారించాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, ప్రజలు పోలీస్ యంత్రాంగానికి సహకరించి నిమజ్జన వేడుకలను శాంతియుతంగా, సురక్షితంగా ముగించుకోవాలని సీపీ కోరారు.

సుంకెట్ జడ్పీహెచ్ఎస్‌కు రూ.20 వేల విరాళం

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) సెప్టెంబర్ 25:

నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని సుంకెట్ గ్రామా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్) సైన్స్ ల్యాబ్ అభివృద్ధికి బెంగళూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రామకృష్ణ ముదుల రూ.20,000 ఆర్థిక సహాయాన్ని



అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెద్ది సంతోష్ కుమార్ ప్రోత్సాహంతో ఆయన ఈ విరాళాన్ని అందజేశారు. సమాజం పట్ల బాధ్యతతో విద్యార్థుల శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు రామకృష్ణ ముందుకు రావడం అభినందనీయమని పాఠశాల సిబ్బంది కొనియాడారు. ఈ ఉదారతకు గాను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు దాతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

సుపతం హోటల్స్, బ్యాంకెట్ హాల్ ప్రారంభించిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ గండిమైసమ్మ -- డీ.పోచంపల్లి నూతనంగా ఏర్పాటు చేసిన సుపతం హోటల్స్ మరియు బ్యాంకెట్ హాల్ మేడ్చల్



జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ప్రారంభించారు. ఈసందర్భంగా సుపతం హోటల్స్ మరియు బ్యాంకెట్ హాల్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ప్రారంభించిన ఈసంస్థ మంచి ఆదరణ పొందుతూ విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ప్రజలకు నాణ్యమైన ఆతిథ్య సేవలు అందిస్తూ మంచి పేరు సంపాదించాలని, వ్యాపారం మరింత అభివృద్ధి చెందాలని నిర్వాహకులకు సూచించారు. స్థానికంగా కొత్త వ్యాపారాలు ప్రారంభం కావడం ద్వారా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని తెలిపారు. ఈకార్యక్రమంలో తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, నిర్వాహకులు, మరియు తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయ పనులు వేగవంతం చేయాలి

- అధికారులకు కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశం.

వేములవాడ, సెప్టెంబరు 25 (ప్రజా కలం ప్రతినిధి) : వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం పరిశీలించారు. వీటీఏడీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న ఆలయ విస్తరణ పనులతోపాటు నిత్యాన్నదాన సత్రం నిర్మాణ పనులను ఆర్‌అండ్‌బీ, ఆలయ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తయిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. అవసరమైన సిబ్బందిని నియమించుకుని పనుల్లో జాప్యం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈపరిశీలనలో ఆలయ ఈఓ రమాదేవి, ఆర్డీఓ కేఎస్‌బీ కుమారి, ఆర్‌అండ్‌బీ ఈఈ భీమ్లానాయక్, ఆలయ ఈఈ రాజేష్, ఆర్‌అండ్‌బీ డీఈ శాంతయ్య, మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.



కోటక్ లైఫ్ పాలసీబజార్‌లో టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్

'కోటక్ ప్రొటెక్ట్ అడ్వాంటేజ్'ను లాంచ్

ముంబై, సెప్టెంబర్ 25
(ప్రజా కలం ప్రతినిధి)



కోటక్ మహీంద్రా లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ ("కోటక్ లైఫ్") మరియు పాలసీబజార్ కలిసి కోటక్ ప్రొటెక్ట్ అడ్వాంటేజ్‌ను ప్రారంభించినట్లు ప్రకటించాయి. ఇది కుటుంబ ఆర్థిక భవిష్యత్తును కాపాడేలా ఒక ఫ్లెక్సిబుల్ మరియు పూర్తి స్థాయి రక్షణ ప్లాన్. ఇందులో హై లైఫ్ కవర్‌తో పాటు కస్టమర్ల అవసరాలకు తగ్గట్టుగా ఎన్నో ఫీచర్లు ఉన్నాయి, ఇవి జీవితంలోని ప్రధాన ఘట్టాలలో మారుతున్న రక్షణ అవసరాలను తీరుస్తాయి.

కోటక్ లైఫ్ డిప్యూటీ ఎండి అమిత్ పాల్టా మాట్లాడుతూ, "లైఫ్ ఇన్సూరెన్స్ భవిష్యత్తు అనేది విభిన్న కస్టమర్ విభాగాలకు సంబంధిత పరిష్కారాలను అందించడంలో ఉంది. కోటక్ లైఫ్ వద్ద, మేము మా భాగస్వాములతో కలిసి కస్టమర్ల ప్రత్యేక అవసరాలు మరియు ఆర్థిక ప్రాధాన్యతలను అర్థం చేసుకుని, వాటిని అర్థవంతమైన ఆవిష్కరణలుగా మారుస్తాము. కోటక్ ప్రొటెక్ట్ అడ్వాంటేజ్ ముఖ్యంగా డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ వాడే యువత కోసం రూపొందించబడింది" అని చెప్పారు. పాలసీబజార్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ వివేక్ జైన్ మాట్లాడుతూ, "టర్మ్ ఇన్సూరెన్స్ ఒక వ్యక్తి యొక్క నిజ జీవిత అవసరాలకు అనుగుణంగా ఉండాలి. ప్రజలు జీవితంలోని వివిధ దశల గుండా వెళుతున్నప్పుడు, వారి ఆర్థిక బాధ్యతలు మరియు రక్షణ కూడా మారవలసి ఉంటుంది. పాలసీబజార్ ప్లాట్‌ఫారమ్‌పై కోటక్ ప్రొటెక్ట్ అడ్వాంటేజ్‌ను తీసుకురావడానికి కోటక్ లైఫ్‌తో భాగస్వామ్యం కావడం మాకు సంతోషంగా ఉంది, ఇది కస్టమర్ ప్రయాణంలోని వివిధ దశలలో ఉపయోగపడే ఫీచర్‌లను కలిగి ఉన్న ఉత్పత్తి. ఈ ప్లాన్ కస్టమర్‌లకు అదనపు మెడికల్స్ లేకుండా కీలకమైన లైఫ్ మైల్‌స్టోన్స్‌లో కవర్‌ను పెంచుకోవడానికి, ప్రీమియం విరామం తీసుకోవడానికి, 2 లక్షల క్లెయిమ్ ఇంటిమేషన్‌పై తక్షణ చెల్లింపును పొందడానికి మరియు ఆరోగ్యం మరియు సంక్షేమ ప్రయోజనాలను పొందేందుకు సౌలభ్యాన్ని అందిస్తుంది. ఇది అభివృద్ధి చెందుతున్న కస్టమర్ అవసరాలకు మరింత సంబంధితంగా చేస్తుంది." అని అన్నారు. నేటి యువ వినియోగదారులు ఆర్థిక ప్రణాళికను మునుపటి తరాల కంటే భిన్నంగా చూస్తున్నారు. డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో హైపర్-పర్సనలైజ్డ్ అనుభవాలకు అలవాటు పడిన వారు, తమ ఆర్థిక నిర్ణయాలపై ఫ్లెక్సిబిలిటీ, సౌకర్యం మరియు ఎక్కువ నియంత్రణను కోరుకుంటున్నారు. ఇది లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థలకు వివిధ కస్టమర్ విభాగాల నిర్దిష్ట అవసరాలు మరియు అంచనాలకు తగినట్లుగా ఆఫర్లను రూపొందించే అవకాశాన్ని కల్పించింది.

ఈ మారుతున్న అంచనాలను గుర్తించి, కోటక్ లైఫ్ మరియు పాలసీబజార్ కలిసి కోటక్ ప్రొటెక్ట్ అడ్వాంటేజ్‌ను రూపొందించాయి. ఇది కోటక్ లైఫ్ అనుభవాన్ని మరియు పాలసీబజార్‌కున్న డిజిటల్ పరిజ్ఞానాన్ని కలిపి కస్టమర్ల ఆర్థిక ప్రాధాన్యతలకు అనుగుణంగా తయారు చేయబడింది. ఈ ఉత్పత్తి కస్టమర్‌లకు రెండు ప్లాన్ ఎంపికలు మరియు రెండు పేఅవుట్ ఎంపికల ఎంపికను అందిస్తుంది, తద్వారా వారు వ్యక్తిగత రక్షణ అవసరాలు మరియు కుటుంబ అవసరాల ఆధారంగా కవరేజీని మార్చుకోవడానికి వీలు కల్పిస్తుంది. ఇది ప్రీమియం బ్రేక్ బెనిఫిట్, మైల్‌స్టోన్ అప్‌గ్రేడ్ ఆప్షన్, యాక్సిలరేటెడ్ టెర్మినల్ ఇల్‌నెస్ బెనిఫిట్ మరియు ప్రీమియం వాపస్‌తో కూడిన స్పెషల్ ఎగ్జిట్ బెనిఫిట్ వంటి ఫీచర్‌లతో వస్తుంది, ఇది కస్టమర్‌లకు మరింత ఫ్లెక్సిబిలిటీని మరియు విలువను అందిస్తుంది. రిస్క్ ఫ్యాక్టర్లు, నిబంధనలు మరియు షరతుల గురించి మరిన్ని వివరాల కోసం, కొనుగోలు చేయడానికి ముందు దయచేసి సేల్స్ బ్రోచర్‌ను జాగ్రత్తగా చదవండి.

వలిగొండలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు



వలిగొండ సెప్టెంబర్ 25 ప్రజాకలం: యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని సంజయ్ బెంగళూరు బేకరీ,రాజా శ్యామల హోటళ్లపై శుక్రవారం యాదాద్రి జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి శివ శంకర్ రెడ్డి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. బేకరీలో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా, నాణ్యతలేని పదార్థాలను వాడుతున్నారని విశ్వాసనీయ సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బేకరిలో తయారుచేసిన 30 కేజీల వరకు స్వీట్స్ కేకు లాంటి పదార్థాలను సీజ్ చేశారు.వంట గదులు అపరిశుభ్రంగా ఉన్నాయని,పారిశుధ్యం నిర్వహణ బాగలేదని అధికారులు గుర్తించారు.బేకరీలో స్వీట్లు,బేకరీ ఆహార వస్తువులతో పాటు ఇతర తినుబండారాలను తనిఖీచేశారు.ఆహార పదార్థాల రుచి,వాసన పరిశీలిం పదార్థాలు నిల్వ ఉంచడంపై అధికారి అసంతృప్తి వ్యక్తంచేశారు.కాలం చెల్లిన కేకులు,బిస్కట్ లను గ్రామ పంచాయతీ వాహనంలో డంపింగ్ యార్డు కు తరలించారు.ముడి సరుకుల పదార్థాలను శాంపిల్ సేకరించి ల్యాబ్ పంపిస్తున్నట్లు తెలిపారు.హోటల్, బేకరీల యజమానులు ఆహార భద్రత నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటమన్నారు.

అలికేఫ్ చౌరస్తా ప్రధాన రహదారి అధ్వాన్నం

పట్టించుకోని అధికారులు

నరకప్రాయంగా మారిన ప్రయాణం



అంబర్‌పేట్
సెప్టెంబర్ 25(ప్రజాకలం న్యూస్)

హైద్రాబాద్ నగరంలోని ప్రధాన కూడలి అయిన అలికేఫ్ చౌరస్తా ప్రధాన రహదారి గుంతలమయంగా మారి వాహనదారులు, స్థానికులు నరక యాతన పడుతున్నారు. గత కొంతకాలంగా ఈ రహదారి తీవ్రంగా దెబ్బతిని పెద్ద పెద్ద గుంతలు ఏర్పడినా, సంబంధిత శాఖ అధికారులు మాత్రం కంటితుడుపు చర్యలకైనా పూనుకోవడం లేదని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ బిజీ రోడ్డుపై ప్రయాణించాలంటేనే వాహనదారులు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకోవాల్సి వస్తోంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో వర్షం పడినప్పుడు ఈ గుంతలు కనిపించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పలువురు వాహనదారులు కిందపడి తీవ్ర గాయాలపాలైన సంఘటనలు కూడా ఉన్నాయని స్థానికులు చెప్తున్నారు.ఈ దారుణమైన పరిస్థితిపై స్థానిక ప్రజలు, వ్యాపారులు సంబంధిత మున్సిపల్ రోడ్ల శాఖ అధికారులకు పలుమార్లు లిఖితపూర్వకంగా, సామాజిక మాధ్యమాల ద్వారా విన్నవించినప్పటికీ ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. అధికారులు కేవలం పరిశీలిస్తామని చెబుతున్నారే తప్ప, క్షేత్రస్థాయిలో గుంతలను పూడ్చేందుకు కనీస చర్యలు కూడా చేపట్టడం లేదు. అధికారులు ఇప్పటికైనా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించకుండా, తక్షణమే స్పందించి అలీకేఫ్ చౌరస్తా ప్రధాన రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని స్థానికులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.



ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ చేతుల మీదుగా తులిప్స్ హాస్పిటల్ ప్రారంభం

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) : 127 - రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధి రంగారెడ్డినగర్ ప్రధాన రహదారిలో డాక్టర్ అర్పితా సంజయ్ ఆధ్వర్యంలో





నూతనంగా ఏర్పాటు చేసిన తులిప్స్ హాస్పిటల్ ను బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధునాతన పరిజ్ఞానంతో పేద ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందజేస్తూ తులిప్స్ హాస్పిటల్ దినదినాభివృద్ధి చెందాలన్నారు. ఈకార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఎర్వ శంకరయ్య, ప్రధాన కార్యదర్శి సుధాకర్, సీనియర్ నాయకులు కాప సుబ్బారెడ్డి, యాదిరెడ్డి, క్రాంతియాదవ్, కార్తీక్ గౌడ్, బాలు నేత, ఎస్.కె. షకీల్, టింకు గౌడ్, గంజి ఉదయ్, సోను, మేరీ తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యతగా పనిచేస్తున్నాం

-:బిఆర్ ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) శుక్రవారం పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు, సంక్షేమ సంఘాల సభ్యులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు జనం మెచ్చిన నేత, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి పలు ఆహ్వానాలు, వినతులు అందజేయగా సానుకూలంగా స్పందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజాసంక్షేమం కోసం అధికారులకు సమన్వయంగా పనిచేయాలని సూచించారు.


పటేల్‌నగర్‌లో బెల్ట్‌షాప్ నిర్వాహకుల అరాచకం



జీహెచ్ఎంసీ సిబ్బందిపై దాడి

- అక్రమ మద్యం విక్రయాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

మల్కాజిగిరి,
సెప్టెంబరు 25 (ప్రజా కలం ప్రతినిధి):
గణేష్ నిమజ్జనం సందర్భంగా వైన్ షాపులు మూసివేసిన సమయంలో మల్కాజిగిరి పటేల్‌నగర్‌లో బెల్ట్‌షాప్ నిర్వాహకులు అక్రమంగా మద్యం విక్రయించేందుకు ప్రయత్నించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బెల్ట్‌షాప్ వద్దకు ఆటోలో మద్యం తీసుకొచ్చి డంప్ చేస్తున్న సమయంలో కాలనీలోకి వెళ్లే మార్గంలో వాహనాలు అడ్డంగా ఉండటంతో హారన్ కొట్టి దారి ఇవ్వాలని కోరిన జీహెచ్ఎంసీ కార్మికుడు శ్రీధర్‌పై నిర్వాహకులు దాడికి పాల్పడ్డారని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ ఘటనలో బెల్ట్‌షాప్ నిర్వాహకులతో పాటు వారి కుటుంబ సభ్యులు మూకుమ్మడిగా దాడి చేసి కర్రలతో, పిడిగుద్దులతో కొట్టారని తెలిపారు. దళితులను దుర్భాషలాడారని ఆరోపించారు. ఘటనకు సంబంధించిన దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయని బాధితులు పేర్కొన్నారు. బెల్ట్‌షాప్ నిర్వాహకుల కారణంగా కాలనీలో మహిళలు, స్థానికులకు భద్రత లేకుండా పోయిందని, అక్రమ మద్యం విక్రయాలపై ఎవరైనా ప్రశ్నిస్తే చంపుతామని బెదిరిస్తున్నారని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. ప్రతి సంవత్సరం గణేష్ నిమజ్జనం వంటి సందర్భాల్లో బెల్ట్‌షాప్ వద్ద ఇలాంటి ఘటనలు జరుగుతున్నప్పటికీ ఎక్సైజ్, పోలీసు శాఖలు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. దాడికి పాల్పడిన వారే ముందుగా పోలీసులకు ఫిర్యాదు చేసి ఏమీ తెలియనట్లుగా వ్యవహరిస్తున్నారని బాధితులు ఆరోపించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలించాలని కోరారు. దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయడంతో పాటు అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్‌షాప్ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు, దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.





పటేల్‌నగర్‌లో బెల్ట్ షాపులో బహిరంగంగా

మద్యం విక్రయాలు

అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం

మల్కాజిగిరి, సెప్టెంబరు 25 (ప్రజా కలం ప్రతినిధి):
గణేష్ నిమజ్జనం సందర్భంగా వైన్ షాపులు మూసివేసినప్పటికీ మల్కాజిగిరి పటేల్‌నగర్‌లోని ఓ బెల్ట్ షాపులో నిబంధనలకు విరుద్ధంగా పగటిపూటే మద్యం విక్రయాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.బెల్ట్ షాపు వద్ద నలుగురు, ఐదుగురు సిబ్బందిని ఏర్పాటు చేసి వినియోగదారులకు మద్యం విక్రయిస్తున్నా ఎక్సైజ్,పోలీసు అధికారులు



పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బెల్ట్ షాపు నిర్వాహకులు పోలీసులకు,ఎక్సైజ్ అధికారులకు డబ్బులు ఇస్తున్నామని బహిరంగంగా చెబుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎస్ఓటీ పోలీసులు సైతం చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మద్యం కల్తీ జరిగి ప్రమాదం చోటుచేసుకుంటే బాధ్యత ఎవరిదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వైన్ షాపులు మూసివేసే పండుగలు, గాంధీ జయంతి వంటి ప్రత్యేక రోజుల్లోనూ బెల్ట్ షాపులో మద్యం విక్రయాలు జరుగుతున్నాయని, వైన్ షాపులు బంద్ చేసిన తర్వాత మధ్య రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు అమ్మకాలను చేస్తారని ప్రశ్నించిన స్థానికులతో నిర్వాహకులు గొడవలకు దిగుతున్నారని వారు చెబుతున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ బహిరంగంగా మద్యం విక్రయిస్తున్న వారిపై సంబంధిత శాఖల అధికారులు, పోలీసులు తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మల్కాజిగిరిలో ఈసీ దిష్టిబొమ్మ దగ్ధం

ఎస్ఐఆర్‌పై ఈసీ రాజీనామా చేయాలి: మైనంపల్లి



మల్కాజిగిరి,
సెప్టెంబరు 25 (ప్రజా కలం ప్రతినిధి):
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారంటూ కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం మల్కాజిగిరిలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.

మాజీ ఎమ్మెల్యే మైనంవల్లి హనుమంతరావు కార్యక్రమంలో పాల్గొన్నారు. మల్కాజిగిరిలో 2.31 లక్షలకు పైగా ఓట్లు మాయమయ్యాయని మైనంపల్లి ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత పాటించాలని, అర్హులైన ఓటర్ల పేర్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే మార్చాలని, ఎస్ఐఆర్ ప్రక్రియపై ఎన్నికల సంఘం బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియపై ఇప్పటికే పెద్ద సంఖ్యలో నోటీసులు జారీ కావడం, వాటిలో గణనీయమైన సంఖ్య పెండింగ్‌లో ఉండటంపై కూడా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ప్రేమ్ కుమార్ జితేంద్రనాథ్ మల్కాజిగిరి ఇంచార్జ్ లక్ష్మీకాంతరెడ్డి బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ బి కే శ్రీనివాస్,గుండా నిరంజన్, జిఎన్వి సతీష్ కుమార్,పిట్టల శ్రీనివాస్,రాందాస్ సంతోష్ ముదిరాజ్, డివిజన్ అధ్యక్షులు జీడి సంపత్ గౌడ్,వైనాల ప్రవీణ్, సత్యమూర్తి, యూసుఫ్ భాయ్,పిట్టల నాగరాజు, రాఘవన్,శ్రీకాంత్ ముదిరాజ్,వినోద్ యాదవ్,లక్ష్మీ, ఇందిర ప్రియదర్శిని ప్రభా,ఆశా, శారద,పుష్పలత, కనకలక్ష్మి, సత్యనారాయణ, ఫరీద్, సయ్యద్ మబ్బు,ఫరూక్,మంద భాస్కర్, సురేష్ సింగ్,కన్నె మల్ల నాగరాజు,బ్రహ్మయ్య, రామకృష్ణవెంకన్న,జీడి చరణ్ జిత్ గౌడ్,చుంకూ శ్రీనివాస్, ధరన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

22ఏ జీవో సవరణపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు

మల్కాజిగిరిలో కాంగ్రెస్ నేతల సంబరాలు



మల్కాజిగిరి, సెప్టెంబరు 25
(ప్రజా కలం ప్రతినిధి):
నిషేధిత భూముల జాబితా నుంచి అర్హత కలిగిన ఆస్తులకు విముక్తి కల్పించేలా తెలంగాణ ప్రభుత్వం 22ఏ నిబంధనల్లో సవరణలు చేయడంపై మల్కాజిగిరిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం సంబరాలు నిర్వహించారు. బాణాసంచా కాల్చి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సాంకేతిక కారణాలు, రెవెన్యూ రికార్డుల్లో లోపాల కారణంగా 22ఏ నిషేధిత జాబితాలో చిక్కుకున్న వేలాది ప్లాట్లు, ఇళ్లు, ఫ్లాట్ల యజమానులకు తాజా నిర్ణయం ఉపశమనం కలిగిస్తుందని నాయకులు పేర్కొన్నారు. ప్రజల తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ తాజా సవరణలతో చట్టబద్ధమైన అనుమతులు పొందిన ఆస్తులకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించినట్లు నాయకులు తెలిపారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ వంటి చట్టబద్ధ సంస్థల నుంచి లేఅవుట్ లేదా నిర్మాణ అనుమతులు పొందిన ఆస్తులు 22ఏ జాబితాలో ఉన్నప్పటికీ, నిబంధనలకు అనుగుణంగా ఉంటే రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. అనుమతుల అనంతరం జరిగిన లావాదేవీలకు సంబంధించిన అనుసంధాన పత్రాలను సమర్పించడం ద్వారా ప్రక్రియను వేగవంతం చేయవచ్చని తెలిపారు. ముఖ్యమంత్రి అసెంబ్లీలో ఇచ్చిన హామీ మేరకు సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కలెక్టర్ల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ దేవసేన నేతృత్వంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి భూములకు సంబంధించిన అక్రమాలపై విచారణ చేపట్టినట్లు తెలిపారు. రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లో సుమారు లక్ష మందికి పైగా ఆస్తి యజమానులకు ఈ నిర్ణయం ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉందని నాయకులు పేర్కొన్నారు. జీవో 118 కింద 64 కాలనీల క్రమబద్ధీకరణ, జీవో 76 కింద సింగరేణి కార్మికుల ఇళ్ల స్థలాల సమస్యల పరిష్కారానికి కూడా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకటేష్ యాదవ్, బీకే శ్రీనివాస్, గుండా నిరంజన్, జీఎన్వీ సతీష్, ఎస్ఆర్ ప్రసాద్, పిట్ల శ్రీనివాస్, మంద భాస్కర్, ధరన్ కుమార్, సిరిగిరి రాజు తదితరులు పాల్గొన్నారు.





భక్తిశ్రద్ధల మధ్య గణనాథుడి నిమజ్జనం

దుబ్బాక ప్రజాకలం సెప్టెంబరు 25: దౌల్తాబాద్ మండల కేంద్రంలో బజరంగ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణనాథుడి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజల అనంతరం గణనాథుడి నిమజ్జన శోభాయాత్రను మేళతాళాల నడుమ ఘనంగా నిర్వహించారు. అలంకరించిన వాహనంపై గణనాథుడిని ప్రతిష్ఠించి నిర్వహించిన శోభాయాత్రలో యువత, మహిళలు, చిన్నారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డప్పుల మోతలు, భక్తిగీతాలు, కోలాట ప్రదర్శనలు, యువత నృత్యాలతో మండల కేంద్రంలో సందడి నెలకొంది. ప్రధాన వీధుల గుండా సాగిన శోభాయాత్రలో భక్తులు 'గణపతి బప్పా మోరియా' అంటూ నినాదాలు చేశారు. అనంతరం గణనాథుడిని భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన బజరంగ్ యూత్ సభ్యులను పలువురు అభినందించారు. అనంతరం దౌల్తాబాద్ ఎస్ఐ అరుణ్‌కుమార్, ఉపసర్పంచ్ ఆది బాలకృష్ణ, మాజీ సర్పంచ్ ఆది వేణుగోపాల్, ముద్రకొల్ల భానుప్రసాద్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బజరంగ్ యూత్ సభ్యులు, భక్తులు, యువత, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.



సామాజిక సేవకు గుర్తింపు

డా. సుల్తాన ఉమర్‌కు మంతూర్ సర్పంచ్ పర్వేజ్ సన్మానం.



దుబ్బాక ప్రజాకలం సెప్టెంబర్ 25.
సామాజిక సేవా రంగంలో విశేష సేవలందిస్తున్న డా. మహమ్మద్ సుల్తాన ఉమర్‌కు న్యూ లైఫ్ థీయాలాజికల్ యూనివర్సిటీ డాక్టరేట్, మదర్ థెరిసా సేవారత్న అవార్డు, బంగారు పతకం లభించడంతోపాటు డెమొక్రటిక్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మహిళా విభాగం సిద్దిపేట జిల్లా అధ్యక్షురాలిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంతూర్ సర్పంచ్ పర్వేజ్ శుక్రవారం ఆమెను సన్మానించి అభినందించారు. పేదలు, అనాథలు, నిరాశ్రయులకు అండగా నిలుస్తూ ఆమె చేస్తున్న సేవలు అభినందనీయమని పర్వేజ్ అన్నారు. మహిళగా సామాజిక సేవలో ముందుండి మానవతా దృక్పథంతో సేవలందించడం స్ఫూర్తిదాయకమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.

Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com